ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 03.03.2026 | సంపుటి :12 సంచిక : 223 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



## నేను ప్రధాని అయ్యేందుకు సిద్ధం



19 ఏళ్ల కిందట జడ్పీటీసీగా ప్రారంభమైన నా రాజకీయ ప్రయాణం ముఖ్యమంత్రి పదవికి చేరింది. ప్రజా సమస్యలపై గళమెత్తినందుకు నాపై కేసులు నమోదయ్యాయి. నిన్న కూడా కోర్టుకు హాజరయ్యాను. దేశం కోసం, పార్టీ కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ప్రతి నాయకుడు అదే లక్ష్యంతో పని చేయాలి.గత ఐదేళ్ల పోరాటాల ఫలితంగా రాహుల్ గాంధీ లోక్‌సభ ప్రతిపక్ష నేతగా ఎదిగారు.

- సీఎం రేవంత్ రెడ్డి

## రాహుల్‌ను ప్రధానిని చేయాలి

- ఓ కాంగ్రెస్ కార్యకర్తగా నేను బలంగా కోరుకుంటున్నాను
- అదే దేశానికి క్షేమం.. మన కర్తవ్యం కూడా..
- అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం
- డీసీసీ అధ్యక్షులు శిక్షణ శిబిరం ముగింపులో సీఎం రేవంత్

**వికారాబాద్ బ్యూరో(జనంసాక్షి):**లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాహుల్

మిగతా 2లో..



## మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి

- బయటపడుతున్న ప్రధాని కుట్రలు
- ఇరాన్ లాంటి దుస్థితి భారత్‌కు రాకూడదు
- మోడీ తీరుతో ప్రమాదంలో దేశ పరిస్థితి
- వికారాబాద్ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్ గాంధీ

**వికారాబాద్ బ్యూరో(జనంసాక్షి):**అనంతగిరి హిల్స్ లో నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ ముగింపు సభ లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యా ఖ్యలు చేశారు. తాను ప్రధాని పదవి చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తొలుత సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు. రాహుల్ ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నానమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ ప్రధానులు అయ్యారని, కాబట్టి ఆయనకు ప్రధాని పదవిపై వ్యామోహం లేదని అన్నారు. కానీ, ఇవాళ దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో రాహుల్ ప్రధాని కావాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. దేశం కోసమైనా ప్రధాని కావాల్సిందేనని, తాను ముఖ్యమంత్రిగా అడగడం లేదని, ఓ కాంగ్రెస్ కార్యకర్తగా కోరుకుంటున్నానని అన్నారు. ఆయన ప్రధాని పదవి చేపట్టేలా కృషి చేయాలని నేతలకు పిలుపునిచ్చారు. రేవంత్ అభ్యర్థనపై స్పందించిన రాహుల్ గాంధీ.. మోదీపై యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

మిగతా 2లో..

## శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోలీ

ప్రజలకు సీఎం రేవంత్, గవర్నర్, పండుగ శుభాకాంక్షలు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పండుగగా హోలీని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోలీ అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సహజ సిద్ధమైన రంగులు, సాంప్రదాయ పద్ధతులతో పండుగను జరుపుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సమైక్యతను చాటే పండుగ హోలీని వేడుకగా జరుపుకోవాలని అన్నారు. అలాగ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రజల్లో రంగులు నింపాలని కోరుకున్నారు.

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై హైకోర్టు వాదనలు



## విచారణ నేటికి వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):**జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ రిపోర్ట్ ను రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కేసీఆర్, హరీశ్ రావు, ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన ఈ పిటిషన్లపై ఇవాళ ఉన్నత



న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరఫున నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేసీఆర్ తరుపున లాయర్లు వాదనలు వినిపించారు. సాక్షులు ఎవరైనా పిటిషనర్ కు వ్యతిరేకంగా స్టేట్మెంట్ ఇస్తే అప్పుడు నోటీస్ జారీ చేసి వారి వాదన వినాలని చట్టం చెబుతుందని కేసీఆర్ తరఫు న్యాయవాది వెల్లడించారు. నివేదికలో తీవ్ర ఆరోపణలు చేయడం , పిటిషనర్ పరువు, కీర్తికి నష్టం కలిగేలా చేయడం సరైంది కాదని హైకోర్టుకు తెలిపారు. దే సమయంలో ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కూడా పలు అంశాలను ప్రస్తావించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందో తెలుసుకునే హక్కు

మిగతా 2లో..

## యుద్ధం నేపథ్యంలో

### ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో హెల్ప్ సెంటర్

- హెల్ప్‌లైన్ నంబర్ 24 గంటలు అందుబాటులోకి..
- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- శంషాబాద్ నుంచి పలు విమానాల రద్దు
- దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల
- క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ పౌరుల కోసం న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24×7 కంట్రోల్ రూమ్ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పశ్చిమ ఆసియా ప్రాంతంలోని కొన్ని దేశాల్లో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది.న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో ఇప్పటికే నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు .ఆయా దేశాల్లో నివసిస్తున్న,చిక్కుకున్న తెలంగాణ పౌరులు వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న విచారణలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రభుత్వం న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో

మిగతా 2లో..

## చర్చల ద్వారా పరిష్కరించుకోండి

సౌదీ, బహ్రెయిన్ దేశాధినేతలకు మోదీ ఫోన్

ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ దాడులను ఖండించిన భారత ప్రధాని

2లో..




## పశ్చిమాసియాలో తగ్గని ఉద్రిక్తతలు

### అమెరికాతో చర్చల ప్రసక్తే లేదు:ఇరాన్

బహ్రెయిన్,దుబాయ్, దోహా, అబుదాబి,కువైట్ నగరాలపై వైమానిక, మిస్సైల్, డ్రోన్లతో ముప్పేట దాడులు

- సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై డ్రోన్ దాడి.. చమురు ఉత్పత్తిపై ఎఫెక్ట్
- నెతన్యాహు కార్యాలయంపైనా దాడులు!
- కువైట్‌లో 3 అమెరికా యుద్ధ విమానాలను కూల్చేసిన ఐఆర్‌జీసీ
- చమురు ట్యాంకర్‌పై దాడి.. భారతీయ సిబ్బంది ఒకరు మృతి

సౌదీలోని ప్రపంచంలోనే అతిపెద్ద చమురు రిఫైనరీ అరామ్‌కోపై ఇరాన్ డ్రోన్ దాడి..



### ఇరాన్‌పై కొనసాగిన అమెరికా-ఇజ్రాయిల్ దాడులు

- టెహ్రాన్‌లో గాంధీ హాస్పిటల్‌పై వైమానిక దాడులు
- 165కు చేరుకున్న పాఠశాల దాడి మృతులు
- లెబనాన్ రాజధాని బీరూట్‌పైనా బాంబుల వర్షం
- ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్‌బొల్లా కీలక నేత మృతి

2లో..

**టెహ్రాన్,టెల్అవీవ్(జనంసాక్షి):** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారింది. తమ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ దాడులు చేపట్టింది. దీంతో పరిస్థితులు మరింత దిగజారాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో పొగ దట్టంగా అలముకుంది. అంబులెన్స్‌లు, అగ్నిమాపక యంత్రాలు అక్కడికి చేరుకున్నట్లు పలు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి.మరోవైపు, ఇరాన్ డ్రోన్ దాడులతో బహ్రెయిన్ రాజధాని మనామాతో

మిగతా 2లో..



ఇజ్రాయెల్‌లో ఓ భవనంపై ఇరాన్ దాడిలో అలుముకున్న పొగ



## ఇరాన్‌తో యుద్ధం మరో 4-5 వారాలు జరగొచ్చు

- చర్చల కోసం మా దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయి
- ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పిస్తాం: ట్రంప్
- యుద్ధం మేం మొదలు పెట్టలేదు.. కానీ ముగించేది మేమే
- అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు

2లో..

## భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటోంది

### భారత్-కెనడా దేశ ప్రధానుల సంయుక్త ప్రకటన

- అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో చేరాలని కెనడా నిర్ణయం
- నిర్ణయాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ
- ఇరు దేశాల మధ్య యురేనియం డీల్
- కార్నీ పర్యటన వేళ కీలక ఒప్పందం!



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్, కెనడా మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. ఇరు దేశాల మధ్య యురేనియం సరఫరా సహా పలు కీలక రంగాల్లో చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరాయి. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అనంతరం రెండు దేశాలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ రంగంలో భారత్‌కు దీర్ఘకాలికంగా యురేనియం సరఫరా చేసేందుకు కెనడా అంగీకరించింది. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, అడ్వాన్స్‌డ్ రియాక్టర్ల తయారీలోనూ ఇరు దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఉగ్రవాదం, రాడికలైజేషన్ అనేవి మానవాళికి పెను సవాలుగా మారాయని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. వీటిని అరికట్టేందుకు రక్షణ రంగం, సముద్ర తీర భద్రతలో పరస్పర సహకారం పెంచుకోవాలని నిర్ణయించాయి.. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం-అ.ఇ.ఖ.ను త్వరలోనే ఖరారు చేయాలని ఇరు దేశాలు సంకల్పించాయి. విద్యుత్, టెక్నాలజీ రంగాల్లో సహకరించుకోవాలని రెండు దేశాలు

మిగతా 2లో..



హామీలను నిలబెట్టుకోవాలంటే

## పోలీసులతో అణిచివేస్తారా?

- ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలంటూ తెలంగాణ యువతను పచ్చి దగా చేశారు
- నిరుద్యోగులను ముందస్తు అరెస్ట్‌లు చేయటం దుర్మార్గం
- 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వెంటనే ప్రకటించాలి
- రాహుల్ గాంధీని డిమాండ్ చేసిన జాగృతి అధ్యక్షురాలు కవిత

12లో..

## అన్నారం బ్యారేజీ కూల్చివేతకు ప్రభుత్వం కుట్రలు

- ఎక్స్‌వేటర్లతో ఇసు క తవ్వకాలే నిదర్శనం
- సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు
- ఇ-వేలంలో భారీగా అక్రమాలు
- వెంటనే మైనింగ్ ప్రక్రియ ఆపాలి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్(జనంసాక్షి):** మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు, అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నిబంధన లకు పాతరేసి ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్స్‌వేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మార్గమే కాదు.. అతిపెద్ద నేరమని అన్నారు. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న రూల్స్ ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏకంగా బ్యారేజీని బలహీనపరిచి బీఆర్ఎస్ పై బురదజల్లే పన్నాగాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేస్తున్న అరాచకపర్వాన్ని అన్నదాతలు క్షమించే ప్రసక్తే లేదని అన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి అన్నారం బ్యారేజి పిల్లర్ల వద్ద ఇసుక తవ్వకాలు చేసి

మిగతా 2లో..

క్యాతన్‌పల్లి కేసులో బాల్క సుమన్‌కు

## బెయిల్

2లో..

ఈపీఎఫ్ వడ్డీ రేటు.. ఈసారీ

## 8.25 శాతమే

2లో..

పాక్ నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై అఫ్గానిస్థాన్

## డ్రోన్ దాడి



9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
03.03.2026

## ఇరాన్‌తో యుద్ధం మరో 4-5 వారాలు జరగొచ్చు

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో యుద్ధం మరికొన్ని వారాల పాటు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పూర్తిస్థాయిలో కొనసాగుతోందని వెల్లడించారు. ఈసందర్భంగా తనపై గతంలో జరిగిన హత్యాయత్నాల ఘటనలను అధ్యక్షుడు ప్రస్తావించారు."ఖమేనీ ప్రోద్బలంతో నాపై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. కానీ, నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథ కంచికి చేర్చా. నన్ను పట్టుకోకముందే నేనే అతడిని పట్టుకొన్నా. ఇరాన్‌పై ఆపరేషన్ క్లిష్టమైనదే.. కానీ విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నాం. అవసరమైతే ఈ ఆపరేషన్ నాలుగు నుంచి ఐదు వారాలు కొనసాగొచ్చు. యుద్ధ తీవ్రతను ఇదేవిధంగా కొనసాగించడం ఇజ్రాయెల్ అమెరికాకు కష్టమేమీ కాదు. మరోవైపు, చర్చల కోసం మా దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయి. అయితే, చర్చలు జరుగుతాయో, లేదో చెప్పలేం" అని ట్రంప్ వెల్లడించారు.

**ఎంతమంది సైనికులు మరణించినా..**

ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు అమెరికాకు చెందిన ముగ్గురు సైనికులు మరణించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. తమ సైనికుల మృతికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. అయితే, యుద్ధం ముగిసేలోపు మరింత ఎక్కువమంది అమెరికా సైనికులు మృతిచెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ దాడుల వల్ల ఇరాన్‌లో దాదాపు 200 మంది మరణించినట్లు తెలుస్తోంది. ఖమేనీతో పాటు పలువురు సీనియర్ మిలిటరీ కమాండర్లు, రాజకీయ ప్రముఖులు కూడా మృతి చెందినట్లు సమాచారం.

ఆయుధాలు వీడితే..: ట్రంప్ ఆఫర్

ఇదిలాఉండగా.. ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పిస్తామని ట్రంప్ వెల్లడించారు. లేదంటే వారికి చావు తప్పదని హెచ్చరించారు. తన ఆఫర్‌ను వాడుకొని ఇరాన్ ప్రజలు స్వేచ్ఛ పొందాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన, భయంకరమైన మిలిటరీ దాడులను చూస్తున్నామని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. ఇరాన్ దీర్ఘశ్రేణి అణ్వాయుధాలను కలిగిఉండటం.. అమెరికా భద్రతకు పెనుముప్పు అని పేర్కొన్నారు. దాన్ని అడ్డుకోవడం కోసమే తాము ఈ దాడులు చేపట్టామన్నారు. తమ లక్ష్యాలన్నీ నెరవేరేవరకు ఈ ఆపరేషన్ కొనసాగుతుందని పునరుద్ఘాటించారు.

యుద్ధం మేం మొదలు పెట్టలేదు.. కానీ ముగించేది మేమే: అమెరికా

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మూడో రోజుకు చేరుకున్నాయి. ఇరాన్ కూడా ప్రతిదాడులకు పాల్పడుతుండడంతో పశ్చిమాసియా అంతటా ఉద్రిక్తత నెలకొంది ఈ నేపథ్యంలో అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధాన్ని తాము ప్రారంభించలేదని, కానీ, తామే ముగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎయిర్‌ఫోర్స్ జనరల్ డాన్ కైన్‌తో కలిసి హెగ్సెత్ పెంటగాన్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. యుద్ధం ప్రారంభమైన అనంతరం ట్రంప్ సర్కారు బ్రీఫింగ్ ఇవ్వడం ఇదే తొలిసారి."ఈ యుద్ధాన్ని మేం ప్రారంభించలేదు. కానీ ట్రంప్ నాయకత్వంలో దీన్ని ముగిస్తాం. దాదాపు 47 ఏళ్లుగా అమెరికాపై ఇరాన్ పరోక్ష యుద్ధం చేస్తోంది. ఆ దేశం అన్ని హద్దులూ దాటేసింది. అందుకే శిక్షిస్తున్నాం. ఇరాన్ క్షిపణి వ్యవస్థలను, నౌకా దళాన్ని పూర్తిగా ధ్వంసం చేయడమే ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చేయడమే మా లక్ష్యం. ఇరాన్‌పై జరుగుతున్న ఈ దాడులు ఇరాక్ యుద్ధంలాగా ఏళ్ల తరబడి సాగేది కాదు. ఇదో నిర్ణయాత్మకమైన మిషన్" అని హెగ్సెత్ పేర్కొన్నారు. పొరుగుదేశాల్లో ప్రజలపై దాడుల ద్వారా ఇరాన్ నిజస్వరూపం బయటపడిందని, విమానాశ్రయాలు, హోటళ్లు, భవనాలపై దాడులు చేసిందన్నారు. అణు కార్యక్రమాన్ని ఆపేయాలని గతంలోనే ఇరాన్‌ను హెచ్చరించామని, ఆ దేశం మాత్రం అహంకారంతో ఆ ప్రతిపాదనను తిరస్కరించిందని చెప్పారు. మరింత రెచ్చగొడుతూ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తామని చెప్పిందన్నారు. ఇది ప్రభుత్వ మార్పు కోసం చేస్తున్న యుద్ధం కాదని, కానీ ఈ అవకాశాన్ని ఇరాన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమెరికన్లను ఎక్కడైనా బెదిరించినా లేదా చంపినా వేటాడి మరీ అంతం చేస్తామని హెచ్చరించారు.

## ఇరాన్‌పై కొనసాగిన అమెరికా-ఇజ్రాయిల్ దాడులు

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్' లో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఉత్తర టెహ్రాన్‌లో ఉన్న గాంధీ హాస్పిటల్ పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడిలో భవనం చాలా వరకు దెబ్బతింది. బాంబుల తాకిడికి కిటికీలు పగిలిపోయి, వార్డుల నిండా శిథిలాలు పేరుకుపోయాయి. దట్టమైన పొగలు వెలువడటంతో హాస్పిటల్ లో ఉన్న రోగులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ రాజధాని టెహ్రాన్ యుద్ధ జ్వాలలతో అట్టుడుకుతోంది. ఓ వైపు బాంబు దాడులు జరుగుతున్నా నర్సులు తమ ప్రాణాలకు తెగించి ఇన్సులేటర్లలో ఉన్న నవజాత శిశువులను, ఐసీయూలోని చిన్నపిల్లలను చేతులతో పట్టుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఘటనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ టెడ్రోస్ అధనామ్ స్పందించారు. ఆసుపత్రులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఇలాంటి దాడులను అడ్డుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇదిలావుంటే ఇరాన్‌లోని మినాబ్ ప్రావిన్స్‌లోని ఒక ప్రాథమిక పాఠశాలపై ఇజ్రాయిల్ దాడిలో మరణించిన వారి సంఖ్య 165కి పెరిగిందని ఇరాన్ మీడియా నివేదించింది. దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని మినాబ్‌లోని షాజారే తయ్యిబె బాలికల ప్రాథమిక పాఠశాలలో శనివారం ఈ దాడి జరిగింది. 96 మంది గాయపడ్డారని ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థ నివేదించింది. దాడి జరిగిన ప్రదేశంలో శోధన, రక్షణ చర్యలు ముగిశాయని మినాబ్ కౌంటీ గవర్నర్ తెలిపారు. బాలికల పాఠశాలపై దాడి వార్తలను ఇజ్రాయిల్ ఖండించింది. నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ట్విట్టర్‌లో దాడికి సంబంధించిన ఫోటోను పంచుకున్నారు. ఇజ్రాయిల్, అమెరికా శనివారం ఇరాన్‌పై ఉమ్మడి దాడిని ప్రారంభించాయి. ఈ దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరియు ఇతర సీనియర్ సైనిక అధికారులు మరణించారు.

లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయిల్ దాడి

లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయిల్ దాడి చేసింది. లెబనాన్‌లోని దాదాపు 50 గ్రామాల ప్రజలను ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ సైన్యం కోరింది. ఆ తర్వాత ఇరాన్ గల్ఫ్ దేశాలలోని అమెరికా సైనిక స్థావరాలపై ప్రతీకారం తీర్చుకుంది. బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇరాన్ క్షిపణి మరియు డ్రోన్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ హత్య, పునరావృత ఇజ్రాయిల్ దురాక్రమణలకు ప్రతీకారంగా లెబనాన్ మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ సరిహద్దు దాటి క్షిపణులు ప్రయోగించింది. ఈ మేరకు హెజ్బుల్లా ఒక ప్రకటనను విడుదల చేసింది. ఒక సంవత్సరానికి పైగా కాలం తర్వాత హెజ్బుల్లా ఇజ్రాయిల్‌పై దాడి చేసినట్లు ప్రకటించుకోవడం ఇదే తొలిసారి. ఈ దాడిలో ఒక ప్రక్షేపకాన్ని అడ్డుకున్నామని, మరికొన్ని బహిరంగ ప్రదేశాల్లో పడ్డాయని ఇజ్రాయిల్ రక్షణ దళాలు తెలిపాయి. ఈ ఘటనల్లో ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. 2024లో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దీని ద్వారా ఇజ్రాయిల్ మరియు హెజ్బుల్లా మధ్య ఏడాదికిపైగా కొనసాగిన ఘర్షణలకు ముగింపు పలికింది. ఆ సమయంలో ఇజ్రాయిల్ దాడులు హెజ్బుల్లాను గణనీయంగా బలహీనపరిచినట్లు విశ్లేషకులు భావించారు. అయితే, అప్పటి నుంచి ఒప్పంద ఉల్లంఘనలపై ఇరుపక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి.

# పశ్చిమాసియాలో తగ్గని ఉద్రిక్తతలు

పాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి. సైప్రస్‌లోని బ్రిటన్ నౌకాదళ స్థావరంపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో స్వల్ప నష్టమే జరిగిందని సైప్రస్ ప్రభుత్వం వెల్లడించింది. ఇక, ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత మోగుతోంది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అడ్డుకుంటోందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించాయి. ఈసందర్భంగా యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తోన్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. యుద్ధం విషయంలో అమెరికా (జూం)తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టంచేశారు. "ఈ దాడులను మేం మొదలుపెట్టలేదు. ట్రంప్ తన తప్పుడు ఆకాంక్షలతో ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెట్టేశారు. ఇజ్రాయెల్ అధికార కాంక్ష కోసం అమెరికా సైనికులను బలి చేస్తున్నారు" అని అలీ లరిజానీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

నెతన్యాహు కార్యాలయంపైనా దాడులు!

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారింది. ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం, ఆ దేశ ఎయిర్‌ఫోర్స్ కమాండర్ హెడ్‌క్వార్టర్స్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ ప్రకటించింది.

**ఇరాన్ ప్రతీకార దాడులతో వణికిపోయిన దుబాయ్**

పర్యాటకులు, ధనవంతులు, వ్యాపారాలకు స్వర్గధామంగా గుర్తింపు పొందిన దుబాయి నగరం ఇరాన్ ప్రతీకార దాడులతో వణికిపోయింది. శనివారం నుంచి క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులు చేస్తున్న ఇరాన్.. ఆదివారం కూడా దాడి చేసింది. ఈ దాడులను సమర్థంగా తిప్పికొట్టామని దుబాయి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. నిత్యం ప్రశాంతంగా ఉండే నగరంలో భారీ పేలుళ్ల శబ్దాలు, మంటలు, ఆకాశంలోకి లేస్తున్న దట్టమైన పొగ.. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. చాలామంది స్థానికులు, పర్యాటకులు దాడులకు సంబంధించిన వీడియోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందని చెప్పారు. ముందుజాగ్రత్తగా ప్రజలను ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణులు, డ్రోన్లన్నింటినీ కూల్చివేశామని ప్రకటించింది. అయితే, జెబెల్ అలీ పోర్టు సమీపంలో ఇరాన్ ప్రయోగించిన ఓ డ్రోన్ పడి భారీగా మంటలు చెలరేగాయి. దుబాయి గగన రక్షణ వ్యవస్థ కూల్చివేసిన ఇరాన్ డ్రోన్ శకలాలు పడటంతో పామ్ హోటల్‌లో స్వల్పంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయని, వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇరాన్ దాడితో దుబాయిలోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన భవనాలుగా గుర్తింపు పొందిన బుర్జ్ ఖలీఫా, బుర్జ్ అల్ అరబ్‌లకు ముప్పు ఏర్పడింది. శనివారం రాత్రి ఇరాన్ డ్రోన్ శకలాలు బుర్జ అల్ అరబ్ భవనాన్ని తాకటంతో అది స్వల్పంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

కువైట్‌లో కూలిన అమెరికన్ ఫైటర్ జెట్

అమెరికా సైనిక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ తెలిపింది. అమెరికా ఎఫ్-15 యుద్ధ విమానం కువైట్ గగనతలంలో కూలిపోయింది. విమానం కూలిపోయే ముందు పైలట్ విమానంలో నుండి బయటకు వెళ్లాడని అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది. పైలట్ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. విమాన ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు విడుదలయ్యాయి. విమానం మంటల్లో చిక్కుకుని పడిపోతున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ఇరాన్ ఒకేసారి ఇజ్రాయిల్, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా వైమానిక స్థావరాలపై క్షిపణులను ప్రయోగించడం ద్వారా తన దాడులను కొనసాగిస్తోంది.

**సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై డ్రోన్ దాడి..**

ఇరాన్ ప్రతీకార దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. తాజాగా సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీపై ఇరాన్ షాహెద్-136 డ్రోన్‌తో దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.దాడి కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఘటన నేపథ్యంలో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే, ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని సమాచారం. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆస్తి, ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు.ఇప్పటికే యుద్ధం కారణంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకోవడంతో ధరలు 10 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 80 డాలర్లు దాటింది. ఇప్పుడు తాజా దాడులతో ఈ ధర మరింత పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు, పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. ఈ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్ డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై డ్రోన్ దాడి జరగ్గా.. దుబాయ్, దోహా, అబుదాబి, జెరూసలెంలోనూ ఈ ఉదయం పేలుడు శబ్దాలు వినిపించాయి.

ఇరాన్ దాడుల వేళ.. కువైట్‌లో కూలిన 3 అమెరికా యుద్ధ విమానాలు

పశ్చిమాసియాలో మూడోరోజు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కువైట్‌లో ఓ అమెరికా యుద్ధ విమానం కూలిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. వాటిని ఇరాన్ మీడియా సంస్థ షేర్ చేసింది. కువైట్ గగనతలంలో ఉన్న ఆ యుద్ధ విమానం మంటల్లో చిక్కుకొని కిందపడింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారని సమాచారం. ఆ జెట్ అమెరికా నుంచి వచ్చిందా..? ఇజ్రాయెల్ పంపిందా..? అనే దానిపై స్పష్టత లేదు. ఈ రెంటింటినీ తయారుచేసింది అమెరికానే. ఈ ఘటనపై కువైట్ రక్షణశాఖ ప్రకటన చేస్తూ.. పలు యూఎస్ మిలిటరీ విమానాలు కూలిపోయాయని వెల్లడించింది. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టి, వాటిల్లో ఉన్న సిబ్బందిని రక్షించామని పేర్కొంది.

భారతీయ సిబ్బంది ఒకరు మృతి

గల్ఫ్ ఆఫ్ ఒమన్ లో ఓ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగింది. డ్రోన్ బోట్‌తో ఈ దాడికి పాల్పడినట్లు ఒమన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ ఘటనలో నౌకలోని సిబ్బందిలో ఒకరు మృతిచెందారు. ఆ వ్యక్తి భారతీయుడని తెలిసింది. దాడికి గురైన నౌకను ఎంకేడీ వ్యోమ్‌గా గుర్తించారు. దీనిపై మార్షల్ ఐలాండ్స్ జెండా ఉంది. ఒమన్ తీరానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో ఈ నౌకపై దాడి జరిగిందని ఒమన్ మీడియా వెల్లడించింది. ఈ ఘటన కారణంగా నౌకలో భారీ పేలుడు సంభవించింది. ప్రధాన ఇంజిన్ రూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.దీంతో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు ఒమన్ తెలిపింది. దాడి సమయంలో నౌకలో 59,463 మెట్రిక్ టన్నుల చమురు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ దాడి ఎవరు చేశారన్న దానిపై స్పష్టత లేదు. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడుల వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.నౌకలోని మిగతా 21 మంది సిబ్బందిని రక్షించి మరో కమర్షియల్ ఓడలోకి తరలించారు. వీరిలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీలు, ఒక ఉక్రెయిన్ జాతీయుడు ఉన్నారు.

## చర్చల ద్వారా పరిష్కరించుకోండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ గల్ఫ్ దేశాధినేతలకు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా, సౌదీ అరేబియా నేత మహ్మద్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రెండు దేశాలపై దాడులను ఖండించారు. ఇరు దేశాల్లో భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. ఇజ్రాయెల్, అమెరికా జరిపిన సంయుక్త దాడిలో ఇరాన్ చీఫ్ ఆయతుల్లా ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. దీంతో గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతిదాడులకు పాల్పడుతోంది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడింది. ఇరాన్ డ్రోన్ దాడులతో బహ్రెయిన్ రాజధాని మనామాతో పాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి.

## ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో హెల్ప్ సెంటర్

24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. అవసరమైన సమన్వయం మరియు సహాయం అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది.ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు లేదా తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు(న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి పనిచేస్తుంది) వందన బరువాపీఎస్ టు రెసిడెంట్ కమిషనర్ లైజన్ హెడ్+91 9871999044 సీహెచ్. చక్రవర్తిపబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్+91 9958322143శ్రీ జావేద్ హుస్సేన్‌లైజన్ ఆఫీసర్9910014749 రక్షిత్ నాయక్‌లైజన్ ఆఫీసర్+91 9643723157మధ్యప్రాచ్య ప్రాంత పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంటుంది.

దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై హైకోర్టు వాదనలు

## విచారణ నేటికి వాయిదా

ప్రభుత్వానికి ఉంది. కేసీఆర్, హరీశ్ రావుకు విచారణ కమిషన్ తగిన అవకాశం ఇచ్చింది. తన విధులు నిర్వహించడం లో స్మిత సబర్వాల్ విఫలం అయ్యారని నివేదిక లో ఉంది' అని ప్రభుత్వం తరఫు లాయర్లు హైకోర్టు ధర్మాసనంకు తెలియజేశారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నం 2.15 కి వాయిదా వేసింది.

## అన్నారం బ్యారేజీ కూల్చివేతకు కుట్రలు

బ్యారేజీని రేవంత్ సర్కార్ ప్రమాదంలోకి నెడుతుందని తెలిపారు. ఇది ఖచ్చితంగా కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసే కుట్రే అని ఆరోపించారు.

**సూర్యాపేట జిల్లా మైనింగ్‌లో అక్రమాలు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని స్వతంత్ర విచారణ చేసి టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని ఆరోపించారు.

### క్యాతన్‌పల్లి కేసులో బాల్క సుమన్‌కు బెయిల్

మంచిర్యాల(జనంసాక్షి):క్యాతన్‌పల్లి కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్ మంజూరయ్యింది. కోర్టు రూ. 25వేల పూచీకత్తుతో, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సోమవారం ఉదయం బాల్క సుమన్ కస్టడీ పిటిషన్‌ను వాయిదా వేసిన కోర్టు సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ బాల్కసుమన్‌కు బెయిల్ రాకుండా అడుగడుగునా అడ్డుపడింది. బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పోలీసులతో జిల్లా కోర్టులో అప్పీల్ చేయించింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన జిల్లా కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఇక బెయిల్ పిటిషన్‌పై లంచ్ తర్వాత తీర్పును వెల్లడించింది. గత 15 రోజులుగా ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యేను బీఆర్ఎస్ అగ్ర నాయకులు పరామర్శించి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రశ్నించారు..

### ఈపీఎఫ్ వడ్డీ రేటు.. ఈసారీ 8.25 శాతమే

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్)పై ఇచ్చే వడ్డీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) 8.25 శాతంగా కొనసాగించాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో జరిగిన 239వ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీల సమావేశంలో సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ ఇంతే వడ్డీరేటు అందించగా.. ఈసారి కూడా ఎలాంటి మార్పులు చేయకపోవడం గమనార్హం."2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను భవిష్య నిధి చందాదారుల నిధిపై 8.25% వడ్డీ రేటు జమ చేయాలని సోమవారం జరిగిన సమావేశంలో సీబీటీ నిర్ణయించింది" అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

# నేను ప్రధాని అయ్యేందుకు సిద్ధం





దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ తెలిపారు. మోదీ తప్పు లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. అందుకు కార్యకర్తలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో పీఏసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు.ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పా ర్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్దానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు. సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్‌కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ, ఏపీ పీసీసీ చీఫ్‌లు మహేశ్‌కుమార్ గౌడ్, షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు. గత 9 రోజులుగా ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ శిబిరం అక్కడ కొనసాగుతోంది. అంతుకుముందు ఉదయం ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ వికారాబాద్ జిల్లాకు బయలుదేరారు. వికారాబాద్ ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరు అయ్యారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం తదితర కీలక విషయాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులను ఖరారు చేసే అవకాశం ఉంది. రాజ్యసభ రేసులో అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, వీహెచ్, దొమ్మటి సాంబయ్య, బెల్లయ్య నాయక్, హజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. వికారాబాద్ చేరుకున్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మంత్రి వివేక్ వెంకటస్వామి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బొకేతో స్వాగతం పలికిన మంత్రి వివేక్ రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో సంపత్ కుమార్, షబ్బీర్ అలీ, సునీతారావులు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. సమావేశంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. రాహుల్ గాంధీతో పాటు కేసి వేణుగోపాల్ సమావేశంలో పాల్గొన్నారు.

## రాహుల్‌ను ప్రధానిని చేయాలి

ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

## భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటోంది

నిర్ణయించాయి. ఈ క్రమంలోనే యురేనియం ఒప్పందంపై భారత్, కెనడా సంతకాలు చేశాయి. పునరుత్పాదక ఇంధన వినియోగంతో పాటు కీలక లోహాల అంశంలో సహకారం కోసం భారత్, కెనడా ఎంవోయూ కుదుర్చుకున్నాయి. అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో చేరాలని కెనడా నిర్ణయించింది. గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలో చేరాలని కెనడా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. కెనడా నిర్ణయాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు.

**పశ్చిమాసియా పరిస్థితులపై మోదీ తీవ్ర ఆందోళన**

పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వివాదాలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ కోరుకుంటోందని చెప్పారు. పశ్చిమాసియాలో ఉన్న భారతీయుల భద్రత కోసం అన్ని దేశాలతో కలిసి పనిచేస్తామని మోదీ స్పష్టం చేశారు.

**భారత్-కెనడా మధ్య యురేనియం డీల్**

భారత్-కెనడా మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సోమవారం 2.6 బిలియన్ డాలర్ల విలువైన యురేనియం సరఫరా ఒప్పందం మీద రెండుదేశాలు సంతకాలు చేశాయి అలాగే సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అంగీకారం కుదిరింది. హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్రమోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో పౌర అణుఇంధన కార్యక్రమానికి నిరంతరాయ సరఫరాను కొనసాగించడమే ఈ డీల్ ఉద్దేశం. చిన్న రియాక్టర్లు, అధునాతన రియాక్టర్లపై కలిసి పనిచేయనున్నామని మోదీ తెలిపారు అలాగే 2026 చివరినాటికి సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై కొలిక్కి రావాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నట్లు కార్నీ వెల్లడించారు. 1893లో స్వామి వివేకానంద కెనడాలో పర్యటించిన విషయాన్ని మార్క్ కార్నీ గుర్తుచేసుకున్నారు."లేవండి.. మేల్కొనండి.. లక్ష్యం చేరేవరకు ఆగకండి" అన్న వివేకానంద సూక్తిని ప్రస్తావించారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు కార్నీ భారత్‌లో పర్యటిస్తున్నారు.

# నిమ్జ్‌లో మౌలిక వసతుల కల్పనకు కసరత్తు

- ఇప్పటికే సేకరించిన భూముల్లో రోడ్లు, ఇతరత్ర వసతులు కల్పించేలా ప్రణాళికలు
- నిమ్జ్, రెవెన్యూ, సర్వే, టీజిఐఐసి అధికారులతో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష సమావేశం
- సమీక్ష లో పాల్గొన్న జగ్గారెడ్డి, అడిషనల్ కలెక్టర్ మాధురి, డిఆర్వో పాండు



**సంగారెడ్డి టౌన్ మార్చి 02 (జనం సాక్షి) :** నిమ్జ్‌లో మౌలిక వసతులు కల్పించే ఎస్ఆర్అర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి ఇప్పటివరకు సేకరించిన భూములను అప్పగించాలని నిమ్జ్, రెవెన్యూ, సర్వే, టీజిఐఐసి అధికారులతో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేఅవుట్ అభివృద్ధి చేసేందుకు వీలుగా పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. లే అవుట్ ప్రకారం రోడ్లు, ఇతరత్ర మౌలిక వసతులు కల్పించేందుకు సేకరించిన భూముల్లో హద్దురాళ్ళను ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గతంలోనే భూములు తీసుకుని రైతులకు నష్ట పరిహారం చెల్లించామని కానీ మొన్నటివరకు ఆ భూముల్లో పనులు చేపట్టకపోవడంతో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఇచ్చామని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపట్టనుండటంతో ఇకపై పంటలు వేయకుండా చూడాలని, ఐదివరకే పంటలు వేసి ఉంటే కోతలు పూర్తయ్యే వరకు వేచి చూడాలన్నారు. సర్వే ఎలాంటి ఆటంకాలు లేకుండా శాంతియుత వాతావరణం లో నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సర్వే సందర్భంగా వేసిన హద్దు రాళ్ళను రైతులేవరూ తొలగించవద్దని, అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లు మాధురి, పాండులతోపాటు టీజిఐఐసి జోనల్ మేనేజర్ విఠల్, జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి , తాహిల్దార్‌లు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించాలి

- టీఎస్ జిఆర్ఇఎ కరీంనగర్ జిల్లా శాఖ డిమాండ్



**కరీంనగర్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ సమావేశం ఇందిరానగర్ కరీంనగర్ సంఘ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా, జాలి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2023 నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్కాష్మెంట్, జిపిఎఫ్, టిజీఎల్ఐసి లాంటి బెనిఫిట్స్ 24 నెల నుండి చెల్లింపక కాలయాపన చేయడం వల్ల ఉద్యోగ విరమణ పొందిన వారు మానసిక ఒత్తిడికి గురైతున్నారు. అనారోగ్యంతో, వైద్య ఖర్చులు భరించలేక సుమారు 64 మంది వరకు చనిపోయినారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఉద్యోగ విరమణ పొందిన వారికి ఏక మొత్తంలో ఒకేసారి అన్ని బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్, జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ పి.రామచంద్రం, జిల్లా అసోసియేట్ అద్యక్షులు పి. నాగ మోహన్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర స్వామి,టి.రాజమణి, కె.రాజిరెడ్డి.ఎ.శ్రీధర్ రావు, వి.రాజిరెడ్డి, కె.వెంకటరమణ, శంషాద్దీన్, కె.మహేందర్ రెడ్డి. ఇ.వీరస్వామి,చోటే మియా, తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ కరుణాకర్‌కు సన్మానం



- తెలంగాణ ఉద్యమ కారుల నాయకుల హర్షం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** గత ఎన్నికల సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ కోరుతూ గొల్లపల్లి నాగరాజు, అంబు రాథోడ్, అనంతుల మధు సహా మరో 6మంది ఉద్యమకారులం హైకోర్టులో ఫిబ్రవరి 09 న పిటిషన్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 23న కోర్ట్ నెంబర్ 04 లో జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి ఇరువాదనలు విన్న తర్వాత, పిటిషన్ వేసిన తెలంగాణ ఉద్యమ కారులకు అనుకుల తీర్పు ఇచ్చారు. ఈ కేసు సందర్భంగా హైకోర్ట్ లో ఉద్యమకారుల తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ కరుణాకర్ రెడ్డికి ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ సంఘాల నాయకులు ఆత్మీయ సన్మానం చేశారు. పిటిషన్ వేసిన 9 మంది ఉద్యమకారులకు హై కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్, జస్టిస్ చంద్రకుమార్, అడ్వకేట్ కరుణాకర్ రెడ్డి, వివిధ ఉద్యమ సంఘాల నాయకులు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమ నేతలు దేశాయి కర్ణాకర్, డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ షోహెబ్, రాములు, తెలంగాణ వెంకన, బాసిపంగు సునీల్, సుల్తాన్ యాదగిరి, వెంకటేషం గౌడ్, గుర్జాని, తెలంగాణ జానకీరెడ్డి వివిధ తెలంగాణ ఉద్యమకారుల సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

# మిర్చీ దొంగల గుట్టురట్టు

- చాకచక్యంగా పట్టుకున్న రేగొండ పోలీసులు
- ఐదుగురు వ్యక్తులు, ఒక టాటా ఏసీ,ద్విచక్రవాహనం,4 సెల్ ఫోన్లు, రూ.51000 స్వాధీనం
- నిందితులందారూ 30 సంవత్సరాల లోపే..

**రేగొండ, మార్చ్ 02( జనం సాక్షి):** పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల గ్రామ శివార్లలో మిర్చి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను రేగొండ పోలీసులు సోమవారం సాయంత్రం చాకచక్యంగా పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రంగయ్యపల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఒక టాటా ఏసీ వాహనం, ఒక టూ వీలర్పై వచ్చిన ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఇటీవల గూడపల్లి, బాగిర్తిపేట,రావులపల్లి,రేగొండ గ్రామ శివార్లలో రాత్రి వేళల్లో మిర్చి పంట దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారని పోలీసులు తెలిపారు.వారి వద్ద నుండి దొంగతనానికి వాడిన ఒక టాటా ఏసీ వాహనం, ఒక టూ వీలర్, 04 మొబైల్ ఫోన్లు, మొత్తం రూ.51,000/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు నిడుతుల వివరాలను వెల్లడించారు.అరెస్టు చేయబడిన వారిలో అజ్మీర రాజేష్ (26 సం.),నునావత్ రాజు (28 సం.),భూక్యా చరణ్ (18 సం.),భూక్య కళ్యాణ్ (22 సం.),నునావత్ తిరుపతి (27 సం.) అందరూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల్ మండలం పరిధికి చెందినవారిగా గుర్తించారు.రేగొండ పోలీస్ స్టేషన్ అధికారులు రైతులు రాత్రి వేళల్లో పంటలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు ,తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బుద్ధవనాన్ని విశ్వశాంతి కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బుద్ధవనాన్ని విశ్వశాంతి కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళారూపాలు, వివిధ మాధ్యమాల ద్వారా బుద్ధుని బోధనలను గ్రామ గ్రామానికి తీసుకెళ్తామని తెలిపారు. సోమవారం ఆయన నల్గొండ జిల్లా ,నాగార్జునసాగర్ సమీపంలోని బుద్ధ వనంలో మూడవ బుద్ధ ధమ్మ యాత్ర ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి వివిధ దేశాల నుండి హాజరైన బౌద్ధ బిక్షువులను ఉద్దేశించిన మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ బుద్ధుని ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతుందని అన్నారు. బుద్ధుని బోధనలైన కరుణ, ప్రేమ, దయ వంటి వాటిని ప్రజల హృదయాలలో తిరిగి నింపేందుకు బౌద్ధ బిక్షువులు నెలరోజుల పాటు కర్ణాటకలోని కాలబురిగి నుండి తెలంగాణలోని బుద్ధ వనం వరకు నిర్వహించిన పాదయాత్ర సందేశం ఇచ్చిందని అన్నారు. బుధవనాన్ని వరల్డ్ క్లాస్ హెరిటేజ్ కేంద్రంగా తీర్చి దిద్దుతామని, పబ్లిక్ ప్రైవేట్ బాగ స్వామ్యం తో ఆధునిక సాంకేతికతను ఉపయోగించి గ్లోబల్ బుద్ధిష్ట్ కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే బుధవనాన్ని విశ్వశాంతి కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. దమ్మ యాత్ర ప్రారంభం మాత్రమే అని, రాబోయే రోజుల్లో బుద్ధ వనం ప్రపంచానికే వెలుగునిస్తుందని అన్నారు.నేను, నాది అన్న స్వార్థం వదిలి మనది అన్న ఆలోచనతో ప్రతి ఒక్కరు ముందుకెళితే సమస్యలు పరిష్కారం అవుతాయని, బుద్ధుని బోధనలను సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళారూపాల ద్వారా గ్రామ గ్రామానికి తీసుకెళ్తామని, అంతేకాక సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా కూడా తీసుకెళ్తామని, ఇందులో భాగంగానే రచయితలు అందరిని ఒక సంఘంగా ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలను తీసుకోవడం ద్వారా "ప్రభాథ్ భేరి"పేరుతో త్వరలోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. మరో మంత్రి ,రాష్ట్ర కార్మిక ఉపాధికల్పన, శిక్షణ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మనిషి సాధారణ జీవితాన్ని గడిపేందుకు బుద్ధుని బోధనలు మార్గదర్శకంగా నిలుస్తాయని, శాంతియుతంగా ,ఆశావాద దృక్పథంతో జీవితాన్ని కొనసాగించేందుకు బుద్ధుని బోధనలు ఉపకరిస్తాయని తెలిపారు బుద్ధవనం రాష్ట్రంలోనే కాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గొప్ప సాంస్కృతిక వారసత్వ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉందని, బుద్ధవనాన్ని టూరిజం మాన్యుమెంట్ గా విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, బుద్ధ సాంస్కృతిక అంబాసిడర్ గగన్ మాలిక్ బుద్ధ వనం స్పెషలాఫీసర్ మల్లేపల్లి లక్ష్మయ్య, ఆశ్రయ ఫౌండేషన్ అధ్యక్షులు సిద్ధార్థ్, థాయ్ ల్యాండ్ బౌద్ధ సన్యాసులతోపాటు వచ్చిన శ్రీలోక్ కుంతూ , విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆంజనేయ రెడ్డి, తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఇప్పటిదాకా ఒక లెక్క... ఇకపై మరో లెక్క

- ఇళ్ల నిర్మాణాలకు డబ్బులు అడగొద్దు...దరఖాస్తుదారులను ఇబ్బంది పెట్టొద్దు
- టౌన్ ప్లానింగ్ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ దిశా నిర్దేశం



**కరీంనగర్ బ్యూరో, మార్చి 02 (జనంసాక్షి) :** కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి సోమవారం ఉదయం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగం డీసీపీ, ఎసీపీలుసహా సిబ్బంది అంతా హాజరైన ఈ సమావేశంలో "ఇప్పటిదాకా ఒక లెక్క. ఇకపై మరో లెక్క. ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం డబ్బులు అడగొద్దు. బాధితులను ఇబ్బంది పెట్టొద్దు. అవినీతికి తావు లేకుండా ఇంటి అనుమతుల కోసం వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చేలా చేయాల్సిందే అని బ్రోకర్ల ద్వారా ఏజెన్సీలను పెట్టుకుని ప్రజలను వేధిస్తూ లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వాలనుకుంటే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని, అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే బదిలీపై వెళ్లవచ్చునని నిజాయితీగా రూల్స్ ప్రకారం పనిచేసే వాళ్లపై మా రాజకీయ ఒత్తిళ్లు ఉండవు. వాళ్లపై ఈగ కూడా వాలనివ్వను. కంటికి రెప్పలా కాపాడుకుంటా అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాతూ...మిమ్ముల్ని బెదిరించడానికో, భయపెట్టడానికో పిలవలేదు. పూర్తి పారదర్శకతతో పనిచేయాలి. మున్సిపల్ అధికారులపై నిఘా ఉంటుంది. మీరేం చేస్తున్నారో పక్కా సమాచారం వస్తుంది. గతంలో మీరు ఏం చేశారో నాకు అనవసరం. ఇకపై మాత్రం అవినీతికి దూరంగా ఉండాలి. పనుల కోసం వచ్చే సామాన్య ప్రజలకు ఇబ్బంది లేకుండా అనుమతి ఇవ్వాలి. సహకరించాలి. అనుమతి లేకుండా అనధికారికంగా ఇండ్లు, కమర్షియల్ భవనాలు నిర్మిస్తుంటే ఆరంభంలోనే వాటిని ఆపాలి. నోటీసులివ్వాలి. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం ఎన్ని నిర్మాణాలు అక్రమంగా, అనధికారికంగా కొనసాగుతున్నాయో గుర్తించి వాటన్నింటినీ వారం రోజుల్లోపు నోటీసులివ్వండి. నోటీసులకు సమాధానం ఇవ్వకపోయినా, అక్రమ నిర్మాణాలను కొనసాగించినా కొరడా ఝుళిపించండి. డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సహాయం వాటిని కూల్చివేయండి. ప్రభుత్వ స్థలాలను పూర్తిగా కాపాడాలి. కరీంనగర్ కు ఐకానిక్ గా ఉండే ప్రాజెక్టులు ఏమైనా ఉంటే చెప్పండి. వాటి అమలు కోసం, నిధుల కోసం నేను ప్రయత్నిస్తా అని, పెద్ద ఎత్తున సీఎస్సార్ ఫండ్స్ తీసుకొస్తానని, అతి త్వరలోనే "అటల్ క్యాంటీన్" లను ఏర్పాటు చేసి ఆసుపత్రులు, మార్కెట్ కూడళ్లలో పేదలకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని కడుపు నిండా పెట్టేలా చర్యలు తీసుకుంటా' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జల్లికట్టులో తీవ్ర విషాదం

- ఎద్దు పొడవడంతో ముగ్గురు దుర్మరణం

**చెన్నై, మార్చి2 (జనంసాక్షి) :** శివగంగై జిల్లాలో ఏర్పాటు చేసిన జల్లికట్టులో తీవ్ర విషాదం నెలకొంది. సోమవారం జరిగిన ఈ క్రీడలో ఎద్దు పొడవడంతో ముగ్గురు మరణించారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో వారందరినీ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. జల్లికట్టు సందర్భంగా సరైన భద్రతా చర్యలు చేపట్టలేదని.. అందువల్లే ఇలా జరిగిందంటూ స్థానికులతో పాటు బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. మరో వైపు ఈ ఘటనలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇప్పటికే ఆసుపత్రికి చేరుకున్నారు. తమిళనాడులో జల్లికట్టు పోటీలను సంప్రదాయ క్రీడగా ప్రజలు జరుపుకొంటారు. ఈ క్రీడలను చూసేందుకు ఏపీ, తెలంగాణ ప్రజలు భారీగా తమిళ నాడుకు తరలివస్తారు. పరుగులు తీస్తున్న పశువులను పట్టుకోవడానికి యువకులు ఉత్సాహంగా పోటీపడి పరుగెడతారు. ఇలాంటి సమయంలో కొన్నిసార్లు ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటుంటాయి.

# ప్రైవేట్ నర్సింగ్ ఆఫీసర్లకు రూ.40,000 కనీస వేతనం తక్షణమే అమలు చేయాలి

- తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ కమిషనర్ (లేబర్)కు వినతి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ మరియు నర్సింగ్ హోమ్స్‌లో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు నెలకు కనీస వేతనం రూ.40,000/- తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నక్క సూర్య కుమార్ ఆధ్వర్యంలో, జాయింట్ కమిషనర్ (లేబర్) ఆర్. చంద్ర శేఖరంకు అధికారిక వినతి పత్రం సమర్పించారు. 13-02-2026 తేదీన లోక్‌సభలో అన్‌స్టార్డ్ క్వశ్చన్ నెం. 2301 కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో, సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ప్రైవేట్ నర్సుల వేతనాలు ప్రభుత్వ నర్సుల వేతనాలకు సమానంగా లేదా సమీపంగా ఉండాలని సిఫార్సులు రాష్ట్రాలకు పంపినట్లు పేర్కొనబడిందిప్రస్తుతం ప్రైవేట్ రంగ నర్సింగ్ ఆఫీసర్లకు రూ.12,000 నుండి రూ.18,000 వరకు మాత్రమే వేతనం చెల్లించబడుతున్నది. రోజుకు 10-12 గంటల పని, ఓవర్‌టైమ్ లేకపోవడం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు లేకపోవడం వంటి పరిస్థితులు రాజ్యాంగబద్ధ హక్కులకు విరుద్ధంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు కనీసం రూ.40,000/- నెలకు వేతనం తక్షణమే అమలు చేయాలి. పీఎఫ్, ఈఎస్ఐ, ఓవర్‌టైమ్, వారాంతపు సెలవులు అమలు చేయాలి. చట్ట ఉల్లంఘన చేసే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ సందర్భంగా నక్క సూర్య కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ప్రైవేట్ నర్సింగ్ ఆఫీసర్లతో ప్రతి జిల్లాలో సదస్సులు నిర్వహించి, అందరితో కలిసి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. నర్సింగ్ వృత్తికి గౌరవప్రదమైన జీవితం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడవెల్లి సురేష్, నోముల సూర్యనారాయణ, అంబేద్కర్, సబిత, శ్వేత తదితరులు పాల్గొని వినతిపత్రం సమర్పించారు.

# ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్



**మేడ్చల్, మార్చి 2 (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా కుతుబుల్లాపూర్ తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గణేష్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ కోసం తహసీల్ కార్యాలయాన్ని సంప్రదించిన బాధితుడికి జూనియర్ అసిస్టెంట్ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో మొదటి విడతగా రూ.5 వేలు తీసుకోగా చివరి విడతగా సోమవార రూ.15 వేలు లంచం తీసుకుంటూ సిటీ రేంజ్ వన్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

# విజయ్ దంపతులకు కలెక్టర్ అభినందన

- జ్ఞాపిక బహూకరణ

**నాగర్ కర్నూలు, మార్చి 2 (జనంసాక్షి) :** సినీ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందాన నూతన దంపతులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతులు కలిసి అభినందించారు. బల్మూరు మండలం తుమ్మన్ పెట్ గ్రామంలో సోమవారం నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో నూతన దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలా డాయి. స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతి స్తున్నారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

# ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థిపై అఘాయిత్యం

- తోటి విద్యార్థు అత్యాచారం
- పోలీసులకు ఫిర్యాదుతో కేసు

**హైదరాబాద్, మార్చి2 (జనంసాక్షి) :** మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు చర్యాలు తీసుకుం టున్నప్పటికీ దారుణాలకు అడ్డుకట్టపడడం లేదు. అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్స్, పోలీస్ డిపార్ట్ మెంట్ అవగాహన కల్పిస్తున్నప్పటికీ మాయమాటలకు మోసపోతున్నారు కొందరు యువతులు. తాజాగా బాచుపల్లిలోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో దారుణం చోటుచేసుకుంది. తోటి విద్యార్థినిపై ఇద్దరు యువకులు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితురాలితో చనువుగా ఉన్న ఆసిస్ విద్యార్థి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు బాధితురాలు తెలిపింది. ఏడాది నుంచి ఆసీస్ అఘాయిత్యం చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆసీస్ తో పాటు ప్రవీణ్ అనే వ్యక్తి తనపై మిస్ బిహేవ్ చేసినట్లు ఫిర్యాదుల పేర్కొన్నది బాధితురాలు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు. బాధి తురాలు బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతుండగా ఇరువురు యువకులు సహా-విద్యార్థులుగా సమాచారం. నా పై ఇద్దరు నా క్లాస్ మేట్స్ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆసీస్ అనే స్టూడెంట్ నన్ను ప్రేమ పేరుతో వేధించాడు.. నన్ను భయపెట్టాడు నాతో చనువుగా ఉన్నప్పుడు ఆసీస్ వీడియోస్ ఫొటోస్ తీసి బెదిరించాడు.. నన్ను క్లాస్ రూమ్ లోనే అత్యాచారం చేశాడు.. ఏడాది నుంచి ఆసీస్ అనే స్టూడెంట్ నాపై అత్యాచారం చేశాడు.. ఆసీస్ తో పాటు ప్రవీణ్ అనే స్టూడెంట్ తనపై మిస్ బిహేవ్ చేశారు.. నాకు మత్తు పదార్థం ఇచి ఓయో రూమ్స్ తీసుకువెళ్లి ఆసీస్ అత్యాచారానికి పాల్ప డ్డాడు.. నేను స్పృహలో లేనప్పుడు వీడియోస్ ఫొటోస్ తీసి నన్ను బ్లాక్ మెయిల్ చేశాడు.. నాకు జరిగిన అన్యాయాన్ని పేరెంట్స్ దృష్టికి తెచ్చాను.. మా పేరెంట్స్ కాలేజ్ మేనేజ్మెంట్ ను ప్రశ్నించారు.. కాలేజ్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదు.. దీంతో బాచుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాము.. మేము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నరు బాచుపల్లి పోలీసులు.. ఫిబ్రవరి 28న ఎఫ్ఐఆర్ నమోద యింది.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు.. మాకు న్యాయం జరగాలి' అని బాధితురాలు తన గోడు వెల్లబోసుకుంది.



## సామాజిక సేవకు గౌరవ డాక్టరేట్

**మల్హర్,మార్చి 02(జనం సాక్షి) :** మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామంలోని శ్రీసాయి వాణి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ వీరమనేని సంపత్ రావు కు అంతర్జాతీయ తమిళ సాంస్కృతిక విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అవార్డు లభించింది. సామాజిక సేవా రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ అల్ తమిళం కల్చరల్స్ విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ తమిళ్ కల్చరల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో బాగంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వి సంతాన కుమార్, చెన్నై మాజీ సివిల్ జడ్జి డాక్టర్ కే వెంకటేశన్, నటి డాక్టర్ నిరోషా, డాక్టర్ డి ఆనంద్ రాజ్ రిటైర్డ్ సెక్రటరీ చెన్నై చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.


జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
3 మార్చి 2026

# ‘కుమ్మెర’ లేవనెత్తిన ప్రశ్న

## హిందువులంతా బంధువులేనా?







భారత రాజ్యాంగం “సమానత్వం” అనే మహోన్నత విలువలపై నిర్మించబడింది. ఆ పునాదులకు రూప శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. కానీ ఇప్పటికీ రాజ్యాంగం ఆశించిన సమానత్వం ఆమడ దూరంలోనే ఉన్నది. అయితే, హిందువులంతా బంధువులమనే భారతీయ సమాజంలో దేవాలయం దగ్గర కులం పేరుతో జరిగిన దాడి మరోమారు హిందుధర్మంలో అసమానతలను నొక్కి చెబుతుంది. ఇదీ హిందుత్వానికి మాయని మచ్చ. ఇటీవల నాగర్ కర్నూలు జిల్లా, కుమ్మెర గ్రామంలో మల్లన్న స్వామి జాతరలో బీసీ చాకలి కుటుంబంపై జరిగిన దాడి దేశాన్ని కుదిపేస్తుంది. రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారుల ఆధిపత్యం మానవత్వానికి మచ్చగా మిగిలింది. ఒక శిశువు ప్రాణం కుల అహంకారానికి బలి కావడం కేవలం నేరమే కాదు, అది మానవత్వంపై జరిగిన దాడి. దేవాలయ ప్రవేశం, ఆధ్యాత్మిక హక్కుల విషయంలో సబ్బండ కులాలపై వివక్ష- ఆధునిక భారత దేశంలోనూ బహిర్గతమవుతుంది. శివుని సమానత్వానికి ప్రతిరూపమైన మల్లన్న దేవుడి గుడిలో జరిగిన ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఇది కేవలం ఒక గ్రామ సమస్య కాదు, ఆధ్యాత్మిక నిర్మాణంలో దాగి ఉన్న అసమానతలకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ అన్యాయంపై మొట్టమొదట గళమెత్తిన నాయకుడు బీసీ, ఎస్సీ ,ఎస్టీల విముక్తి ఉద్యమ రథసారధి డాక్టర్ విశారదన్ మహరాజ్. ఆయన హిందూ ధర్మంలో బీసీ ఎస్సీ ఎస్టీల వాటా ఎంత? అని వేసిన ప్రశ్న పలువురుని ఆలోచింపచేస్తుంది. దళిత, బహుజన వర్గాల రక్త మాంసాలతో ఈ దేశంలోని గుళ్ళు, గోపురాలను నిర్మించారు. వేల ఏళ్లుగా హిందు ధర్మాన్నీ కాపాడుతున్నారు. అయినా వారిని దేవుని గర్భగుడిలోకి అనుమతించక పోవడం, ఆంక్షలు విధించడంపై ప్రశ్నించాడు. అనాడు అంబేద్కర్ కాలారామ్ దేవాలయం ముందు నిలబడి ప్రశ్నించినది ఇదే. పెరియార్ వైకోం సత్యగ్రహంలో గళమెత్తినది కూడా ఇదే. నేడు కుమ్మెర గ్రామంలో డాక్టర్ విశారదన్ ప్రశ్న కూడా అదే.

### హిందుత్వంలో అణగారిన వర్గాల వాటా ఎంత?

ప్రపంచానికే విద్య ,విజ్ఞానం, సంస్కృతి పంచిన గొప్ప దేశం మనది. “హిందువులంతా బంధువులు” అనే నినాదం మహోన్నతమైనది. కానీ ఆ నినాదం వాస్తవ జీవితంలో ప్రతిబింబిస్తుందా? అనేది ప్రశ్నార్థకమే! కుమ్మెర గ్రామ ఘటన దీనికి సజీవ సాక్ష్యం.

వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వర్ణ-కుల వ్యవస్థ ఈ దుర్ఘటనకు మూలకారణం. “మేమే అధిపతులం” అనే మనస్తత్వం పెరిగి, అది బలహీను లపై బలవంతుల దౌర్జన్యానికి పురిగోల్పుతుంది. దీంతో ప్రజాస్వామ్య ఆలోచనలను పాతరేస్తూ ప్రతిచోట కుల స్వామ్య కోరలు రాజ్యమేలుతున్నాయి. ఇదీ దేవాలయాల నిర్వహణ కమిటీలో, పీఠాధిపతుల్లో, ప్రధాన పూజారి స్థానాల్లో, ఆధ్యాత్మిక నిర్ణయ కేంద్రాల్లోనూ స్ఫురిస్తోంది. ఈ ఆధ్యాత్మిక ప్రదేశాలలో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడమే ఈ ఆధిపత్యానికి నిదర్శనం. ఏ దేవుడైన సమానత్వం బోధి స్తాడు. కానీ అగ్రకులాలు ఆధిపత్యం ఒక వ్యవస్థను నిర్మించుకొని బీసీ ఎస్సీ ఎస్టీ లను శూద్రులుగా, బానిస లుగా చూస్తున్నారు. అయినా దళిత, బహుజనులు హిందువులంతా బంధువు లుగానే భావించుకుంటూ వేల సంవత్సరాలుగా హిందూ మతాన్ని కాపాడుతున్నా రు. చారిత్రకంగా వారికి ఆయుధం, భూమి, సంపద, విద్య వంటి ప్రధాన వనరులపై సమాన హక్కులు లభించలేదు. ఈ సామాజిక కట్టుబాట్లు, అసమానతల వల్ల దేశ రక్షణ, ఆర్థిక స్థితి, సామాజిక ఐక్యత దెబ్బతిన్నది. ఉదాహరణకు భారతీయ హిందు రాజు పృథ్వీరాజ్ చౌహాన్ కాలంలో జరిగిన తరైన యుద్ధాలలో మహమ్మద్ గోరి భారతదేశాన్నీ ఆక్రమించాడు. ఈ యుద్ధంలో బహుజనుల భాగస్వామ్యం లేకపోవడం వలన దేశం ఆక్రమణకు గురైంది. వారి చేతిలో అధికారం ఉండి ఉంటే ఎవరు కూడా కన్నెత్తి చూసే సాహసం చూపేవారు కాదు. ఇప్పటికీ కూడా భారతదేశంలో కొన్ని కులాల చేతిలో అధికారం కేంద్రీకృతం కావడం వల్లనే అభివృద్ధి సాధించలేకపోతుంది. దీనికి ప్రధాన కారణం హిందూ మతంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధికారం ఇవ్వకపోవడమే. అఖం డ భారతదేశాన్ని పరిపాలించిన బహుజన రాజులైన అశోకుడు, మరాఠా రాజ్యాన్ని పాలించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ సమాన త్వానికి పెద్దపీట వేయడం వల్లనే చరిత్రలో గొప్పగా వర్ధిల్లారు.

### శివుని సమానత్వంతో పోరాడినప్పుడే...

నేటికీ గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు హిందు ధార్మిక కార్యక్ర మాలలో అగ్రకులాధిపత్యం రాజ్యమేలుతుందనడానికి కుమ్మెర ఘటన మనకు ఒక గట్టి హెచ్చరిక. ఇది ఆధునిక భారతదేశంలో మానవ హక్కుల ఉల్లంఘన. దేవాలయం ఒక వర్గం సొత్తు కాదు, భక్తి కులాన్ని అడగదని, దేవుడు జాతి పత్రం చూడడు అనే మాటలు ‘ఆదర్శాలు’ గానే మిగులుతున్నాయి. రోజురోజుకు భయంకరమైన కులం కుట్రలు చాప కింద నీరులా విజృంభిస్తు న్నాయి. వెనుకబడిన కులాలను తమ ఆధీనంలో ఉంచుకోవాలనే ఆధిపత్య పోకడలు కొనసాగున్నాయి. ఇప్పటికీ అక్కడక్కడ గ్రామాల్లో అట్టడుగు కులాల ఆలయ ప్రవేశాన్నీ అడ్డుకోవడం, సామాజికంగా బహిష్కరించడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తుండడం ఇందుకు ఉదాహరణ. అదేవిధంగా ఆ వర్గాలు రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని కూడా చెలాయించడాన్ని ఓర్చుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో కుమ్మెర ఘటనలో డాక్టర్ విశారదన్ పోరాటం హిందు స్వాభిమానానికి, మానవ గౌరవానికి, రాజ్యాంగ ఆత్మకు సంబంధించిన పోరాటంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన నికార్సైన పోరాటానికి పలువురు సామాజిక ఉద్యమకారులు, మేధావులు, రాజకీయ పార్టీలు మద్దతిస్తున్నాయి. సమాజం ముందుకు వెళ్లాలంటే అగ్రకులాలు ఆధిపత్య భావాలను విడిచిపెట్టి ప్రజాస్వామ్య గణతంత్ర విలువలను గౌరవించాలి. రాజ్యాంగ సమానత్వం పేజీల్లో మాత్రమే కాకుండా ఆలయ గర్భగుడిలోనూ, మన హృదయాల్లోనూ ప్రతిఫలించాలి. ఇందుకై సంస్థాగత మార్పులు అవసరం. దేవాలయాల నిర్వహణలో సమాన ప్రాతినిధ్యం కావాలి. కుల ఆధారిత అహంకారాన్ని సామాజికంగా ఖండించే ధైర్యం ప్రతి ఒక్కరిలో రావాలి. కుమ్మెర గ్రామ ఘటనలో చాకలి కుటుంబంపై దాడి చేసిన నిందితుల్ని వెంటనే శిక్షించి బాధితులకు న్యాయం చేయాలి. ఆధ్యాత్మిక ప్రపంచంలో అణగారిన వర్గాలను భక్తులుగా మాత్రమే చూడడం సరికాదు. వారికి నాయకత్వం, నిర్ణయాధికారం, గౌరవప్రదమైన ప్రాతినిధ్యం లభించినప్పుడే హిందువులంతా బంధువులు అవుతారు. అదే విధంగా అట్టడుగు వర్గాలు కేవలం భక్తులుగా మిగిలిపోతే సరిపోదు. శివుని సామాజిక సమానత్వం, సమ్మక్క-సారలమ్మల, చాకలి ఐలమ్మల పోరాటం బాటలో నడిచినప్పుడే ఆధిపత్యం అంతమవుతుంది. అప్పుడే రాజ్యాంగం కోరుకున్న సమానత్వం అమలవుతుంది. లేదంటే బీసీ ఎస్సీ ఎస్టీలు అంధభక్తులుగా మిగిలి ఆధిపత్య వర్గాల చేతుల్లో బలవడమే అవుతుంది. ఇప్పటికైనా అట్టడుగు వర్గాలంతా మేల్కొని కుమ్మెర ఘటనలో న్యాయం కోసం ఉద్యమించాలి. లేదంటే చరిత్రలో తప్పుచేసిన వాళ్ళుగా మిగిలిపోతారు.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428



# పాలు.. ప్రజారోగ్యానికి శాపాలా?

పాలు మనిషి జీవితంలో తొలి ఆహారం. పుట్టిన శిశువు నుంచి వృద్ధుడి వరకూ ప్రతి దశలోనూ పాలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే వాటిని “సంపూర్ణ ఆహారం”గా పరిగణిస్తారు. రోజువారీ జీవనానికి కావలసిన శక్తి, ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, ఎముకల దృఢత్వానికి అవసరమైన క్యాల్షియం, ఫాస్ఫరస్, శరీర క్రియల సమతుల్యతకు కీలకమైన విటమిన్ బి-12 వంటి అనేక పోషకాలు పాలలో సమృద్ధిగా లభిస్తాయి. పిల్లల ఎదుగుదలలో, దంతాల ఆరోగ్యంలో, కండరాల నిర్మాణంలో పాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతారు. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి, రోగనిరోధక శక్తి పెరగడానికి కూడా పాలు దోహదపడతాయి. రాత్రి పడుకునే ముందు గ్లాస్ పాలు తాగితే నిద్ర బాగా పడుతుందనే విశ్వాసం కూడా సామాన్య ప్రజల్లో బలంగా ఉంది.

పాలు కేవలం పానీయంగా మాత్రమే కాదు; టీ, కాఫీ, పెరుగు, మజ్జిగ, నెయ్యి, స్వీట్లు వంటి అనేక ఆహార పదార్థాల మూలాధారం. ప్రాంతీయ భోజన అలవాట్లు ఎంత భిన్నంగా ఉన్నా, పాల వినియోగంలో మాత్రం దేశవ్యాప్తంగా ఒక సామాన్యత కనిపిస్తుంది. పౌష్టికాహారంగా పాలను పిల్లలకు తప్పనిసరిగా అందించడం, పెద్దలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం సాధారణం. ఆయుర్వేదంలో కూడా పాలను ఔషధంగా వినియోగిస్తారు. కొన్ని రకాల వ్యాధులను నివారించడంలో పాలు ఉపకరిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.

అయితే, ఈ సమగ్ర ఆహారమే నేడు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోందనే ఆందోళన పెరుగుతోంది. కారణం..పాల కల్తీ. పాడి పరిశ్రమలో పెద్ద భాగం ఇంకా అసంఘటిత రంగంలోనే కొనసాగుతోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం, నియంత్రణ లోపాలు, అధిక లాభాల దాహం-స్వార్థం తోడై పాల కల్తీకి మార్గం సుగమం చేస్తున్నాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కల్తీ పాలు తాగి ప్రజలు అనారోగ్యానికి గురైన ఘటనలు వెలుగుచూశాయి. ఈ దారుణాలు సమాజాన్ని కలవరపరుస్తున్నాయి. అధిక ఉత్పత్తి కోసం పశువులకు అనుచితంగా ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇవ్వడం నుంచి, కాలం చెల్లిన పాలపొడి, పామ్ ఆయిల్, యూరియా, నీరు కలిపి కృత్రిమ పాలు తయారు చేయడం వరకు అనేక అక్రమాలు జరుగుతున్నాయి. గంజిపొడి, హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడా, వంట సోడా, డిటర్జెంట్లు, మెలమైన్, మాల్టో డెక్స్ట్రిన్ వంటి రసాయనాలను కలిపి పాలను చిక్కగా, తెల్లగా కనిపించేలా చేసి విక్రయించడం ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం. ఇటువంటి కల్తీ పదార్థాలు శరీరంలోకి వెళ్లినప్పుడు అజీర్తి, కడుపునొప్పి, వాంతులు వంటి తక్షణ సమస్యలు తలెత్తడమే కాదు-దీర్ఘకాలంలో మూత్రపిండాల వైఫల్యం, కాలేయ సమస్యలు, నాడీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీసే అవకాశముంది.

అధికారిక గణాంకాల ప్రకారం గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా వేలాది పాల కల్తీ కేసులు నమోదయ్యాయి. అనేక కేసుల్లో జరిమానాలు, శిక్షలు విధించినా, శిక్షల తీవ్రత తక్కువగా ఉండటం వల్ల నేరగాళ్లకు భయం కలగడం లేదు. లాభాల ఆశతో ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే ఈ అక్రమ వ్యాపారం కొనసాగుతూనే ఉంది. “తెల్లనివన్నీ పాలు కావు” అన్న జాగ్రత్త స్పృహ ప్రతి వినియోగదారుడిలో కలగాలి.

కల్తీ పాలను గుర్తించడం సాధారణ ప్రజలకు సులభం కాదు. కానీ రంగు, వాసన, రుచి, చిక్కదనంలో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే అప్రమత్తం కావాలి. అనుమానాస్పద ఉత్పత్తులను సంబంధిత ఆహార భద్రత శాఖలకు ఫిర్యాదు చేయడం ప్రతి పౌరుడి బాధ్యత. సరైన లైసెన్సులు ఉన్న, నాణ్యత ప్రమాణాలు పాటించే సంస్థల నుంచే పాలను కొనుగోలు చేయాలి. ప్యాకేజింగ్‌పై తయారీ తేదీ, గడువు తేదీ, ప్రమాణ చిహ్నాలు పరిశీలించడం అలవాటు చేసుకోవాలి.

ప్రభుత్వాల పాత్ర కూడా అత్యంత కీలకం. ఆహార భద్రత విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయడం, ప్రయోగశాలల సంఖ్య పెంచడం, ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, కఠిన శిక్షలు అమలు చేయడం ద్వారా మాత్రమే ఈ కల్తీ దందాను అరికట్టవచ్చు. కల్తీ పాల తయారీని తీవ్ర నేరంగా పరిగణించి కఠిన కారాగార శిక్షలు విధించేలా చట్టాలను అమలు పరచాలి. పశువుల సంక్షేమాన్ని కాపాడే చర్యలతో పాటు పాడి పరిశ్రమను మరింత పారదర్శకంగా మార్చాలి.

ఆరోగ్య నష్టం వల్ల దేశానికి కలిగే ఆర్థిక భారం కూడా తక్కువ కాదు. కల్తీ ఆహారాల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురైతే వైద్య వ్యయాలు పెరుగుతాయి, ఉత్పాదకత తగ్గుతుంది, కుటుంబాల ఆర్థిక స్థితి దెబ్బతింటుంది. ప్రజారోగ్యాన్ని కాపాడడం అంటే కేవలం వ్యక్తిగత ఆరోగ్యమే కాదు-దేశ ఆర్థిక భద్రతను కూడా కాపాడడం.

**పాలు స్వభావతః శాపం కావు;..** అవి మన జీవనానికి వరం. కానీ అవినీతి, నిర్లక్ష్యం, నియంత్రణ లోపం వాటిని శాపంగా మార్చుతున్నాయి. అందుకే సమస్య పాలలో కాదు-పాల నిర్వహణలో ఉంది. ప్రజల ఆరోగ్యంపై రాజీ పడని దృఢ సంకల్పం ప్రభుత్వం, పరిశ్రమ, వినియోగదారులలో ఏర్పడితేనే ఈ పరిస్థితి మారుతుంది. సంపూర్ణ ఆహారమైన పాలు నిజంగా ప్రజారోగ్యానికి వరంగా నిలవాలంటే కల్తీపై ఉక్కుపాదం మోపాలి. అవగాహన, కఠిన చట్టాల అమలు, సామాజిక బాధ్యత-ఈ మూడు కలిసొస్తేనే పాల కల్తీ అనే విషచక్రాన్ని కట్టడి చేయగలం. భావితరాల ఆరోగ్య భద్రత కోసం తక్షణమే కట్టుదిట్టమైన చర్యలు అవసరం.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# ఎమర్జెన్సీకి 50 సంవత్సరాలు: ప్రజాస్వామ్యానికి పాఠాలు!

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1975--1977 కాలం ఒక గంభీర అధ్యాయం. 1975 జూన్ 25 అర్ధరాత్రి దేశవ్యాప్తంగా ప్రకటించిన “ఎమర్జెన్సీ” భారత రాజ్యాంగ వ్యవస్థకు, పౌర హక్కులకు, రాజకీయ సంస్కృతికి తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. 2025 నాటికి ఆ సంఘటనకు 50 సంవత్సరాలు పూర్తయ్యాయి. అర్ధ శతాబ్దం అనంతరం ఈ సంఘటనను తిరిగి పరిశీలించడం అనేది కేవలం చరిత్రను స్మరించుకోవడం కాదు; ప్రజాస్వామ్య బలహీనతలను అర్థం చేసుకోవడం, భవిష్యత్తుకు మార్గదర్శక సూత్రాలను నిర్మించడం.

### రాజకీయ నేపథ్యం:

1971 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర నాయకత్వానికి 352 స్థానాలు లభించాయి. ఇది మొత్తం స్థానాల్లో దాదాపు 68% ఆధిక్యం. అదే సంవత్సరం జరిగిన యుద్ధ విజయం దేశంలో జాతీయ భావోద్వేగాన్ని పెంచింది. 1972 తర్వాత రాజకీయంగా కేంద్రం బలపడింది. అయితే 1973 చమురు సంక్షోభం దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. ద్రవ్యోల్బణం 20% దాటింది. నిరుద్యోగం పెరిగింది. 1974 లో జరిగిన రైల్వే సమ్మెలో సుమారు 1.7 మిలియన్ కార్మికులు పాల్గొన్నారు. విద్యార్థి ఉద్యమాలు గుజరాత్, బీహార్ రాష్ట్రాల్లో వేగం పుంజుకున్నాయి.

1975 జూన్ 12 న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయ పరిణామాలకు దారి తీసింది. ఎన్నికల అవకతవకల కారణంగా అప్పటి ప్రధానమంత్రి పదవిని సవాలు చేస్తూ 6 సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేయరాదని తీర్పు వెలువడింది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా అస్థిరతను సృష్టించింది.

### ఎమర్జెన్సీ ప్రకటన

1975 జూన్ 25 రాత్రి రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ప్రకారం “అంతర్గత అశాంతి” కారణంగా జాతీయ ఎమర్జెన్సీ ప్రకటించబడింది. ఈ ప్రకటనతో పాటు ఆర్టికల్ 19 కింద ఉన్న మౌలిక హక్కులు నిలిపివేయబడ్డాయి. పత్రికలపై “సెన్సార్” అమలు ప్రారంభమైంది. వేలాది రాజకీయ నాయకులు, కార్యకర్తలు నిర్బంధించబడ్డారు. అధికారిక అంచనాల ప్రకారం 75,000 నుంచి 1,10,000 వరకు వ్యక్తులు అరెస్టు చేయబడ్డారని పేర్కొంటారు.

### పౌర స్వేచ్ఛల నిరోధం

ఎమర్జెన్సీ కాలంలో వ్యక్తిగత స్వేచ్ఛలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 1976 నాటికి కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో బలవంతపు శస్త్రచికిత్సల సంఖ్య 6 మిలియన్ దాటింది. ఇది 1974 లోని 2 మిలియన్ సంఖ్యతో పోలిస్తే దాదాపు 200% పెరుగుదల. పత్రికలలో ప్రచురితమయ్యే వార్తలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అయింది. సుమారు 250 పైగా పత్రికలు ప్రత్యక్ష నియంత్రణలోకి వెళ్లాయి. ఎమర్జెన్సీ సమయంలో న్యాయవ్యవస్థ పాత్రపై విస్తృత చర్చ జరిగింది. 1976 లో వెలువడిన ఒక కీలక తీర్పులో ఎమర్జెన్సీ సమయంలో వ్యక్తిగత స్వేచ్ఛలను కోర్టులో సవాలు చేయలేమని మెజారిటీ అభిప్రాయం వ్యక్తమైంది. 4:1 నిష్పత్తిలో వచ్చిన ఈ తీర్పు తరువాత కాలంలో ప్రజాస్వామ్య చర్చలకు కేంద్రబిందువైంది. విభిన్న అభిప్రాయం తెలిపిన ఒకే ఒక్క న్యాయమూర్తి ధైర్యసాహసం చరిత్రలో నిలిచిపోయింది.

### 42వ రాజ్యాంగ సవరణ

1976 లో 42వ రాజ్యాంగ సవరణ ఆమోదించబడింది. దీనివల్ల పార్లమెంట్ అధికారాలు విస్తరించబడ్డాయి. న్యాయ సమీక్షపై పరిమితులు విధించబడ్డాయి. కేంద్ర అధికార కేంద్రీకరణ బలపడింది. రాజ్యాంగ ప్రవేశికలో “సోషలిస్ట్”, “సెక్యులర్” పదాలు చేర్చబడ్డాయి. అయితే అధికార సమతౌల్యం దెబ్బతిన్నదని విమర్శలు వచ్చాయి. 1977 మార్చిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గతంలో 352 స్థానాలు గెలుచుకున్న పార్టీ 153 స్థానాలకు పడిపోయింది. ఇది 57% తగ్గుదల. ప్రతిపక్ష కూటమి 295 స్థానాలు గెలుచుకుంది. ఈ ఫలితం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరే తుది నిర్ణేత అని నిరూపించింది. 21 నెలల ఎమర్జెన్సీ కాలానికి ప్రజలు స్పష్టమైన సమాధానం ఇచ్చారు.

44వ సవరణ

1978 లో 44వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చింది. ఆర్టికల్ 352 ప్రకటనకు కేబినెట్ లిఖితపూర్వక సిఫార్సు తప్పనిసరి అయింది. ఆర్టికల్ 21 కింద జీవన హక్కు ఎప్పటికీ నిలిపివేయరాదని స్పష్టం చేశారు. ఈ మార్పులు భవిష్యత్తులో ఎమర్జెన్సీ దుర్వినియోగాన్ని నిరోధించే రక్షణ కవచాలుగా నిలిచాయి.

1975 నుంచి 2025 వరకు 50 సంవత్సరాల కాలంలో భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లు ఎదుర్కొంది. 1977 లో ఓటరు నమోదు శాతం సుమారు 60% కాగా, 2019 లో అది 67% దాటింది. మహిళా ఓటర్ల భాగస్వామ్యం 1971 లో 49% కాగా, 2019 లో 67% కు చేరింది. ఇది ప్రజాస్వామ్యంపై విశ్వాసం పెరిగినదానికి సూచీ.

సోషల్ మీడియా ప్రభావం 2005 తర్వాత వేగంగా పెరిగింది. సమాచార ప్రవాహం విస్తరించినా తప్పుడు సమాచారం వ్యాప్తి 300% పైగా పెరిగిందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య నాణ్యతకు కొత్త సవాల్.

ప్రజాస్వామ్యానికి ప్రధాన పాఠాలు

1. రాజ్యాంగ పరిరక్షణ ఎప్పటికీ సడలకూడదు.
2. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం.
3. మీడియా ధైర్యం ప్రజల హక్కులకు రక్షణ కవచం.
4. పౌర చైతన్యం లేకుంటే వ్యవస్థ బలహీనమవుతుంది.
5. ఓటు శక్తి 100% ప్రభావాన్ని చూపగలదు.

ఎమర్జెన్సీ కాలం 21 నెలలు మాత్రమే కొనసాగింది. కానీ ఆ 21 నెలలు భారత ప్రజాస్వామ్యాన్ని లోతుగా పరీక్షించాయి. అధికార కేంద్రీకరణ ఎంత ప్రమాదకరమో ఆ కాలం నిరూపించింది. రాజ్యాంగ హక్కులు కాగితంపై ఉన్న పదాలు మాత్రమే కాక, వాటిని సంరక్షించే సజీవ చైతన్యం అవసరమని గుర్తుచేసింది.

50 సంవత్సరాల అనంతరం మనం గమనించాల్సింది ఏమిటంటే ప్రజాస్వామ్యం ఒక స్థిర నిర్మాణం కాదు; అది నిరంతర సాధన. ప్రతి తరం తన బాధ్యతను నిర్వర్తించాలి. 1975 లో జరిగిన సంఘటన ఒక హెచ్చరిక. 1977 లో వచ్చిన తీర్పు ఒక పునర్జన్మ. 1978 లో చేసిన సవరణలు ఒక రక్షణ వలయం.

ప్రజాస్వామ్యం బలహీనపడే సూచనలు కనిపించిన ప్రతిసారి 1975 గుర్తు రావాలి. హక్కులు తగ్గించే ప్రతి నిర్ణయం

# ఇరాన్ ప్రతీకార దాడులు- మానవతా సంక్షోభం

పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హతమార్చిన తర్వాత, ఇరాన్ ప్రతీకారంతో రగిలిపోతుంది. వెంటనే తమ దుఃఖాన్ని దిగమింగుకొనే ఇరాన్ సేనలు ...సౌదీ అరేబియా, కతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇరాక్ అలాగే బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులతో విరుచుకుపడు తుంది. ఈ దాడులలో పౌరులు కూడా మరణించారు, జనజీ వనం తీవ్రంగా ప్రభావితమైంది. ఈ సంఘటనలు మధ్య ప్రాచ్యంలో సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. అయి తే, ఈ దాడుల వెనుక ఉన్న కారణాలు ఏకపక్ష నిర్ణయాలు, ఆధారాల లేమి మాత్రమే కాదు, మానవతా కోణంలో ఇది పెద్ద దుర్ఘటన.

### అమెరికా, ఇజ్రాయెల్ అపోహలు,నిందలు:

ఇరాన్ అణు ఆయుధాలు కలిగి ఉందనే ఆరోపణలు దశాబ్దాలుగా అమెరికా, ఇజ్రాయెల్ చేస్తూనే ఉన్నాయి. అయితే, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) నివేదికల ప్రకారం, 2009 తర్వాత ఇరాన్ అణు ఆయుధాల అభివృద్ధి ఆధారాలు లేవు అని స్పష్టం చేస్తూ రిపోర్ట్ ఇచ్చింది. ఇరాన్ యురేనియం సుసంపన్నత కేవలం 60 శాతం వరకు చేసినప్పటికీ, అణు బాంబు స్థాయికి (90 శాతానికి) మాత్రం చేరలేదు. ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రఫాయెల్ గ్రాసి కూడా “ఇరాన్ అణు ఆయుధా లు తయారు చేస్తున్నట్లు ఆధారాలు లేవు” అని 2024లో పేర్కొన్నారు కూడా. కానీ అమెరికా, ఇజ్రాయెల్ నేతలు డోనాల్డ్ ట్రంప్, నెతన్యాహు మాత్రం ఇరాన్‌ను ఏకపక్షంగా ఆరోపిస్తు న్నారు. పైగా ఈ విషయంలో అంతర్జాతీయ తనిఖీలకు స్వాగతించింది. అలాగే ఈ విషయంలో ఇరాన్ చర్చలకు సిద్ధం గా ఉన్నామని ప్రకటించింది. ఒక వైపు చర్చలు కూడా కొనసాగుతున్నప్పటికీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ నేత నెతన్యాహు తమ పట్టు వీడలేదు. ఖమేనీని హతమార్చడ లక్ష్యంగా అధునాతన గైడెడ్ మిస్సైల్ తో దాడి ప్రారంభించి లక్ష్యాన్ని సాధించారు. ఇది 2015 జేసీపీఓఏ (జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్) ఒప్పందాన్ని ఉల్లంఘించ డమే కాదు, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం కూడా!.గతంలో ఇరాక్ పై అమెరికా దాడి -సద్దాం హుస్సేన్ కు ఉరి.



ఇలాగే ఈ సంఘటన గతంలో ఇరాక్ పై అమెరికా చేసిన దాడిని గుర్తుకు తెస్తుంది. ఈ విషయం బహుశా ఇప్పటి యువతరానీకి తెలియకపోవచ్చు. 2003లో కూడా ఆనాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్... సద్దాం హుస్సేన్ వద్ద రసాయనిక మరియు అణు ఆయుధాలు ఉన్నాయని ఆరోపించి దాడి చేశారు. తర్వాత, అమెరికా ఇంటెలిజెన్స్ అధికారులు “మేము పొరపాటు చేశాం” అని చాలా కాలం తర్వాత అంగీకరించారు.అలాగే బుష్ 2005లో “ఇంటెలిజెన్స్ తప్పు” అని పేర్కొన్నారు. అయినా, అమెరికా జరిగిన నష్టానికి బాధ్యత తీసుకోలేదు. ఆ యుద్ధంలో 4,431 అమెరికన్ సైనికులు మరణించారు. 31,994 మంది గాయపడ్డారు. ఇరాకీలలో 1,50,000 నుంచి 6,50,000 మంది మరణించారు (ఇరాక్ బాడీ కౌంట్ మరియు లాన్సెట్ స్టడీల ప్రకారం). పోస్ట్-9/11 యుద్ధాలలో మొత్తం 9,40,000 మంది మరణించారు, 45-47 లక్షల మంది పరోక్షంగా మరణించారు (బ్రౌన్ యూనివర్సిటీ కాస్ట్స్ ఆఫ్ వార్ ప్రాజెక్ట్). ఇరాక్ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, 26 లక్షల మంది అంతర్గత వలసలు పాల్పడ్డారు. ఇప్పుడు ఇరాన్‌పై దాడి కూడా అదే మార్గంలో సాగుతోంది.

### మానవతా కోణంలో ఈ యుద్ధం విధ్వంసకరం:

ఇరాన్ దాడులలో 550 మందికి పైగా మరణించారు (ఇరాన్ రెడ్ క్రెసెంట్). పౌరులు భయాందోళనలలో ఉన్నారు. యూఏఈ, కతార్ వంటి దేశాలలో అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు పౌరులను ప్రభావితం చేస్తున్నాయి. ఈ సంఘటనలు మధ్యప్రాచ్యంలో మరిన్ని విభేదాలు సృష్టిస్తాయి. గతంలోనే అమెరికా-ఇజ్రాయెల్ చేసిన దాడులు ఇరాన్‌లోని అణు సౌకర్యాలు, సైనిక స్థావరాలు ధ్వంసం చేశామనీ స్వయంగా ఆ దేశాలే ప్రకటించాయి. కానీ,తమ నేత ఖొమేనీ మరణంతో ఇప్పుడు ఇరాన్ సైన్యం చేసిన ప్రతీకార దాడులతో పౌరుల మరణాలు పెరిగాయి. ఇరాన్ ప్రతీకార దాడులలో యూఏఈలో 100 మంది బాలికలు మరణించారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన. ప్రధాని నరేంద్ర మోడీ “పశ్చిమాసియా పరిస్థితి తీవ్ర ఆందోళనకరం” అని, “సంయమనం, సంభాషణల ద్వారా పరిష్కారం” చేసుకోవాలని ఇరు దేశాలకు సూచించారు. ఇరాన్ పై దాడులను భారత్ ఖండించ లేదు కానీ, ఇరాన్ చేసిన ప్రతీ కార దాడులను మాత్రం ఖండించింది. అలాగే అమెరికా-ఇజ్రా యెల్ దేశాలు ఇరాన్ పై చేసిన దాడులపై మౌనం వహించింది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇరాన్, ఇజ్రాయెల్ మంత్రు లతో మాట్లాడి సంయమనంగా ఉండాలని కోరారు. భారత్ కు చెందిన 9.7 మిలియన్ల భారతీయులు గల్ఫ్‌లో ఉన్నందున, ప్రస్తుతం భారత ప్రభుత్వం వారి భద్రతపై దృష్టి పెట్టింది.

### గత భారత్ ప్రభుత్వాలతో పోలిక:

మన్మోహన్ సింగ్ నాయకత్వంలో (2004-2014) భారత్ ఇరాన్‌తో సమతుల సంబంధాలు నిర్వహించింది. చారిత్రకంగా ఇరాన్ భారత్ కు మిత్ర దేశం. కనుక జేసీపీఓఏకు మద్దతిచ్చింది. మోడీ ప్రభుత్వం కూడా అదే మార్గంలో సాగుతోంది, కానీ ఇజ్రాయెల్‌తో సంబంధాలు ఇటీవల పెరిగాయి. గతంలో భారత్ అమెరికా ఒత్తిడికి లొంగకుండా ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేసింది. ప్రస్తుతం కూడా భారత్ అలీన విధానం విధానాన్ని అనుసరిస్తోంది.

### మానవతా కోణంలో ఏ వైఖరి సరైనది?

గత మరియు ప్రస్తుత ప్రభుత్వాలు సంభాషణలు, సంయమనం అనే వైఖరిని అనుసరిస్తున్నాయి. ఇది మానవతావాదం. యుద్ధం వల్ల మరణాలు, వలసలు పెరుగుతాయి. ఇరాక్ యుద్ధం తర్వాత ఐఎస్ఐఎస్ లాంటి తీవ్రవాద సమూహాలు పుట్టాయి. ఇరాన్ యుద్ధం కూడా అదే ఫలితాన్ని ఇస్తుంది. భారత్ వంటి దేశాలు ఐక్యరాజ్యసమితి ద్వారా నిష్పక్షిక తనిఖీలు, చర్చలు కోరాలి. ఈ సంక్షోభం అమెరికా-ఇజ్రాయెల్ ఏకపక్ష నిర్ణయాల ఫలితం. అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులను అన్ని దేశాలు గౌరవించాలి. భారత్ వంటి దేశాలు శాంతి మార్గాన్నే ప్రోత్సహించాలి, యుద్ధాన్ని కాదు. ఇది మానవతా సంక్షోభాన్ని నివారించడమే కాదు, ప్రపంచ శాంతికి దోహదపడుతుంది కూడా.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## “ద్రోహులైరి”

టాప్ టు బాటం
సేమ్ టు సేమ్
నో వేరియేషన్
నథింగ్ డిఫరెన్స్
మన పల్లె నుండి
పట్నం దాకానే కాదు
దేశ స్థాయి నుండి
ప్రపంచం వరకు..
ఫరకెక్కడా లేనేలేదు
పొల్లుపోని దుర్నీతే
గిట్టనోళ్ల కుతికె లెల్లా
నులిమేసే దుష్ట రీతి
కుక్కను తెగ సంపగ
తిక్కదను ముందుగనే
లోక వాక్కు సిద్ధంమై
గీ తొవ్వే ఈయుద్ధాల్
ఎదుర్దిగ్గే కం జాతోన్ని
ఖతం జేయుడేం కష్టం
బాణామతి చేస్తాడని
పబ్లిగ్గా అగ్గిపెట్టేసెయ్
దేశసంపదని అడ్గినోళ్ల
నక్స లైటు ముద్దరెయ్
కగార్లల్ల
తుదముట్టించు
ఎంకౌంటర్లని
ప్రకటించు
భూగర్భ తైలంపై
కన్నెయ్
అణ్వాయుధాల
నిందెయ్
దేశాధి నేతల
కుమ్మేసెయ్
బంకర్లన్నీ భస్మం
జేసెయ్
ఇదే గదా మీ చాణక్యం
లౌక్యమని ముర్వకండ్రి
ఎదురేదని నీల్గు డొద్దు
ముందుంది బద్లు
పొద్దు
ఒకరా ఇద్దరా వొందలు
పోరాడే వీరులు
కొల్లలు
సద్దాం ఛావెజ్
ఖొమైన్లు
కనుమర్లైనరు
ఎందరో..
దేశ విదేశ ఖాబ్జా
కోర్లు
సామ్రాజ్యవాద
భంట్లారా
ఆయుధముందని
చేతుల మిడువకురీ
ప్రజలున్నరు
ఒక్కొక్కరొక
సద్దామైతరు
చావెజ్ లయ్యి
హిడ్మా లై
సకలశ్రామిక
ద్రోహుల్నేరేరీ
బొందబెట్తరు పోరు
బిడ్డలు

డా. ఇక్బాల్ పాషా
9440775732

# ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీయొద్దు



**ఇబ్రహీంపట్నం, మార్చి 2 (జనం సాక్షి) :** ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీయొద్దని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కల పల్లి పెంటయ్య పేర్కొన్నారు. ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరకొర వసతులతో, ప్రైవేట్ పాఠశాలలతో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్య బోధిస్తున్న ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా వారి జీతభత్యాల పైన, పదోన్నతుల పైన విద్యా కమీషన్ నివేదిక సమర్పించటం యావత్ తెలంగాణా ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర మనోవేదన కు గురించేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిపోతుంది ఏం చేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి అని సమగ్రంగా పరిశోధించి నివేదిక సమర్పించమంటే ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని తగ్గించేటట్లు వారికి జీతాలు ఎక్కువ కాంట్రాక్టు వారిని తీసుకుంటే ప్రభుత్వానికి భారం తగ్గుతుంది డైరెక్ట్ ప్రమోషన్స్ అవసరం లేదు అనేది రీతిలో నివేదిక ఉందని దీన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. నివేదికలో ఇప్పటికే ఉన్న పాఠశాలను ఎలా బలోపేతం చేయాలి అని చెప్పడానికి బదులు కొత్తగా మండలానికి రెండు తెలంగాణ పబ్లిక్ స్కూల్ లు ఏర్పాటు చేసి ఉన్న మిగతా పాఠశాలలను మూసివేయమని సలహా ఇచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు.గ్రామీణ ప్రాంతాలలో చాలామంది పిల్లలు దూరంలో ఉన్న బడికి వెళ్లలేక విద్యకు దూరమవుతున్నారని ఉద్దేశంతో ఒక కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేసి తెలంగాణ ప్రాంతం అక్షరాస్యతలో ముందు ఉండేలా గత ప్రభుత్వాలు ఆలోచన చేస్తే ఈ నివేదిక ద్వారా ఉన్న పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వానికి సలహా ఇచ్చినట్టు ఉంది అని దీని ద్వారా ఎంతో మంది పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు పాఠశాల విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని అన్నారు.ఇప్పటికే పిఆర్సి అమలుకాక ఐదు డిఏలు పెండింగ్లో ఉండి రావాల్సిన బకాయిలు రాక,పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన పదవీ విరమణ బకాయిలు రాక ఇబ్బందులు పడుతుంటే ఉన్న జీతాలు ఎక్కువ అనడం పట్ల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం విద్యా కమిషన్ రిపోర్టును, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి వ్యవహార తీరును వ్యతిరేకిస్తుందని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల యొక్క జీతాలు ఉన్నతంగా ఉంటేనే మేధావులు విద్యారంగంలో బోధన చేయడానికి ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది అని 1964 లోనే కొఠారి కమిషన్ పేర్కొంది దీనిపైన కనీస అవగాహన లేని విధంగా ఈ రిపోర్టు ఉందని ఇప్పటికైనా ప్రభుత్వం విద్యా కమిషన్ సమర్పించిన రిపోర్టుపై అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి తెలంగాణ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి అవసరమయ్యే విధంగా దానిని రూపొందించి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యేవిధంగా అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆత్మ గౌరవంతో పనిచేసేలా రూపొందిస్తే బాగుంటుందన్నారు ఈ కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోట్ల కాశి రావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్,రాష్ట్ర మీడియా కో కన్వీనర్ సత్తారి రాజిరెడ్డి ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు రాజేందర్, జిల్లా భాద్యులు పున్న రమేశ్, నరసింహా, రవీందర్, కరుణాకర్, జంగయ్య, ఆంజనేయులు, మహేష్ లు పాల్గొన్నారు.

## రోడ్లను అద్దంలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



**శామీర్‌పేట, ఫిబ్రవరి 2 (జనం సాక్షి) :** అలియాబాద్ పురపాలక సంఘం తుర్కపల్లి పరిధిలోని 2వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి స్థానిక కౌన్సిలర్ గుర్కల దీపిక తో కలిసి రాజీవ్ రహదారి నుండి శివా లయము వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ... మున్సిపల్ జనరల్ నిధులు 16 లక్షల 60 వేల రూపాయలతో తుర్క పల్లి లోని 2వ వార్డులో సీసీ రోడ్ నిర్మాణం పనికి శంకుస్థాపన చేశామని తెలిపారు. అదేవిధంగా అన్ని వార్డులలో మౌలిక వసతులు కల్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్ర శేఖర్, వైస్ చైర్ పర్సన్ కన్ రెడ్డి మాలతిమాధవరెడ్డి , కౌన్సిలర్లు ఎల్లు దీపిక వర ప్రసాద్ రెడ్డి , గాదె వెంకటేష్, గూదె వెంకటేష్, ఎండీ యూసుఫ్ బాబా , కైరా గణేశ్ , దాసరి రవి, ముద్దం సుధాకర్ రెడ్డి, హనుమాన్ దాస్, ఏఈ ఈ సనా షాహీన్ , మేడ్చల్ జిల్లా ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి



**నవాబుపేట్, మార్చి 2 (జనం సాక్షి) :** ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన మహేందర్ రెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా వారికీ మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ హాజరై విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉద్యమకారులందరికీ 250గజాల ఇంటి స్థలం,ఉద్యమకారులను స్వతంత్ర సమయోధులుగా గుర్తించాలన్నారు.అదేవిదంగా ఉద్యమకారులను పరిగణలోకి తీసుకొని వారికి కూడా అన్ని సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు 20 శాతం వాటా అమలు చేయాలని అన్నారు.ఉద్యమకారులను గుర్తించి నెలనెలా గౌరవవేతనం ఇవ్వాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించకుండా ఉద్యమాన్ని ఎంతో శ్రమకోర్చి కష్టనష్టాలు భరించి, తెలంగాణ సాధనలో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని కోరారు.ఈ కార్యక్రమం లో టిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కందడా నాగిరెడ్డి ,బిఆర్ స్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతి కుమార్ ,ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, సర్పంచ్ మల్లేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఉద్యమకారులు , ప్రభాకర్ రెడ్డి , కావలి శేఖర్, అశోక్ ముదిరాజ్ , సిద్ధికి ,కేదార్ నాథ్, రఘుపతి రెడ్డి ,సికిందర్ రెడ్డి, కెసిఆర్ సేవాదళ్ మండల అధ్యక్షుడు మాణిక్య రెడ్డి , మహేందర్ రెడ్డి తల్లిదండ్రులు, అన్న సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హోలీ సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 2 (జనం సాక్షి) :** హోలీ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ వినీత్ జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో, సాంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని సూచించారు.హోలీ పండుగతో పాటు రంజాన్ మాసం కూడా కొనసాగుతున్నందున మతసామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవంతో పండుగలు నిర్వహించుకోవాలని తెలిపారు.మత పెద్దలతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.యువత మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అతివేగం, రష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు.ప్రధాన చౌరస్తాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు ముఖ్య ప్రదేశాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతర పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇష్టం లేని వ్యక్తులపై,వాహనాలపై లేదా బహిరంగ ప్రదేశాల్లో బలవంతంగా రంగులు, రంగు నీళ్లు చల్లకూడదని స్పష్టం చేశారు.బైకులు, కార్లలో గుంపులుగా తిరిగి శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దని హెచ్చరించారు.హోలీ అనంతరం చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు చేసే సమయంలో యువత తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే అక్కడ కూడా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలంతా శాంతియుతంగా, భద్రంగా హోలీ పండుగను జరుపుకుని పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## ప్రతి ఒక్కరూ చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి



**ముషీరాబాద్, మార్చి 2 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరూ చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సూచించారు. ఈ మేరకు హైదరాబాద్, ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం డెవలప్ మెంట్ కమిషనర్, చేనేత, న్యూఢిల్లీ భారత ప్రభుత్వ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేనేత, జౌళి శాఖచే జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ప్రారంభించారు. ఈ వస్త్ర ప్రదర్శన మార్చి 2 తేది నుండి మార్చి 15వ తేదీ వరకు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనలో తెలుగు రాష్ట్రాల నుండే గాక కర్ణాటక ఢిల్లీ గుజరాత్ ఉత్తరప్రదేశ్ హర్యానా జమ్మూ కాశ్మీర్ వెస్ట్ బెంగాల్ తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి ఈ ప్రదర్శనలో వైవిధ్య భరితమైన వస్త్రాలు సందర్శకులకు కనువిందు చేయనున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రాచీన వారసత్వ సంపదగా సంక్రమించిన పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్దిపేట గొల్లభామ ,వరంగల్ దర్రిస్ కరీంనగర్ బెడ్ సీట్లు మొదలైన రకరకాల వస్త్రాలను ప్రోత్సహించడానికి ఈ జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## సమిష్టి సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా ఇస్నాపూర్



**పటాన్‌చెరు, మార్చి 2 (జనంసాక్షి) :** నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీని ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులతో కలిసి రాష్ట్రంలోని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారం వార్డు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సుమలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన పురపాలిక తొలి పాలకవర్గ సమావేశానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో నూతనంగా 5 మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి మున్సిపల్ సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రతి వార్డు పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల కోసం వీటిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాబోయే ఐదు సంవత్సరాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. రాబోయే వేసవికాలం దృష్టిలో పెట్టుకొని మంచినీరు, విద్యుత్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి వార్డుని అభివృద్ధి పతంలో ముందుకు తీసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవి రెడ్డి, కమిషనర్ వెంకట కిషన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి సహకరించాలి



**కల్వకుర్తిరూరల్, మార్చి 2 (జనంసాక్షి) :** కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి సహాయసహాకారాలు అందించాలనినాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధవత్ సంతోష్ ను కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కోరారు.సోమవారం కౌన్సిలర్ లతో కలిసి పూల బొకే ఇచ్చి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కల్వకుర్తిలో నెలకొన్న సమస్యలపై విన్నవించారు.అదే విధంగా ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణ సముదాయలను పెంచాలని కలెక్టర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ లు మబ్బు రామరాజు,కుడుముల చంద్రకాంత్ రెడ్డి,గణేష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు,చిన్న,నాయకులుమబ్బు సాయిలు,రావుల కేశవులు,పంబళ్ల కుమార్,బంగారి,పడకంటి వెంకటేష్,దున్న సురేష్, ఏనుగొండ నరేందర్,కృష్ణ,శ్రీను,పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యత




**శేరిలింగంపల్లి, మార్చి 2 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అధికారులు కూడా అంతే జవాబుదారీతనంతో ప్రజావాణి సమస్యలకు ప్రథమ ప్రాధాన్యతను కేటాయిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. శశిరేఖ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి పై నమ్మకంతో ఎంతోమంది ఎదురుచూసి సోమవారం ప్రజావాణికి హాజరై తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులను దాఖలు చేస్తుంటారని, ప్రభుత్వం కూడా దీనిపై సమర్థవంతంగా చర్యలు చేపడుతుండడమే ప్రజలలో ప్రజావాణి పట్ల పెరిగిన నమ్మకానికి నిదర్శనం అని తెలిపారు. సర్కిల్ కార్యాలయానికి మొత్తం 17 ఫిర్యాదులు అందగా ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి 04, పట్టణ ప్రాణాలకు అవిభాగానికి 13 ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న వారిలో రెవెన్యూ విభాగం ఏఎంసి విజయకుమార్, టి పి ఎస్ రమేష్, డిఈ వశీధర్, సర్కిల్ వైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి, సానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్, ఎఫ్ఎస్ఓ శృతి గౌడ్, ఇంజనీరింగ్ భాగానికి సంబంధించి ప్రశాంత్, ఎంటమాలజీ విభాగానికి బాలా గౌడ్, వెటర్నరీ సెక్షన్ కు సంబంధించి గీత, యుబిడి సెక్షన్ నుండి సతీష్ బాబు, యు సి డి సెక్షన్ నుండి వీణ, విద్యుత్ శాఖ నుండి శివశంకర్ రెడ్డి హాజరైనట్లు డిసి తెలిపారు. దీనిలో భాగంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో 35 ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు.

## మాదిగలకు రాజ్యసభ సీటు కేటాయించాలి



**సికింద్రాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** తెలంగాణలో ఎస్సీ రిజర్వు లోక్‌సభ స్థానాలు ఉన్నప్పటికీ మాదిగలకు ఒక్క స్థానం కూడా కేటాయించలేదని కాంగ్రెస్ పార్టీపై ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ మండిపడ్డారు. రాష్ట్రంలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలలో కనీసం ఒకటి మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఏప్రిల్ నెలలో రాజ్యసభ సభ్యులు అభిషేక్ సింఘ్వీ మరియు సురేష్ కుమార్ రెడ్డి పదవీకాలం ముగియడంతో రెండు స్థానాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు. వాటి భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలై, ఈ నెలలో ఎన్నిక జరగనుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలలో కనీసం ఒకటి మాదిగలకు కేటాయించి చిత్తశుద్ధిని చాటుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ను డిమాండ్ చేశారు. మాదిగ సమాజానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకుండా చేయడం అన్యాయమని, రాజ్యసభలోనైనా అవకాశం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సమాజం తీవ్ర ఆగ్రహానికి లోనవుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# గోల్డ్ చైన్ దొంగతనం కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్



**శేరిలింగంపల్లి, మార్చి 2 (జనంసాక్షి) :** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ పాల్పడిన కేసులో మియాపూర్ పోలీస్ అధికారులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని మియాపూర్ డిఐ రమేష్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మియాపూర్ డిఐ వెల్లడించిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా రామాయంపేట కు చెందిన 36 ఏళ్ల గృహిణి గత నెల 25న మియాపూర్ లోని వశిష్ట జూనియర్ కాలేజ్ లో చదువుతున్న తన కుమార్తెను కలవడానికి రావడం జరిగింది. ఇందులో భాగంగా అదే రోజు మధ్యాహ్నం కళాశాల రోడ్డులో ఉన్న బస్టాప్ వైపు నడుచుకుంటూ వెళుతుండగా ఓ బైక్ పై వెనక నుండి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ఉన్న 70 గ్రాముల మంగళసూత్రం గొలుసును లాక్కొని పరారయ్యారు. కాగా ఈ ఘటనలో వారి చేతికి 10 గ్రాముల బంగారు గొలుసు చిక్కగా మిగిలిన 60 గ్రాముల గొలుసు ఆమె చీరలో చిక్కుకొని ఆమె వద్దనే ఉండిపోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు సాంకేతిక ఆధారాలపై దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ప్రధానంగా ఉత్తర ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన అభయ్ కుమార్ దూబే(30), ఆకాష్ కుమార్ రజక్(18) గా డిఐ వివరించారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు నేరాన్ని అంగీకరించడం జరిగిందని, వారి వద్ద నుండి 10 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని, దొంగతనానికి ఉపయోగించిన బైకును సైతం స్వాధీనపరచుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డిఐ రమేష్ నాయుడు మాట్లాడుతూ బంగారం ధర బాగా పెరిగిపోయినందున దొంగలు, దుండగులు ఒంటరిగా ఉండే మహిళలను లక్ష్యంగా చేసుకొని మెడలోని గొలుసు, నెక్లెస్, ఇతర ఆభరణాలను దోచుకుని పారిపోయే అవకాశం ఉంటుందని, బయటికి వెళ్లిన సమయంలో ఆభరణాలు కనిపించకుండా చీరను కప్పుకోవడం ఉత్తమమని హితవు పలికారు. తాము నివసించే ప్రదేశాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపించినా, దొంగతనానికి పాల్పడే ప్రయత్నం చేసినా వీలైనంత త్వరగా 100కు డయల్ చేసి సమాచారం అందిస్తే వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుని బాధితులకు న్యాయం చేసే అవకాశం లభిస్తుందన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
03 మార్చి 2026

# పాలమూరులో ఆగని చెరువుల కబ్జాలు

- ఇక చట్టపరమైన యుద్ధమే!
- 15 రోజుల్లో చర్యలు లేకపోతే హైకోర్టులో పిల్
- ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు ప్రభాకర్



**మహబూబ్‌నగర్ రూరల్, మార్చి 2 (జనం సాక్షి) :** పాలమూరు జిల్లాలో చెరువులు, కుంటలు, ట్యాంక్ బండ్లు నిరంతరం అక్రమ కబ్జాలకు గురవుతుండడం అత్యంత దురదృష్టకరమని జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టర్ కుష్బూ గుప్తాకి వినతి పత్రం అందజేసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లోని పెద్ద చెరువు,మోడంకుంట, తాటికుంట, మంగలికుంట, ఎర్రకుంట చిక్కుడు వాగు వంటి జలవనరులు రియల్ ఎస్టేట్ దందా దారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆయన ఆరోపించారు. ఫుల్ ట్యాంక్ లెవల్ ఫీల్ పరిధిలోనే అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, బఫర్ జోన్ నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించబడుతున్నాయని తెలిపారు. పెద్ద చెరువులో తీవ్రమైన కాలుష్యం నెలకొంది. మురుగు నీరు చేరడం, చెత్త పారవేత, అక్రమ నిర్మాణాల వల్ల 120 ఎకరాల చెరువు అసలు విస్తీర్ణం తగ్గిపోతోందని తెలిపారు. దీనివల్ల భూగర్భ జలాలు పడిపోతున్నాయి, తాగునీటి సమస్యలు పెరుగుతున్నాయి, భవిష్యత్ తరాలకు నీటి భద్రత ప్రమాదంలో పడుతోందని హెచ్చరించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ మరియు ఫిషరీస్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ కబ్జాలు ఆగడం లేదని విమర్శించారు. అధికారులు స్పందించకపోవడం ప్రజా వనరులపై జరుగుతున్న దోపిడీకి మౌన సహకారం అందించినట్టేనని వ్యాఖ్యానించారు. చెరువులపై ఆధారపడి జీవించే ముదిరాజ్ మత్స్యకారులకు భారీ నష్టం జరుగుతోందని తెలిపారు. చేపల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలుష్యం పెరగడం వల్ల వందలాది కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోయాయని అన్నారు. ఫిషరీస్ శాఖ వెంటనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించినట్లు పేర్కొంటూ, 15 రోజుల్లోగా సంయుక్త సర్వే నిర్వహించి చెరువుల అసలు సరిహద్దులను గుర్తించి, ఫీల్ మరియు బఫర్ జోన్ ప్రాంతాల్లోని అక్రమాలను తొలగించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే, తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పిల్ దాఖలు చేసి చట్టపరమైన పోరాటం ప్రారంభిస్తామని మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ ఘాటుగా హెచ్చరించారు. పాలమూరులో చెరువులను కాపాడటం కోసం అవసరమైతే ప్రజా ఉద్యమాలు, నిరసనలు కూడా చేపడతామని స్పష్టం చేశారు. కలెక్టర్ కలిసినవారిలో తీగల ఆంజనేయులు ముదిరాజ్ గోనెల రాము తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ సభాపతి పదవికి వన్నెతెచ్చిన మహానీయుడు దుద్దిళ్ళ శ్రీపాదరావు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, మార్చి 2 (జనం సాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు 89వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం ఐడిఓసి ఆవరణలో శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఇతర అధికారులతో కలిసి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీపాద రావు ప్రజాసేవకు అంకితమై, శాసనసభ స్పీకర్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు. సభ గౌరవ, మర్యాదలను కాపాడటంలో కీలకపాత్ర పోషించారన్నారు. శ్రీపాద రావు ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవకు అంకితభావంతో ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవ కరమైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,ఆర్డిఓ శ్రీనివాస రావు,కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, పలువురు జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలకు రాజ్యసభలో అవకాశం కల్పించాలి

- మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి



**మెదక్, మార్చి 2 (జనం సాక్షి) :** మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాజ్యసభలో మాదిగలకు అవకాశం కల్పించాలని తగినంత ప్రాధాన్యం ఇవ్వకపోవడం మాదిగల ఆత్మగౌరానికి భంగం కలిగించినట్లుగా అర్థమవుతుందన్నారు తక్షణమే ఒకరికి రాజ్యసభ స్థానం ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం గత ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలపై వక్ర ధోరణి ప్రదర్శిస్తున్న తీరును ఎస్సీలకు రాజకీయ స్థానాలు దురుద్దేశంతోనే కేటాయించకపోవడం ఎదుగుదల పూర్తిగా రాజకీయ సమాధి చేయాల్సించినట్లుగానే పరిణామాల పూర్తిగా రాజకీయ మనగడలో మాదిగలకు స్థానం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అంచవేతే ప్రయత్నాలు ఇక మానుకోవాలన్నారు లేకుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ మాదిగల ఓటర్లతో రాజకీయ సమాధి పరాయిజయం ఎదుర్కోవాల్సి వస్తుందని డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మాదిగలకు రాజ్యసభలో ఒకరికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సోమవారంరోజు మెదక్ జిల్లా కేంద్రంలో గల ఐబి గెస్ట్ హౌస్ లో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా ముఖ్య సమావేశం జరిగింది. ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ గారి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దండల్ల సామెల్ అన్న మాదిగ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వస్త్ర గల బాలరాజు ఎంఆర్పిఎస్ మెదక్ మండల సీనియర్ నాయకులు చెవిటి గట్టేసి మాదిగ వికలాంగుల సంఘం మహిళ అధ్యక్షురాలు ముక్త స్వరూప ముదిరాజ్ పెద్దింటి రాములు, చీకోటి పోచయ్య, చికోటి రాములు ఉప్పల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, మార్చి 2 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, సాగునీటి శాఖల అధికారులతో కలిసి భూసేకరణ పనుల పురోగతిపై కలెక్టర్ సమగ్రంగా చర్చించారు.జిల్లాలో అమలులో ఉన్న ప్రాధాన్య ప్రాజెక్టులు అయిన పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, అలాగే అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, న్యాయబద్ధంగా భూసేకరణ ప్రక్రియ కొనసాగించాలని ఆయన సూచించారు. భూ యజమానులతో సమన్వయం చేసుకుని, వారికి చెల్లించాల్సిన పరిహారం విషయంలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.భూసేకరణకు సంబంధించిన పెండింగ్ కేసులు, వివాదాలు, సర్వే ప్రక్రియలు త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి దశలో సమన్వయం పెంచుకుని నిర్ణీత గడువులో పనులు ముగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అవసరమైతే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.సంబంధిత అధికారులు తమ బాధ్యతలను గుర్తుంచుకుని ప్రభుత్వ లక్ష్యాల సాధనలో చురుకుగా పనిచేయాలని, ప్రతి వారమూ పురోగతిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్ రెవెన్యూ, సాగునీటి శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం

- ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి టౌన్, మార్చి 2 (జనం సాక్షి) :** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఈ సందర్భంగా సమస్యలతో జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా వినీ, సమస్యలకు సంబంధించిన అంశాలపై సంబంధిత ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకుని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, మీ సమస్యలు స్థానిక పోలీస్ స్టేషన్‌లలో పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## జిల్లా హెల్ప్ డెస్క్ ద్వారా మాతా సంరక్షణ సేవలు మెరుగుపరచాలి



**నాగర్‌కర్నూల్, మార్చి 2 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న జిల్లా హెల్ప్ డెస్క్ ద్వారా జిల్లాలోని గర్భిణీలకు బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని మాత సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఏ.లక్ష్మణ్ అన్నారు. సోమవారం నాడు జిల్లా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న హెల్ప్ డెస్క్ ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.హెల్ప్ డెస్క్ ద్వారా నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి గర్భవతులు ఆరోగ్య పరీక్షలకు మరియు ప్రసవసేవలకు అధిక సంఖ్యలో వచ్చే విధంగా హెల్ప్ డెస్క్ ద్వారా గర్భవతులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గర్భవతులు ఇంటి నుండి ఆసుపత్రికి ఆరోగ్య పరీక్షలకు వచ్చే సమయంలో 102 అంబులెన్స్ ను ఉచిత రవాణా ద్వారా సేవలు వినియోగించే విధంగా సూచించాలన్నారు. గర్భవతులకు అత్యవసర సమయంలో ఆస్పత్రికి చేరుటకు 108 అంబులెన్స్ ద్వారా వచ్చే విధంగా ప్రతి గర్భిణీకి తెలియజేయాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో ప్రసవ అనంతరం వారు కోరిన స్థలానికి ఇంటికి చేరుటకు 102 అంబులెన్స్ సేవలను ఉపయోగించి వాహనంలో ఇంటికి పంపాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి గర్భిణికి స్త్రీ వైద్య నిపుణులచే ఆరోగ్య పరీక్షలు, ప్రత్యేక సూచనలు వారి ద్వారా ఇప్పించాలని ఆయన సూచించారు. జిల్లాలోని ప్రతి గర్భిణీకి మూడు, నాలుగవ ఆరోగ్య పరీక్షలు గైనకాలజిస్టులచే పరీక్షలు చేయించాలన్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్ ద్వారా అన్ని రకాల మూత్ర రక్త పరీక్షలు ఉచితంగా అందే విధంగా చూడాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. గర్భవతులకు హెల్ప్ డెస్క్ ఇతోధికంగా ఉపయోగపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాజగోపాల చారి, నరసింహ, డిప్యూటీ పారామెడికల్ అధికారి సుకుమార్ రెడ్డి, ఆరోగ్య విస్తీర్ణ అధికారి నిరంజన్, జిల్లా హెల్ప్ డెస్క్ఇంచార్జ్ టి.యాదగిరి, సూపర్వైజర్ కే.గంగా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి



**సంగారెడ్డి టౌన్, మార్చి 2 (జనం సాక్షి) :** ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం లో వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ల ఉమహారతితో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులు భూ సమస్యలు, తదితర అంశాలతో పాటు పంచాయతీరాజ్ ఇంజనిరింగ్, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్య, డిడబ్ల్యుఓ, డిసిఎస్ఓ, పశుసంవర్ధక, శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి లో 56 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆర్జి దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారులు,వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, ప్రజలు పాల్గొన్నారు.

## ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం

**చేర్యాల, మార్చి 2 (జనంసాక్షి) :** ఒక్క సీసీ కెమెరా వందమందితో సమానమని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ సిహెచ్.కుశల్కర్ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ నిధులు రూ.2 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన పది సీసీ కెమెరాలను సోమవారం సర్పంచ్ కుమార్, సీఐ బానోతు రమేష్, ఎస్ఐ గూడ అపూర్వరెడ్డితో కలిసి కుశల్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిసినల్ డీసీపీ అడ్మిన్ కుశల్కర్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల గొడవలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల వంటి వాటిలో నిందితుల కదలికలను సులువుగా గమనించి కేసులను త్వరగా ఛేదించవచ్చున్నారు. సీసీ కెమెరాలు మహిళ రక్షణకు ఒక ఆయుధంగా పనిచేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోలోజు రాజబాబు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిసిన శివసేన రెడ్డి



**వనపర్తి బ్యూరో, మార్చి 2 (జనం సాక్షి) :** తెలుగు రాష్ట్రాలలో డిసిసి అధ్యక్షుల కోసం నిర్వహించిన సంఘటన సృజన్ అభియాన్""లి శిక్షణ శిబిరాన్ని కార్యక్రమాన్ని నిర్విరామంగా పది రోజులపాటు నిర్వహించారు. డిసిసి అధ్యక్షులకు,పార్టీ నాయకుల దిశ నిర్దేశించే ముగింపు కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.సోమవారం వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిభిరంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. రాహుల్ గాంధీనీ రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. రాహుల్ గాంధీ, శివసేన రెడ్డితో రాష్ట్రంలో క్రీడా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న క్రీడాంశాలపై, జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం శిక్ష శిబిరంలో సంస్థాగత బలోపేతం, నాయకత్వానికి సంబంధించిన సామర్థ్యాల, బూతు స్థాయి నుండి పార్టీని పటిష్టంగా చేసే దిశగా ఈ యొక్క శిక్షణ శిబిరం ఎంత దోహదపడుతుందన్నీ డిసిసి అధ్యక్షులకు సూచించారు.

# గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి టౌన్, మార్చి 2 (జనం సాక్షి) :** గ్రామాల సర్వతో ముఖాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు బాధ్యతా యుతంగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు (నాలుగు మండలాలకు చెందిన 4వ బ్యాచ్) నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్.పి ప్రావిణ్య సర్పంచులను ఉద్దేశించి మాట్లాడుతూ,శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో గ్రహించి, శిక్షణలో నేర్చుకున్న అన్ని విషయాలు గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామానికి మంచి చేయాలన్న, గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా చట్టపరమైన నిబంధనల మేరకు అమలు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఉన్న సమస్యలను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా పరిష్కరించాలి, అందుబాటులో ఉన్న నిధులను ఎలా సక్రమంగా వినియోగించుకోవాలి వంటి అంశాలపై ఈ శిక్షణ ద్వారా స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యతని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించి, ప్రాధాన్యత ఆధారంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను మార్చి 31 లోగా పూర్తిచేయాలని కోరారు.ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వేసవి కాలంలో నీటి సరఫరా సవ్యంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా పనిచేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శిక్షణ తరగతులకు సంబంధించిన మెటీరియల్‌తో కూడిన బ్యాగులను సర్పంచులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు, డి.డబ్ల్యూ.ఓ లలిత కుమారి ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## సంప్రదాయ పద్ధతుల్లో హోలీ పండుగ జరుపుకోవాలి

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులను ఉపయోగిస్తూ ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. బైకులపై, కార్లలో గుంపులుగా తిరుగుతూ పెద్ద శబ్దాలు చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, ఇష్టం లేని వ్యక్తులపై బలవంతంగా రంగులు లేదా రంగు నీళ్లు చల్లడం చేయరాదని సూచించారు. యువత వాహనాలు నడిపేటప్పుడు అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి శాంతిభద్రతా సమస్యలు తలెత్తకుండా సున్నిత ప్రదేశాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. హోలీ అనంతరం చెరువులు, లోతట్టు ప్రదేశాలు, ప్రాజెక్టులలో స్నానాలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలని, ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ రంగుల హోలీ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తూ భూపాలపల్లి జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి జిల్లా పోలీసు శాఖ తరుపున హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పశ్చిమలో ఎన్నో ఏళ్ల సుదీర్ఘ సమస్యలకు పరిష్కార మార్గాలు

- గాంధీనగర్ శ్మశానవాటిక రోడ్డు నిర్మాణం కోసం భూ కేటాయింపు చేసిన ఎమ్మెల్యే నాయిని
- దర్గా రైల్వే గేట్ నుంచి కడిపికొండ వరకు రోడ్డు మార్గం సుగమం
- ఒకే రోజు రూ.9.37 కోట్ల పనులకు శంకుస్థాపన



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 2 (జనంసాక్షి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం రోజున 48, 49 డివిజన్ల పరిధిలో సుమారు రూ.9.37 కోట్ల విలువైన అభివృద్ధి పనులను రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూర్ పాషా,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు. శంకుస్థాపనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఎన్ ఐ టి రహదారి పనులు ప్రారంభం కావడంతో ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు.గతంలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ఎవరు పట్టించుకోలేదని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులను సమకూర్చి ప్రత్యేక దృష్టితో ఈ రోజు పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని తెలిపారు.కాజీపేట దర్గాలో గల గాంధీ నగర్ ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న స్మశాన వాటిక రోడ్డు కోసం దర్గా పీఠాధిపతి కుసురు పాషా గారుని ఒప్పించి రోడ్డు ఏర్పాటు స్థలాన్ని కేటాయించడం జరిగిందని తద్వారా ప్రజలకు రోడ్డు సౌకర్యం మెరుగుపడుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మానస రాంప్రసాద్, సత్రాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ అబూబకర్, సీనియర్ నాయకులు అమర్, కట్ట రఘుపాల్ రెడ్డి, మట్టెడా కుమార్, డివిజన్ అధ్యక్షులు సింగరపు రవి ప్రసాద్, మల్లారెడ్డి తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి


- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 2 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్ రార్ తమ తాత ముత్తాతలకు చెందిన షెత్ సింధీ భూములను అన్యాక్రాంతం కాకుండా తమకు వర్తించే విధంగా న్యాయ సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన గజెల్లి నర్సయ్య తన భూమిలోకి కొందరు అక్రమంగా చొరబడి బోర్ వేశారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన కాసిపాక విజయ్ కుమార్, బెల్లంపల్లి పట్టణం కాంట్రాక్టర్ బస్తీకి చెందిన దాగం చరణ్ తాము తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని పోరాడామని, తమ పేర్లను ఉద్యమకారుల జాబితాలో నమోదు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. తాండూర్ మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన చునార్కర్ తారాబాయి, చునార్కర్ శ్యాం రావు తాము సంవత్సరాలుగా కాస్తు, కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న భూమికి నూతన పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మందమర్రి మండలం అందుగులపేట గ్రామానికి చెందిన బొద్దుల స్వప్న దివ్యాంగురాలు అయిన తనకు ప్రభుత్వ పథకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కు చెందిన పోలికోట సుజిత్ నిరుపేద ట్రాన్స్ జెండర్ అయిన తనకు రెండు పడక గదుల ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. అనంతరం దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని దుద్దిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైల్డ్ లైఫ్ రంగంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన

- రెండు వందల ఫోటోలతో వైల్డ్ లైఫ్ ఫోటోల ఎగ్జిబిషన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీ పట్ల ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ పలుమార్లు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాల నంబర్ వన్ లో ప్రపంచ వైల్డ్ లైఫ్ డే సందర్భంగా పాఠశాలలో పెద్ద ఎత్తున ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో రెండువందల ఫోటోలవరకు పెట్టారు. ఈకార్యక్రమానికి కాలనీ కౌన్సిలర్ కలాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీలో నిత్యం వివిధ రకాల పక్షులు, వన్యప్రాణులు, అరుదైన వలస పక్షుల ఫోటోలను తన కెమెరాల్లో బందిస్తూ ఆదిలాబాద్ జిల్లాను రాష్ట్రస్థాయిలో తీసుకెళ్లిన గొప్ప వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ అని అటువంటి వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ మన జిల్లాలో ఉండడం మన అందరి అదృష్టం అన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి కృష్ణ, పాఠశాల ప్రదానోపాద్యాయు రాలు నీలాదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కళతప్పిన జాజిరి సంబరాలు

- జాజిరి ఆటకు నేటి యువత నిరాసక్తత





**బెల్లంపల్లి, మార్చ్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ పల్లెల్లో హోలీ పండగకు ముందు 9 రోజుల పాటు పిల్లలు, యువకులు జాజిరి ఆడుతుండగా, యువతులు, మహిళలు కాముడు ఆడేవారు. కానీ రాను రాను తెలంగాణ పల్లెల్లో జాజిరి, కాముడు ఆటలు గత చరిత్రగా పాఠ్య పుస్తకాల్లో చదవాల్సి వస్తుందేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణలో హోలీ పండుగకు ముందు కాముని పున్నమి (హోలీ) నేపథ్యంలో 9 రోజుల పాటు పిల్లలు, పెద్దలు ఆడే సాంప్రదాయ ఆట జాజిరి ఆట. ఇది పల్లెల్లో సంతోషం, సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. కోలాటాలు పాటలతో సాగుతుంది, చివరి రోజు ఈ కోలలను కామదహనంలో వేసి దహనం చేసే సాంప్రదాయాన్ని పాటిస్తారు. జాజిరి ఆట అంటే హోలీ పండుగ రాకను సూచిస్తుంది. పది రోజుల పాటు గ్రామాల్లో ఉత్సాహాన్ని నింపుతుంది. సాంప్రదాయ కోలాటం, జాజిరి ఆటలతో పిల్లలు పెద్దలు కోలలను (కర్రలను) లయబద్ధంగా కొడుతూ పాటలు పాడుతూ సంప్రదాయాన్ని కొనసాగిస్తారు. జాజిరి, కోలాటం ఆడిన 9 లేదా 10 రోజుల తర్వాత చివరి రోజున అమావాస్య నాడు ఈ కోలలను కామదహనంలో వేసి దహనం చేస్తారు. సాయంత్రం నుండి పొద్దుపోయే వరకు ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తులతో కలిసి ఆనందంగా ఈ ఆటను ఆడుతారు. ఒకప్పుడు జాజిరి ఆటలో పిల్లలు గల్లీకి ఒక జట్టుకట్టి ఇల్లిళ్లు తిరిగి జాజిరి పాటలు పాడుతూ, కోలలతో లయబద్ధంగా కొడుతూ డబ్బులు, బియ్యం, జొన్నలు ఇతర సామాగ్రి సేకరిస్తారు. జాజిరి, కోలాటం భయానికి కొందరైతే ఇళ్లలో దాక్కొని సమయానికి ముందే ముసుగు తన్ని పడుకొని నిద్రపోయారేమో అనేలా నటించే వారు. యువతులు, మహిళలు సైతం గల్లీకొక జట్టుకట్టి కాముడు ఆడేవారు. చప్పట్లతో కాముని పాటలు పాడి ముక్కుపిండి వసూలు చేసే వారు. ఏడాదికి ఒక్కసారి కదా అని పల్లె ప్రజలు వారికి తోచింది ఇచ్చి ఆడపడుచులను సంతోష పెట్టేవారు. కాముడు ఆడటానికి వచ్చిన ఆడపడుచులు చల్లంగా ఉండాలని దీవించే వారు. కానీ నేడు తెలంగాణలోని మెజార్టీ పల్లెల్లో సాంప్రదాయ జాజిరి, కాముడు ఆటలు కానరావడం లేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సంప్రదాయ ఆటలు కనుమరుగయ్యే ప్రమాదంలో పడ్డాయి.

### లంబాడీలకు హోలీ పెద్ద పండగ

లంబాడీలు (బంజారాలు) హోలీ పండుగను ఎంతో ఉత్సాహంగా సాంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తారు. దీనిని సాధారణంగా 'హోలీ' లేదా 'రంగీ' అని పిలుస్తారు. ఈ వేడుకల్లో భాగంగా అగ్నిపూజ (హోలికా దహనం) సాంప్రదాయ బంజారా పాటలు లెంగీ నృత్యాలు, రంగులు చల్లుకోవడం, డోలు వాయిద్యాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. లంబాడీలకు (గోర్ మాటి) హోలీ పండగ ప్రత్యేకంగా నిలుస్తుంది. లంబాడి మహిళలు సాంప్రదాయ దుస్తులు (కాటన్ కుర్తాలు దుపట్టాలు) ధరించిగుండ్రంగా తిరుగుతూ 'లెంగీ' నృత్యం చేస్తారు. పాటలు, డోలుతో బంజారా సంస్కృతిని ప్రతిబింబించే జానపద పాటలు పాడతారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా మంటలు వేసి పూజిస్తారు. సహజసిద్ధమైన రంగులను ఉపయోగించి ఆనందంగా రంగులు చల్లుకుంటారు. ఈ పండుగ బంజారా తండాల (గూడేల) ప్రజలను ఏకం చేస్తుంది. పాత సంబంధాలను పునరుద్ధరిస్తుంది. హోలీ పండగ అనంతరం లంబాడీలు యాట పోతును కోసి సామూహిక భోజనాలు చేస్తారు. ఇది వసంత కాలపు రాకను ప్రేమను, ప్రకృతితో వారి బంధాన్ని జరుపుకునే ఒక ప్రధాన పండుగ. కాగా ఇలాంటి సాంప్రదాయ పండగ నేడు కేవలం హోలీ పండగ రోజు మద్యం, దొరికితే బంగు సేవించి ఎంజాయ్ చేయడం, రంగులు చల్లుకోవడానికే అన్నట్టుగా ప్రస్తుతం నేటి యువత భావిస్తుంది. ఇలాంటి సాంప్రదాయ పండగలను బతుకమ్మ పండగ లాగా ప్రభుత్వం ప్రోత్సహించి, జాజిరి, కాముడు, కోలాటం ఆటలకు పునర్వైభవం తేవాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, మార్చి 2 (జనంసాక్షి) :**జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ 86 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్వీకరించిన పలు ఫిర్యాదుల వివరాలిలా ఉన్నాయి. జాఫర్గడ్ మండలం, తమ్మడపల్లి గ్రామానికి చెందిన లోకిని కిష్టయ్య, తనకు సర్వే నంబర్ 173 లో 7 గుంటలు, 324/బి లో 36 గుంటల భూమి కలదని, తన పేరున పట్టా పాస్ బుక్ జారీ చేయుట కొరకు దరఖాస్తు చేసుకున్నారు. కొడకండ్ల మండలం, రంగాపురం గ్రామానికి చెందిన నలమాస నర్సమ్మ, తన భర్త కల్లు గీత కార్మికుడిగా చేస్తూ అనారోగ్యంతో మరణించాడని, తాను ఒంటరి మహిళ అయినందున ఒంటరి మహిళ పింఛను ఇప్పించుటకు తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటూ దరఖాస్తు చేసియున్నారు. తరిగొప్పుల మండలం, అబ్దుల్ నాగారం గ్రామానికి చెందిన బాషబోయిన ఉప్పమ్మ, తన ఇందిరమ్మ ఇంటికి కిచెన్ లో మెట్ల నిర్మాణం గురించి విన్నవిస్తూ అర్జీ చేశారు. జాఫర్గడ్ మండలం, రఘునాధపల్లె గ్రామానికి చెందిన ఎడ్ల స్వప్న, తనకు ఎకరం 27 గుంటల భూమి కలదని, ఆ భూమిని రికార్డులో తన పేరును నమోదు చేయించగలరని వినతిపత్రం సమర్పించనైనది. ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఆర్డీఓ వసంత, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, డీఏఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీ నాగులమ్మ జాతర షురూ

- వైభవంగా 'శ్రీ నాగులమ్మ మహా జాతర' నిర్వహణ
- ఆదివాసి సాంప్రదాయబద్ధంగా శ్రీ నాగులమ్మకు పూజలు
- ఆలయ ధర్మకర్త బాడిషా రామకృష్ణ స్వామీజీ...








**మంగపేట మార్చి 02(జనంసాక్షి) :** మండలంలోని రాజుపేట కేంద్రంలో గల లక్ష్మి నర్సాపూర్ గ్రామంలో కొలువు దీరిన శ్రీ నాగులమ్మ మహా జాతర ను నేటి నుండి 07 వ తేదీ వరకు వైభవంగా నిర్వహించడం జరుగుతుంది అని ఆలయ మేనేజింగ్ ట్రస్ట్, ఆలయ ధర్మకర్త, ప్రధాన పూజారి బాడిషా రామకృష్ణ స్వామీజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మంగళవారం మండే మెలుగుట తో జాతర ప్రారంభం అవుతుందని 04 వ తేదీ బుధవారం గండోర్రె గుట్ట నుండి శ్రీ నాగులమ్మ తల్లి రాక(సడలమ్మ), అనంతరం గోదావరి పుణ్య స్నానాలను,05 వ తేదీ గురువారం రాత్రి 11.35 ని.లకు శ్రీ నాగులమ్మ, పగిడిద్దరాజుల దివ్య కళ్యాణం మహోత్సవం, శ్రీ నాగులమ్మ తల్లి ఉపాసకులు ఆలయ ప్రధాన పూజారి బాడిషా రామకృష్ణ స్వామీజీ లోక కళ్యాణార్థం అగ్నిగుండ లో నరుచుట కార్యక్రమం, 05 వ తేదీ శుక్రవారం శ్రీ నాగులమ్మ తల్లికి మొక్కులు చెల్లించుట చివరిగా 07 వ తేదీ నాడు శ్రీ నాగులమ్మ తల్లి అమ్మవారు తిరిగి వన ప్రవేశం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ఐదు రోజులపాటు శ్రీ నాగులమ్మ మహా జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా గిరిజన సాంప్రదాయ బద్ధంగా నిర్వహించడం జరుగుతుంది భక్తులు లక్షలాదిగా తరలివచ్చి శ్రీ నాగులమ్మ తల్లి దర్శనం చేసుకుని జాతరను విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో వడ్డెలు సోడి సత్యం, కుర్సం పుల్లయ్య, మడకం రమేష్, పూజారులు బాడిశా నాగ రమేష్, బాడిశా నవీన్, కొమరం ధనలక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలి

- మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలు, విద్యాసంస్థలను తనిఖీ చేయాలి..
- హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి..
- పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాలు



**మహబూబాబాద్ ప్రతినిధి, మార్చి 2 (జనం సాక్షి):** జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో (స్థానిక సంస్థలు, రెవెన్యూ) అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె. అనిల్ కుమార్‌లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, తమ పరిధిలో ఉన్నవాటిని సత్వరమే పరిష్కరించాలని, పరిధిలో లేనివాటిని సంబంధిత శాఖలకు పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థలను మండల ప్రత్యేక అధికారులు ప్రతి 15 రోజులకు ఒకసారి లేదా నెలలో మూడు దఫాలుగా తనిఖీ చేయాలని సూచించారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడి మౌలిక వసతులు, విద్యా బోధన, ఆహారం, పారిశుధ్యం వంటి అంశాలపై వివరాలు తెలుసుకొని నివేదిక సమర్పించాలని తెలిపారు. ప్రతి విద్యాసంస్థలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ అంశాలలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్య స్థితిగతులను గమనించాలని సూచించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో టైం టేబుల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించి జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని, పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

గార్ల మండలం బాలాజీ తండా పంచాయతీకి చెందిన భూక్య శాంతి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా సాంకేతిక కారణాలతో బిల్లు రాలేదని పరిష్కారం కోరారు. మరిపెడ మండలానికి చెందిన గోలి మృత్యుంజయ ఇంటి పన్ను ఈ సంవత్సరం అధికంగా వచ్చిందని సమస్య పరిష్కారం కోరారు. మహబూబాబాద్ మండలం డి.ఎస్.ఆర్ జండాల తండ గ్రామస్తులు 5 తండాలకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన పి.సునీత ఇందిరమ్మ ఇండ్ల రెండో దశ బిల్లు మంజూరు చేయాలని కోరారు. బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన వెంకటాద్రి పక్షవాతం కారణంగా వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బయ్యారం మండల కేంద్రాన్ని నియోజకవర్గంగా మార్చాలని నియోజకవర్గ సాధన కమిటీ సభ్యులు దరఖాస్తు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 107 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఆర్డీవో క్రిష్ణవేణి, డిఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జెడ్పి సీఈవో పురుషోత్తం, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిపిఓ హరిప్రసాద్, ఎక్సైజ్ ఎస్పి కిరణ్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి మరియన్న, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## సంఘటన శ్రీజన్ అభియాన్‌లో పాల్గొన్న కరుణాకర్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సంఘటన శ్రీజన్ అభియాన్ ముగింపు కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుల శిక్షణా శిబిరంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి హిల్స్‌లో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల పది రోజుల శిక్షణా శిబిరం మూడో రోజు కార్యక్రమంలో సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ పాల్గొనగా, ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ, బట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి విశ్వనాథన్ పాల్గొన్నారు. ఈ పది రోజుల శిక్షణా శిబిరంలో నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, ఎన్నికల వ్యూహరచన, సోషల్ మీడియా, మీడియా నిర్వహణ, కార్యాచరణ ప్రణాళికలు వంటి కీలక అంశాలపై నిపుణుల ద్వారా సవివరంగా శిక్షణ అందిస్తున్నారు. జిల్లాల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, గ్రామస్థాయి వరకు కాంగ్రెస్ సిద్ధాంతాలను తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించారు.

## 8వ తెలంగాణ కరాటే పోటీలలో శ్రీ నలంద విద్యార్థుల ఘనవిజయం



**తొర్రూరు మార్చి 2 (జనం సాక్షి):** తొరూరు పట్టణంలోని శ్రీ నలంద పాఠశాల విద్యార్థులు ఆదివారం మేడారంలో నిర్వహించిన 8వ తెలంగాణ స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. అండర్–10 బాలుర విభాగంలో ఎం అన్విత్ బ్లాక్ బెల్ట్, కటా విభాగంలో గోల్డ్ మెడల్ ను, బాలికల విభాగంలో అండర్ 13 ఎం లాస్యశ్రీ పర్పుల్ బెల్ట్ విభాగంలో కటా గోల్డ్ మెడల్ ను, అండర్ –9 ఆరెంజ్ బెల్ట్ విభాగంలో కటా కె అశ్విన్ సిల్వర్ మెడల్ ను, అండర్–10 ఆరెంజ్ బెల్ట్ విభాగంలో బి యోజిత్ కటా గోల్డ్ మెడల్ ను, అండర్ 12 కటా విభాగంలో కే.అగస్త్య స్వరుణ్ సిల్వర్ మెడల్ ను, మరియు అండర్ 12 బాలుర విభాగంలో ఎల్లో బెల్ట్ విభాగంలో ఎస్ విరాట్ సిల్వర్ మెడల్ ను సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ పాలడుగుల రవీందర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఏజీఎం పద్మాకర్, జెడిఎసి శివ కోటేశ్వరరావు, అకాడమిక్ డీన్ డి.యాకన్న, సి ఇంచార్జ శ్రీనివాస్, ప్రైమరీ కోఆర్డినేటర్ అశ్విని, ప్రైమరీ ఇన్చార్జ్ పుష్ప, ప్రీ ప్రైమరీ ఇంచార్జ శ్వేతారెడ్డి, కరాటే కోచ్ ఆర్ రాజకుమార్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం
03 మార్చి 2026

# సహజసిద్ధమైన రంగులతో హోళీ సంబరాలు

- ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి
- బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు
- ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- హోళి ప్రశాంతత వాతావరణంలో జరుపుకోవాలి
- ఎస్సై విజయసింహారెడ్డి




**అన్నపురెడ్డిపల్లి, మార్చి 2 (జనం సాక్షి) :** హోళీ పండుగ సందర్భంగా మండల ప్రజలందరికీ ఎస్సై విజయసింహారెడ్డి శుభాకాంక్షలు తెలిపుతూ హోళీ పండుగను సాంప్రదాయబద్ధంగా, పరస్పర గౌరవంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మండల ప్రజలను కోరారు. హోళీ వేడుకల సందర్భంగా సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని, హానికరమైన రసాయనిక రంగులను వాడకూడదని సూచించారు.ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం,నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని హెచ్చరించారు.ప్రార్థనా మందిరాలు, ప్రజా ప్రదేశాలు, రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రధాన కూడళ్లలో మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మండల వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని,చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మండలప్రజలందరూ పరస్పర గౌరవంతో,సురక్షితంగా హోళీ పండుగను జరుపుకొని పోలీసులకు సహకరించాలని ఎస్సై విజయసింహారెడ్డి కోరారు.

## వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయం



**హుజూర్‌నగర్, మార్చి 2 (జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయమని ఆ వార్డ్ కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు అన్నారు. సోమవారం ఈ సందర్భంగా దగ్గుపాటి కవిత బాబురావు మాట్లాడుతూ 14వ వార్డులో ఉన్న సమస్యలని ఒక్కొక్కటిగా పూర్తి చేయుటలో భాగంగా వార్డులోని విద్యుత్ స్తంభాలని పరిశీలించి లైట్లు లేని స్తంభాలకి మున్సిపాలిటీ సిబ్బంది ద్వారా వీధి లైట్లు ఏర్పాటు చేశారు. వార్డులో ఏ సమస్య ఉన్న వార్డు ప్రజలు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. వార్డులో అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో విస్తృత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**మాడుగులపల్లి, మార్చి 2 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో విస్తృత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడ్డాయి. మాడుగులపల్లి టోల్ ప్లాజా వద్ద మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గత 24 గంటలుగా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మిర్యాలగూడ రూరల్ సీఐతో పాటు నలుగురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సమన్వయంతో భారీ వాహనాలు అయిన లారీలు, కంటైనర్లు, ట్రక్కులను లక్ష్యంగా చేసుకుని డ్రైవర్లకు బ్రెతలైజర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 3,150 మంది డ్రైవర్లను తనిఖీ చేయగా, వారిలో 11 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి, వారి వాహనాలను సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు ఈ సందర్భంగా డిఎస్పీ రాజశేఖర్ రాజు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం కోసం జిల్లాలో నిరంతరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. భారీ వాహనాల డ్రైవర్లు దీర్ఘకాల ప్రయాణాలు చేసే సమయంలో మద్యం సేవించడం ప్రమాదాలకు దారితీస్తుందని, ఇది చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో రోడ్డు భద్రత పట్ల పోలీసులు కట్టుబడి ఉన్నారని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## గ్రామీణ ప్రాంత విద్యార్థులకే విజయావకాశాలు ఎక్కువ



**కోదాడ, మార్చి 2 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకే ఉద్యోగ, విజయవాకాశాలు ఎక్కువగా ఉన్నాయని హైదరాబాదులో గచ్చిబౌలి సిఐ జాల ఉపేందర్ రావు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని కె ఆర్ ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో టి ఎస్ కే సి, చరిత్ర విభాగాల ఆధ్వర్యం లో విద్యార్థులకు పోటీ పరీక్షలో విజయం సాధించడం ఎలా..? అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలు విజేతలు కావాలంటే అకాడమీ పుస్తకాలు చదివి సొంతంగా నోట్స్ ను రూపొందించుకోవాలని అన్నారు. పోటీ పరీక్షల్లో విజేతలుగా మారే ప్రతి ఒక్కరికి పుస్తక జ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అవసరం ఎంతైనా ఉందన్నారు. సైన్స్ ఇంజనీరింగ్ వంటి టెక్నాలజీ కోర్సుల కన్నా సామాజిక శాస్త్రాలు చదివిన విద్యార్థులకు గ్రూప్ 1, 2 వంటి ఉద్యోగాల్లో ఎక్కువగా ఫలితాలు సాధిస్తున్నారన్నారు. టెక్నాలజీ పెరిగిన తర్వాత ఆన్లైన్ మోసాలు కూడా పెరుగుతున్నాయని ఈ విషయంలో సెల్ఫోన్ వాడే విద్యార్థులు, యువత జాగ్రత్త వహించాలని కోరారు. యువత జంక్ ఫుడ్ లకు దూరంగా ఇంట్లో తయారు చేసే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. ఉన్నత స్థానానికి ఎదగడానికి విజేతగా మారటానికి నిరంతర సాధన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కే నాగిరెడ్డి, టీ ఎస్ కేసి కో-ఆర్డినేటర్ జి. సైదులు, డాక్టర్ బి సైదిరెడ్డి, డాక్టర్ నిర్మల కుమారి, ఫ్రాన్సిస్, ఎస్ ఎమ్ రఫీ కే సైదులు టి రాజు, సైదమ్మ, సుమ లత, శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ కు పదవ తరగతి ప్రశ్నాపత్రాలు



**నేరేడుచర్ల, మార్చి 2 (జనంసాక్షి) :** ఈ నెల 14 నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ కు పదవ తరగతి ప్రశ్నా పత్రాలను అధికారులు కట్టుదిట్టమైన భద్రతా నడుమన తీసుకువచ్చారు.ఈ సందర్భంగా నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీవాణి, ప్రగతి, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలకు సంబంధించి ప్యాక్ చేసిన ప్రశ్న పత్రాలను పరిశీలించి, పోలీసుల ఆధ్వర్యంలో ప్రశ్న పత్రాలను ట్రంక్ పెట్టెలలో పోలీస్ స్టేషన్ లాకర్లలో భద్రపరిచారు.అనంతరం కస్టోడియన్ , చీఫ్ సూపర్డెంట్ బట్టు మధు, మాట్లాడుతూ ఈ నెల 14 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్ష ప్రశ్న పత్రాలను జాగ్రత్తగా భద్రపరిచామన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రతతో పదవ తరగతి పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కస్టోడియన్, చీఫ్ సూపరిండెంట్ బట్టు మధు,పిచ్చయ, చీఫ్ సూపర్డెంట్ యం.నాగమణి, కె. వెంకటేశ్వర్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్ రషీద్ ఖాన్, వెంకటేశ్వర్లు,రూట్ ఆఫీసర్ ఛత్రు నాయక్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 2 (జనంసాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు.వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న పిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ద పెట్టి పరిష్కరించాలని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.భూ సమస్యలకు సంబందించి 25 దరఖాస్తులు,జిల్లా పంచాయతీ అధికారి 7, డిడబ్ల్యూఏ 7, వైద్య ఆరోగ్య శాఖ అధికారి 6, వివిధ శాఖలకి సంబంధించి 38, మొత్తం 83 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, ఇన్చార్జి సీఈఓ శిరీష, ఆర్డీవో వేణుమాధవ్ రావు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సీతారాం నాయక్, డిఈఓ అశోక్, సంక్షేమ అధికారులు నర్సింహరావు,కె.దయానంద రాణి, నరసింహ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన పోచంపల్లి మున్సిపల్ పాలకవర్గం



**భూదాన్ పోచంపల్లి, మార్చి 2 (జనం సాక్షి) :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలను భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మున్సిపల్ పాలకవర్గాన్ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోచంపల్లి నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు అదనపు బస్సులు నడపాలని ఎంపీని కోరగా, ఆయన వెంటనే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి తో ఫోన్‌లో మాట్లాడి రెండు అదనపు బస్సులు నడపాలని కోరినట్లు తెలిపారు. దీనికి సానుకూల స్పందన లభించినట్లు చెప్పారు. అలాగే పారిశ్రామిక ప్రాంతం కావడంతో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని, పర్యాటకుల సౌకర్యార్థం పర్యాటక శాఖ ద్వారా ప్రత్యేక బస్సులు నడపాలని కూడా ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి చేసినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు కొండమడుగు ఎల్ల స్వామి, శ్రీరామ్ మంజుల లింగస్వామి యాదవ్, జినుకల లావణ్య యాదగిరి, దేవరాయ కుమార్, రావుల జంగయ్య, పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్, నాయకులు గునిగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల పేర్లు వెంటనే ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా



**భువనగిరి, మార్చి 2 (జనంసాక్షి) :** సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల కై పరిష్కారానికి కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది అందరిని రెండవ పిఆర్సి పరిధిలోకి తీసుకోవాలని గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఆన్లైన్లో లేని కార్మికుల పేర్లు వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా జీవో నెంబర్ 51 సవరణ మల్టీపర్పస్ విధానం రద్దు కొరకు తీర్మానం చేయాలని కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని నూతనంగా ఎన్నికైన సర్పంచుల వేధింపులు కార్మికుల తొలగింపు పైన చర్యలు చేపట్టాలని మూడు నెలల బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని గ్రామపంచా సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ప్రమాదం జరిగిన మరణించిన సిబ్బంది కుటుంబానికి 20 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని పీఆ ర్సీ సౌకర్యం భీమా గ్రాండ్ సౌకర్యాలు కల్పించాలని గ్రామపంచా సిబ్బంది అందరికీ రిటర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు కనీసం 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేష్, గ్రామపంచాయతీ గౌరవ అధ్యక్షులు దాసరి పాండు, సిఐటియు ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పొట్ట యాదమ్మ, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరికంటి రాము, నాయకులు కూరెళ్ల కిష్టయ్య నాంపల్లి భాస్కర్, బందెల భిక్షం, స్వామి, రమేష్, చంద్రకాంత్, స్వామి గౌడ్, గుంతకండ్ల అనిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత లేకుండా చూడాలి



**నూతనకల్, మార్చి 2 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూడాలని తహసీల్దార్ పి శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత అన్నారు పంచాయతీ సెక్రటరీలు మరియు జిపిఓ లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడడం జరిగింది ఇందిరమ్మ ఇంటి నిర్మాణమునకు ఇసుక కొరత లేకుండా వారికి అందించుటకుగాను 'మన ఇసుక 'వాహనము ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకొనుటకు మరియు ఇసుక కావలసిన లబ్ధిదారులను గుర్తించి ఆన్లైన్లో నమోదు చేయుటకు జిపిఓ మరియు పంచాయతీ సెక్రటరీలు సహకరించగలరని ఆదేశించడం జరిగింది. ఓటర్ లిస్టులో సరిగా ఫోటోలు లేనివారిని గుర్తించి వారికి తెలియజేసి మ్యాపింగ్ ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని బిఎల్ వోల కు సూచించారు ఈకార్యక్రమంలో ఎంపీడీవో సునీత,ఆర్ఐ హాసన్ అలీ, ఎంపీఓ శశికళ, జిపిఓ లు పంచాయతీ కార్యదర్శులు, బిఎల్ వోలు తదితరులు పాల్గొన్నారు

## గోల్డెన్ నంది అవార్డు అందుకున్న యోగా గురువు చాడ పాపిరెడ్డి




**సూర్యాపేట, మార్చి 2 (జనంసాక్షి) :** మెగా హెల్పింగ్ ఫౌండేషన్ మెగా ఈవెంట్స్ వారు ఉగాది పండుగను పురస్కరించుకొని హైదరాబాదులోని బిర్లా ప్లానుటోరియంలో అవార్డుల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు.సూర్యాపేట నుండి సూర్యాపేట ఉన్నత యోగా మండలి గురువు చాడ పాపి రెడ్డిని ఉత్తమ యోగా గురువుగా ఎంపిక చేసి గోల్డెన్ నంది అవార్డును మెగా హెల్పింగ్ ఫౌండేషన్, మెగా ఈవెంట్స్ ఎండీ ఆర్గనైజర్ శిరీష రెడ్డి, మాజీ మంత్రి ప్రముఖ సినీ నటులు బాబు మోహన్, అంబికా కృష్ణ ,మాజీ మంత్రి వేణుగోపాల చారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా యోగా గురువు పాపిరెడ్డిని తెలంగాణ యోగ ప్రచార సమితి అధ్యక్షులు ప్రసాద్ తో పాటు పలువురు అభినందించారు.

## కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాల్లో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి




**ఖమ్మం రూరల్, మార్చి 2 (జనం సాక్షి) :** కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనల అనంతరం పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. వేడుకల్లో కార్డినల్ పూల అంతోని, ఖమ్మం మతపీఠాధిపతి సగిలి ప్రకాష్ లను ఎంపీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవ మతానికి ప్రపంచవ్యాప్తంగా విశిష్ట స్థానం ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి చిన్న స్వతంత్ర దేశమైన వాటికన్ సిటీ క్రైస్తవ మతానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందన్నారు. ప్రపంచ కాథలిక్ విశ్వాసులను ఏకతాటిపైకి తెచ్చే కేంద్రంగా వాటికన్ నిలుస్తోందని, శాంతి, ప్రేమ, సేవా భావాలే క్రైస్తవ మత ప్రధాన సందేశమని వివరించారు. కరుణగిరి పుణ్యక్షేత్రం కూడా ఆ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతిబింబంగా జిల్లాలో విశ్వాసులను ఆకర్షిస్తోందని ఎంపీ అన్నారు. మన తెలుగు వ్యక్తి పూల అంతోనీకి కార్డినల్ గా అవకాశం రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ఆయనను సత్కరించారు. అనంతరం క్రైస్తవ మత పెద్దలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ చైర్మన్ హరినాధ బాబు, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఇమామ్ భాయ్, రంజిత్ నాయక్, కౌన్సిలర్లు ఏనుగు స్వర్ణ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## 10 లక్షల 50 వేలు విలువ గల గంజాయి పట్టివేత



**చంద్రుగొండ, మార్చి 2 (జనం సాక్షి) :** చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో సమాచారం మేరకు చంద్రుగొండ పోలీసులు సిసిఎస్ పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తూ అనుమానాస్పదంగా కనపడడంతో తనిఖీ చేయగా వారి దగ్గర మూడు బ్యాగుల్లో మొత్తం పది గంజాయి ప్యాకెట్లు సుమారు 21 కేజీల 150 గ్రాములు ఉన్నట్లుగా కొత్తగూడెం డిఎస్పి ఎల్ ఆదినారాయణ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. పట్టుబడిన వారు ఒడిస్సా రాష్ట్రం చెందినవారుగా గుర్తించి గంజాయిని భద్రాచలం కొత్తగూడెం చంద్రుగొండ విజయవాడ మార్గం ద్వారా చెన్నైకి విక్రయించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నట్లుగా తెలిపారు. 2025 జనవరి నుండి సుమారుగా 85 కేసుల్లో 33 కోట్ల 55 లక్షల రూపాయల గంజాయి పట్టివేత : డీఎస్పీ ఎల్ ఆదినారాయణ 2025 జనవరి నుండి ఇప్పటివరకు సుమారుగా 85 కేసులో 33 కోట్ల 55 లక్షల రూపాయలు విలువ చేసే 6739 కిలోల గంజాయిని జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని కొత్తగూడెం డిఎస్పి ఎల్ ఆదినారాయణ తెలియజేశారు. అదేవిధంగా గంజాయి కేసులతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తులపై పిడి యాక్ట్స్ నమోదు చేసి జైలుకు తరలించడం జరిగిందన్నారు. గంజాయి పట్టుకోవడంలో కృషిచేసిన కొత్తగూడెం సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్ఐలు ప్రవీణ్, రామారావు చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ,సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజ్, డిఎస్పి ఎల్ ఆదినారాయణలు ఈ సందర్భంగా అభినందించారు.

# విపణి

# మార్కెట్లను ముంచిన యుద్ధం

## ఫిబ్రవరిలో వాహన విలాసమే

### మారుతీ, టాటా మోటార్స్, మహీంద్రా విక్రయాల్లో వృద్ధి



**న్యూఢిల్లీ:**దేశీయ విపణిలో స్థిరమైన గిరాకీ లభిస్తున్నందున.. ఫిబ్రవరిలో అగ్రగామి వాహన కంపెనీలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా తమ టోకు విక్రయాల్లో వృద్ధి నమోదుచేశాయి. దిగ్గజ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా దేశీయ విపణిలో 1,61, 000 వాహనాలు విక్రయించింది. 2025 ఇదే నెలలో ఇవి 1,60,791గా ఉన్నాయి. మారుతీ చిన్న కార్ల విక్రయాలు స్వల్పంగా పెరిగి 10,238కు చేరాయి. కాంపాక్ట్ కార్ల విక్రయాలు 72,942 నుంచి 66,286కు తగ్గాయి. యుటిలిటీ వాహన విక్రయాలు 65,033 నుంచి 72,756కు పెరిగాయి. నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు, ఉత్పత్తి పెంచుతున్నామని మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్, అమ్మకాలు) పార్థో బెనర్జీ తెలిపారు. గత నెలలో రికార్డు స్థాయిలో మొత్తం 2.14 లక్షల విక్రయాలు (ఎగుమతులు కలిపి) నమోదుచేశామని అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలను గమనిస్తున్నామని, ఈ ప్రాంతానికి పెద్దగా కంపెనీ ఎగుమతులు లేవని మారుతీ ఎగ్జిక్యూటివ్ (కార్పొరేట్ అఫైర్స్) రాహుల్ భర్తీ తెలిపారు. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ దేశీయ విపణికి 62,329 వాహనాలను సరఫరా చేసింది. 2025 ఫిబ్రవరిలో సరఫరా చేసిన 46,435 వాహనాలతో పోలిస్తే ఇవి 34% అధికం. మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయ ప్రయాణికుల వాహన సరఫరాలు 50,420 నుంచి 19% పెరిగి 60,018కు చేరాయి. హ్యుందాయ్ మోటార్ టోకు విక్రయాలు 10% పెరిగి 52,407కు చేరాయి. టయోటా దేశీయ సరఫరాలు 16% పెరిగి 30,737గా నమోదయ్యాయి. కియా ఇండియా విక్రయాలు 25,026 నుంచి 27,610కు చేరాయి. ద్విచక్ర వాహన విభాగంలో హీరో మోటోకార్ప్ విక్రయాలు 3,57,296 నుంచి 45% వృద్ధితో 5,16,968కు పెరిగాయి.

## మహీంద్రా ఎక్స్ఈవీ 9ఇ సినీలక్స్..

ఫీచర్లివీ!



**ముంబై:**మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ, విద్యుత్తు ఎస్‌యూవీ ఎక్స్ఈవీ 9ఇ సినీలక్స్ ఎడిషన్‌ను ఆదివారం ఆవిష్కరించింది. ఈ కారు ధర రూ.29.35 లక్షలు (ఎక్స్‌షోరూం) అని ప్రకటించింది. సోమవారం (ఈనెల 2) నుంచి బుకింగులు ప్రారంభిస్తున్నామని, కారు డెలివరీలు ఈనెల 10 నుంచి చేపడతామని సంస్థ తెలిపింది. విలాసవంత - అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, సదుపాయాలతో రూపొందించిన ఈ కారులో ప్రీమియం ఇంటీరియర్స్ అమర్చినట్లు సంస్థ వివరించింది. డాల్బీ అట్మోస్‌తో కూడిన 16 స్పీకర్ల హార్మన్ కార్డన్ ఆడియో సిస్టమ్, హ్యాండ్స్ ఫ్రీ పార్క్ అసిస్టెంట్, సెక్యూర్ 360 సేఫ్టీ సూట్ వంటి సదుపాయాలు ఈ కారులో ఉన్నాయి. 79 కిలోవాట్‌అవర్ బ్యాటరీ వల్ల ఒక ఛార్జింగుతో 500 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ వెల్లడించింది.

## భారీ నష్టాల్లో సూచీలు

**ముంబయి:**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు, తదనంతర పరిణామాలు దేశీయ స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, చమురు ధరల పెరుగుదలతో సూచీలు దారుణంగా పతనమయ్యాయి. సెన్సెక్స్ దాదాపు 1000 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 300 పా యింట్ల మేర కుంగింది. ఉదయం 9.25 గంటల సమయంలో సెన్సెక్స్ 1,048.48 పాయింట్లు దిగజారి 80,238.71 వద్ద, నిఫ్టీ 307.35 పాయింట్లు పతనమై 24,871.30 వద్ద కొనసాగుతున్నాయి. రూపాయి విలువ భారీగా క్షీణించింది. నేటి సెషన్‌లో 24 పైసలు తగ్గి 91.32గా ట్రేడ్ అవుతోంది. ట్రేడింగ్ ఆరంభంలో సెన్సెక్స్ దాదాపు 2,700 పాయింట్లు, నిఫ్టీ 530 పాయింట్లు కుంగడంతో ఇన్వెస్టర్లు ఆందోళన చెందారు. సుమారు రూ.8లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. ప్రస్తుతం మార్కెట్లు కాస్త కోలుకున్నప్పటికీ.. నష్టాలు కొనసాగుతున్నాయి.



ఇరాన్-అమెరికా యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమన్నాయి. ముడి చమురు ధర 80 డాలర్ల పైనే ట్రేడ్ అవుతోంది. ఆ ప్రభావంతో దేశీయంగా చమురు రంగ షేర్లు కుదేలయ్యాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 5శాతం మేర కుంగింది. మారుతి సుజుకీ, ఏషియన్ పెయింట్స్ వంటి షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. క్రితం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.7536 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. ఇది కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపించింది.

## గెయిల్ ఛైర్మన్‌గా దీపక్ గుప్తా బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ:**దేశీయ అతిపెద్ద గ్యాస్ సరఫరా సంస్థ గెయిల్ ఇండియా, ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టరుగా దీపక్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు. 2029 ఫిబ్రవరి 28 వరకు ఈయన ఈ పదవిలో ఉంటారు. సందీప్ కుమార్ గుప్తా పదవీ విరమణతో, దీపక్ బాధ్యతలు చేపట్టారు. మెకానికల్ ఇంజినీర్ అయిన గుప్తా, గెయిల్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

## పసిడి, వెండి పెరుగుతాయ్

పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం కమాండర్ ఖమేనీ సహా పలువురు ముఖ్యనేతలు హతమవ్వడం, ఇరాన్ ప్రతిదాడుల నేపథ్యంలో.. అంతర్జాతీయ ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. రూ.1,61,971 వద్ద ముగిసిన ఈ కాంట్రాక్టు తాజా పరిణామాల్లో మరో 11-14% పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. మంగళవారం హోలీ కావడంతో సాయంత్రం నుంచే ట్రేడింగ్ ఉంటుంది. వెండి మార్చి కాంట్రాక్టు రూ.2,73,389 వద్ద ఉంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు కొనసాగితే ఈవారం ధర మరో 10-16% పెరగొచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రాథమిక లోహాలు

రాగి మార్చి కాంట్రాక్టు రూ.1,171 కంటే కిందకు రాకుంటే సానుకూల ధోరణి కొనసాగొచ్చు. ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే. సీసం మార్చి కాంట్రాక్టు రూ.186.55 కంటే దిగువన ట్రేడయితే రూ.184.50 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.190.65 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.191.65; రూ.193.15 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.



జింక్ మార్చి కాంట్రాక్టు రూ.317 కంటే దిగువన ట్రేడ్‌కాకుంటే, లాంగ్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు. ధర తగ్గినప్పుడల్లా మరిన్ని లాంగ్ పొజిషన్లను జత చేసుకోవడమూ మంచి వ్యూహమే అవుతుంది. అల్యూమినియం మార్చి కాంట్రాక్టు రూ.303.45 కంటే కిందకు వస్తే, రూ.297.65; రూ.291.25 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. ఒకవేళ రూ.315.65 కంటే పైకి వెళితే రూ.322.05- 327.85 వరకు పెరగొచ్చు.

ఇంధన రంగం

ముడి చమురు మార్చి కాంట్రాక్టు రూ.5,897 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే.. లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. ఇరాన్‌లో యుద్ధం వల్ల, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతాయి. అంతర్జాతీయ భౌగోళిక - రాజకీయ పరిణామాలను ట్రేడర్లు ఎప్పటికప్పుడు గమనిస్తూ ట్రేడ్ చేయడం మంచిది.

సహజవాయువు మార్చి కాంట్రాక్టు ప్రతికూల ధోరణిలోనే కనిపిస్తోంది. రూ.267.85 కంటే పైన ట్రేడ్ కాకుంటే, రూ.231 వరకు పడిపోయే అవకాశం ఉంది.

## స్పామ్ మెసేజ్‌లు అరికట్టేందుకు ఎయిర్‌టెల్, గూగుల్ భాగస్వామ్యం

**న్యూఢిల్లీ:**సంక్షిప్త సందేశాల (ఎస్ఎంఎస్)లో స్పామ్‌ను అరికట్టేందు కు ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత స్పామ్ ప్రొటెక్షన్ టూల్‌ను భారతీ ఎయిర్‌టెల్ వినియోగించనుంది. గూగుల్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా వచ్చే వెబ్ లింక్‌లను కూడా పరిశీలించేందుకు ఇది ఉపయోగ పడనుంది. విని యోగదారులు డిజిటల్ మోసాల బారిన పడకుండా చూసేం దుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఇరు సంస్థలూ ప్రకటిం చాయి. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్‌కు గూగుల్‌కు చెందిన రిచ్ కమ్యూనికేషన్స్ సర్వీసెస్ (ఆర్‌సీఎస్) జత కలవడం వల్ల మోసపూరిత సందేశాలను అడ్డుకోవడమే కాక, అధిక నాణ్యత గల ఫోటోలు/వీడియోలు, ఇంటరాక్టివ్ మెసేజ్‌లను వినియోగదారులు అందుకోగలరని తెలిపాయి. గత ఏడాదిన్నర వ్యవధిలో 7,100 కోట్ల మోసపూరిత కాల్స్, 290 కోట్ల మోసపూరిత సందేశాలను అడ్డుకోగలిగినట్లు ఎయిర్‌టెల్ తెలిపింది.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.15
వరంగల్ ₹ 5.17

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,54,650 (22 క్యారెట్లు)
₹ 1,68,710 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 3,20,000

# హార్ముజ్ మూసివేతతో కష్టమే

- భారత్‌కు చమురు ముప్పు ఎంత?
- ధరలు భగ్గుమనే ప్రమాదం
- రవాణా, బీమా ఖర్చులూ అధికమవుతాయ్

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ మెరుపు దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణించడంతో, ఈ ప్రాంతంలో యుద్ధం తీవ్రమైంది. వెనెజువెలా అధ్యక్షుణ్ని అమెరికా బందీగా పట్టుకెళ్లినా, పరిస్థితులు విషమించలేదు. అయితే ఇరాన్ పరిస్థితి అందుకు భిన్నమని.. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, దేశ ప్రజలు కూడా భిన్నంగా స్పందించే అవకాశం ఉందని జీటీఆర్ఐ అంచనా వేస్తోంది. తాజా పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు విఘాతం కలిగించి, ధరలు పెరిగితే, మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. చమురు, సహజవాయువు రవాణాకు అత్యంత కీలకమైన 33 కిలోమీటర్ల పొడవైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తోంది. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20%, మనదేశానికి 35-50% ఈ మార్గంలోనే జరుగుతోంది. ఈ మార్గాన్ని మూసివేస్తే, చమురు రవాణా నౌకలు అధిక దూరం ప్రయాణించాల్సి వస్తుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా వ్యయాలూ భారీగా పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుతం బ్యారెల్ ముడిచమురు ధర 70-73 డాలర్ల వద్ద ఉండగా, ఈ ఉద్రిక్తతల వల్ల 90- 100 డాలర్ల స్థాయిని మించొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి వచ్చే చమురు రవాణా నిలిచిపోయే అవకాశం ఉంటుంది. మనదేశ చమురు అవసరాల్లో 85% దిగుమతులే తీరుస్తున్నాయి. ధరలు పెరిగి, డాలర్లలో చెల్లించాల్సి వస్తే.. మన కరెంట్ ఖాతా లోటు అధికమవుతుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనం కావచ్చు. దేశీయంగా రవాణా వ్యయాలు అధికమై, ధరలు పెరగొచ్చు. మనదేశం రష్యా, అమెరికా, పశ్చిమ ఆఫ్రికా నుంచి చమురు దిగుమతి పెంచుకోవాల్సి ఉంటుంది. ఇది కూడా ఖర్చు-రవాణా సమయాన్ని పెంచే అంశమే. స్వల్పకాలంలో ముడిచమురు బ్యారెల్ ధర 90 డాలర్లను మించితే.. చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి ఆసియా దేశాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇరాన్‌పై పాశ్చాత్య దేశాల ఆంక్షల కారణంగా, ఇప్పటికే ఆ దేశంతో మన ద్వైపాక్షిక వాణిజ్యం పరిమితంగా ఉంది. 2025లో ఇరాన్‌కు మన దేశం నుంచి 1.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.10,800 కోట్లు) ఎగుమతులు వెళ్లాయి. ఇందులో ప్రధానంగా బియ్యం (747 మి.డా/రూ.6,700 కోట్లు), అరటిపండ్లు, టీ ఉన్నాయి. అక్కడ నుంచి దిగుమతులు 408.6 మిలియన్ డాలర్లు (సుమారు రూ.3,700 కోట్లు)గా ఉన్నాయి. ఆ దేశం నుంచి పెట్రోలియం కోక్, యాపిల్స్, ఖర్జూరం ఎక్కువగా వస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వాణిజ్యంలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.



## పాకిస్థాన్ నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై అఫ్గానిస్థాన్ డ్రోన్ దాడి

ఇస్లామాబాద్(జనంసాక్షి):పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. సరిహద్దుల్లో ఇరుదేశాల మధ్య భీకర దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున తమ వైమానిక దళం పాక్‌లోని కీలక సైనిక స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించినట్లు అఫ్గాన్ రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. రావల్పిండిలోని పాక్ ఆర్మీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ (ఔబీతీ ఐష్ట్రజీని ంతితీఎజీబవ)పై భారీ దాడులు చేపట్టినట్లు తెలిపింది. క్వెట్టాలోని 12వ కార్ప్స్ ప్రధాన కార్యాలయం, ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పలు కీలకమైన పాక్ సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. తమ దేశంలోని వివిధ ప్రాంతాలపై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడిందని.. పాక్ చొరబాట్లకు ప్రతీకారం తీర్చుకొనేందుకే ఈ దాడులు చేశామని అఫ్గాన్ తెలిపింది. తమ దాడుల్లో నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సహా ఇతర సైనిక స్థావరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొంది. మరోవైపు తూర్పు అఫ్గాన్ నగరమైన జలాలాబాద్‌లో పాకిస్థాన్ యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు తాలిబన్ అధికారులు వెల్లడించారు. విమాన పైలట్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

## ఒక డాలర్ పెరిగితే భారత్‌పై పెనుభారం

పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. అంతర్జాతీయ చమురు రవాణాకు కీలకమైన హర్ముజ్ జలసంధిలో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకోవడంతో ధరలు 10 శాతం మేర పెరిగాయి. సోమవారం మార్కెట్లు ప్రారంభమైన సమయంలో ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్ఛేంజీలో బ్రెంట్ క్రూడ్ ఏప్రిల్ కాంట్రాక్ట్ ఒక బ్యారెల్‌కు 10 శాతం పెరిగి 81.87 డాలర్ల గరిష్ఠానికి చేరింది. ఫ్యూచర్స్‌లో బ్రెంట్ క్రూడ్ 13 శాతం పెరిగి 82.37 డాలర్లకు పెరిగింది. 2025 జనవరి తర్వాత ఇదే అత్యధికస్థాయి. ఆదివారం కూడా ఇజ్రాయెల్ దాడులు చేయడంతో ఇరాన్ భారీగా క్షిపణులు ప్రయోగించింది గల్ఫ్ తీరంలో మూడు చమురు ట్యాంకర్లను దెబ్బతీశామని ఇరాన్ అధికారులు వెల్లడించారు. దీంతో చమురు రవాణా నిలిచిపోతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒమన్-ఇరాన్ మధ్య ఇరుకుగా ఉండే సముద్ర మార్గమే హర్ముజ్ జల సంధి. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు ఈ మార్గంలోనే ప్రపంచం వినియోగిస్తోన్న చమురులో 20 శాతం దిగుమతి అవుతోంది. ప్రపంచ దేశాలు వినియోగించే ఎల్ఎన్‌జీ (ద్రవరూప సహజ వాయువు)లోనూ 20% ఇక్కడినుంచే సరఫరా జరుగుతోంది. ఇదిలాఉంటే.. భౌగోళిక - రాజకీయ ఒడుదొడుకులు ఎదురైనప్పుడు భారత ఇంధన అవసరాలను తీర్చడానికి దేశంలోని వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు 74 రోజుల పాటు సరిపోతాయని గతంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించిన సంగతి తెలిసిందే.. ప్రపంచంలో అతిపెద్ద చమురు కొనుగోలుదారుల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. రోజుకు 5.5 మిలియన్ల బ్యారెళ్ల మేర వినియోగిస్తోంది. అందులో 1.5-2 మిలియన్ల మేర ఈ జలసంధి నుంచే సరఫరా అవుతోంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు తగ్గించడంతో ఇప్పుడు పశ్చిమాసియా ప్రత్యామ్నాయంగా మారింది. బ్రెంట్ క్రూడ్ ధర ఒక డాలర్ పెరిగినా.. ఒక ఏడాదికి ప్రభుత్వం రూ.13వేల కోట్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది 160 బిలియన్ డాలర్ల మేర చమురును భారత్ దిగుమతి చేసుకుంది

హైఫా పోర్ట్ సురక్షితం: అదానీ గ్రూప్

ఇజ్రాయెల్‌లోని తమ హైఫా పోర్ట్ పూర్తిగా సురక్షితంగా ఉందని, కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అదానీ గ్రూప్ ఆదివారం ప్రకటించింది. ఉద్యోగులందరూ సురక్షితంగా ఉన్నారని, పోర్ట్ ఆస్తులు, మౌలిక సదుపాయాలు భద్రంగా ఉన్నాయని అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ తెలిపింది. అయితే ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు ఏవైనా పోర్టును తాకాయా లేదా అనే విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. తాజా పరిస్థితిని పోర్ట్ అథారిటీ నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఇజ్రాయెల్ రవాణా శాఖతో కలిసి పనిచేస్తున్నామని, వారి ఆదేశాల ప్రకారమే కార్యకలాపాలు సాగుతున్నాయని స్పష్టం చేసింది.

సీఐఎఫ్ ఒప్పందాలపై జాగ్రత్త: ఐఆర్ఈఎఫ్

హార్ముజ్ జలసంధి ద్వారా రవాణాపై ఆంక్షలు విధించినందున.. ఇరాన్, గల్ఫ్ దేశాలకు కొత్త 'కాస్ట్, ఇన్సూరెన్స్, ఫ్రైట్' (సీఐఎఫ్) ఒప్పందాలు చేసుకోవద్దని ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ (ఐఆర్ఈఎఫ్) తమ సభ్యులకు సూచించింది. సీఐఎఫ్ ఒప్పందం ప్రకారం.. సరకును జలమార్గం ద్వారా రవాణా చేసేటపుడు దానికి అయ్యే ఖర్చులు, బీమా, రవాణా రుసుములను విక్రేత భరించాల్సి ఉంటుంది. సాధ్యమైనంత వరకు విక్రయాలను ఫ్రీ ఆన్ బోర్డ్ నిబంధనలపై పూర్తి చేయాలని సభ్యులను ఐఆర్ఈఎఫ్ కోరింది. దీని వల్ల రవాణా, బీమా, ఇతర ముప్పులు అంతర్జాతీయ కొనుగోలుదారుపైనే ఉంటాయి.

జీసీసీతో ఎఫ్‌టీఏ ఆలస్యం కావచ్చు

ఆరు దేశాల గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ- సౌదీఅరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, ఒమన్, బహ్రెయిన్)తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా ఆలస్యం కావచ్చు. ఈ దేశాల్లో మనదేశీయులు కోటి మంది జీవనం సాగిస్తున్నారు. 2024-25లో జీసీసీకి మన ఎగుమతులు 57 బి.డా. (సుమారు రూ.5.13 లక్షల కోట్లు) ఉండగా, దిగుమతులు 121.7 బి.డా. (రూ.10.95 లక్షల కోట్లు)గా ఉన్నాయి.

### మన దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయా?

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. మన దేశానికి సరఫరా అయ్యే చమురులో దాదాపు సగం మేర అంతరాయం కలిగే ప్రమాదం ఉంది. అయితే ఇరాన్- అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం దీర్ఘకాలం కొనసాగినా, మన వద్ద తగినన్ని చమురు నిల్వలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు, వాణిజ్య నిల్వలు, రష్యా దిగుమతుల ద్వారా సరఫరాలో సమతుల్యత నిర్వహించొచ్చని కెప్లర్ విశ్లేషకుడు సుమిత్ రిటోలియా వెల్లడించారు. కెప్లర్ గణాంకాల ప్రకారం.. మన దేశం దగ్గర వాణిజ్య ముడిచమురు నిల్వలు దాదాపు 100 మిలియన్ బ్యారెళ్లు ఉన్నాయి. ఇందుకు అదనంగా మంగళూరు, పడూర్, విశాఖపట్నం ప్రాంతాల్లోని వ్యూహాత్మక నిల్వ కేంద్రాల్లో దాదాపు 39 మి.బ్యారెళ్లు ఉంది. హార్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సగటున 2.5 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి అవుతోంది. మన దేశ మొత్తం దిగుమతుల్లో ఇది 50 శాతానికి సమానం. ఈ సరఫరా నిలిచినా, మన నిల్వలు దాదాపు 60 రోజుల దిగుమతులకు సరిపోతాయి. అదనంగా చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద ఉన్న రిఫైన్డ్ ప్రోడక్ట్ నిల్వలు, ఈ సామర్థ్యాన్ని మరింత పెంచుతాయన్నారు.



## 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో అత్యాధునిక ఆయుధాలు

**వాషింగ్టన్:**ఇరాన్‌పై అమెరికా చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో అమెరికా ఇప్పటివరకు ఇజ్రాయెల్‌తో కలిసి 2000కు పైగా టార్గెట్లను ధ్వంసం చేసింది. వీటిల్లో అలీ ఖమేనీ కాంపౌండ్, ఐఆర్‌జీసీ ప్రధాన కార్యాలయం కూడా ఉన్నాయి. 47 ఏళ్లలో 1000 మంది అమెరికన్ల మరణానికి కారణమైన ఐఆర్‌జీసీని దెబ్బతీశామని అమెరికా సెంట్‌కామ్ ఎక్స్ వేదికగా పేర్కొంది. ఇప్పుడు ఐఆర్‌జీసీకి ప్రధాన కార్యాలయం కూడా లేదని ఎద్దేవా చేసింది.

సెంట్‌కామ్ ఏం చెప్పిందంటే..

ఇరాన్‌పై దాడులకు ఉపయోగించిన ఆయుధాలను, తమ టార్గెట్లను కూడా అమెరికా సెంట్రల్ కమాండ్ బహిర్గతం చేసింది. బి-2 స్టెల్త్ బాంబర్లు, లూకస్ డ్రోన్లు, పేట్రియాట్ క్షిపణులు, థాడ్ యాంటీ బాలిస్టిక్ మిసైల్ సిస్టమ్, ఎఫ్-18, ఎఫ్-16, ఎఫ్-22 ఫైటర్ జెట్లు, ఎ-10 అటాక్ జెట్స్, ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్స్, ఈఏ-18జీ ఎలక్ట్రానిక్ అటాక్ ఎయిర్ క్రాఫ్ట్, అవాక్స్ విమానం, ఎయిర్‌బార్న్ కమ్యూనికేషన్ రిలే, పి-8 మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, ఆర్సీ-135 నిఘా విమానం, ఎంక్యూ-9 రీపర్స్, ఎం-142 హైమొబిలిటీ రాకెట్ వ్యవస్థ, అణుశక్తి విమాన వాహక నౌక, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లు, కౌంటర్ డ్రోన్ వ్యవస్థలు, రీఫ్యూయలింగ్ విమానాలు, రీఫ్యూయలింగ్ షిప్‌లు, సి-17 గ్లోబ్ మాస్టర్ కార్గో విమానం, సి-130 కార్గో విమానం వాడినట్లు సెంట్‌కామ్ వెల్లడించింది.

డియాగోగార్సియా బేస్ వినియోగానికి యూకే అనుమతి..

అమెరికా ఈ దాడిలో బి-2 స్టెల్త్ బాంబర్లను వినియోగించింది. ఇవి వైట్‌మన్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచి బయల్దేరి దాడుల అనంతరం టెక్సాస్‌లోని డయిస్ ఎయిర్ బేస్‌కు చేరుకొన్నాయి. ఇక ఇరాన్ సైప్రస్‌లోని తమ స్థావరంపై దాడి చేయడంతో బ్రిటన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ సమీపంలో ఉన్న తమ స్థావరం డియాగోగార్సియాను వాడుకొనేందుకు అమెరికాకు తాత్కాలికంగా అనుమతులు ఇచ్చింది. ఇరాన్ క్షిపణి దాడులను నిలువరించేందుకు దీనిని వాడుకోనిస్తున్నట్లు వెల్లడించింది. అమెరికా బి-2 స్టెల్త్ బాంబర్లు ప్రయాణించేందుకు అనువైన రన్‌వే ఇక్కడ ఉంది.

## పరిస్థితులు చేజారిపోయే ముప్పు

### చర్చలతోనే వివాదాలను పరిష్కరించుకోవాలి

### పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ప్రపంచ నేతల పిలుపు

**బ్రస్సెల్స్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనడంతో ప్రపంచవ్యాప్తంగా పలువురు నేతలు స్పందించారు. చర్చల ద్వారానే వివాదాలను పరిష్కరించుకోవాలని.. ప్రాంతీయంగా శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటన్, సౌదీ అరేబియా తదితర దేశాలు ఇరాన్ దాడులను ఖండించాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల సైనిక చర్య మొదలైన కొన్ని గంటల్లోనే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ) అత్యవసరంగా సమావేశమై.. ఉద్రిక్తతల తగ్గింపునకు పిలుపునిచ్చింది. ఇరాన్‌పై సైనిక చర్య వల్ల పరిస్థితులు చేజారిపోయే ప్రమాదముంది. అంతర్జాతీయ శాంతిభద్రతలకు ప్రస్తుత పరిణామాలు తీవ్ర ముప్పు తెస్తాయి. ప్రపంచానికి ఇప్పుడు యుద్ధ విరమణ అవసరం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు వెంటనే తగ్గాలని ఆంటోనియో గుటెరస్ పిలుపునిచ్చారు

# ఆర్టీసి బస్టాండ్‌లో నీటి సౌకర్యం లేక ప్రయాణికుల ఇబ్బందులు

- బస్టాండ్ వెనుకలో మూత్రాలు పోయడంతో బస్టాండ్‌లో ఉండలేని ప్రయాణికులు
- దుర్గంధంతో ప్రయాణికులు అనారోగ్యానికి గురి
- మహిళలు, విద్యార్థినిలు మూత్రశాలలు లేక అవస్థలు





**ఎల్లారెడ్డిపేట, మార్చి 02, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆర్టీసి ప్రయాణ ప్రాంగణంలో నీటి సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులకు ఎదురవుతున్నారు. నీటి సౌకర్యం లేకపోవడం తో బస్టాండ్ వెనుకలో మూత్రాలు పోయడంతో బస్టాండ్‌లో ఉండలేని ప్రయాణికులు, మహిళలు, విద్యార్థినిలు ఇబ్బందులు ఎదురుకోవడమే కాకుం డా మూత్రాల దుర్గంధంతో ప్రయాణికులు అనారో గ్యానికి గురవుతున్నారు. బస్టాండ్‌లోనే కాకుండా కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు మూత్రశాలల సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులే కాకుండా శుక్రవారం జరిగే వారసంతకు వచ్చే వ్యాపారులు, ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునే నాథులే లేరు. ముఖ్యంగా మహిళాలకు, పాఠశాల, కళాశాలలకు వెళ్ళి బస్సు కోసం ఎదురు చూసే వారికి తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి. ఆర్‌టిసి ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లు నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రయాణ ప్రాంగణంలో నీటి సౌకర్యం కల్పించడం కోసం అప్పటి ఆర్టీసి అధికారులు బోరు వేయించారు. బోరుకు పంపుసెట్టు బిగించారు. ప్రస్తుతం ఆ బోరుకు పంపుసెట్టు లేదు పంపుసెట్టు ఎక్కడ ఉందో ఇప్పటికి తెలియని పరిస్థితి ఉంది. దీంతో ప్రయాణ ప్రాంగణంలో నీటి సౌకర్యం లేకపోవడంతో రెండు అద్దె షటర్ దుకాణాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుప యోగంగానే ఉన్నాయి. దుమాల గ్రామానికి చెంది న దినసరి స్వీపర్ నర్సమ్మ తాత్కాలిక వేతనంపై ప్రతిరోజు ప్రయాణ ప్రాంగణాన్ని శుభ్రపరుస్తుంది. ఆమె నీటి సౌకర్యం లేక మూత్రశాలలకు, మరుగుదొడ్లకు తాళాలు వేసేసింది. ప్రయాణ ప్రాంగణం లో మూత్రశాలల, మరుగుదొడ్ల పరిస్థితి ఇలా ఉందంటే కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండు వరకు వివిధ దుకాణదారులు, ఈ ప్రాంత ప్రజలు మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు స్థానిక టిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్ళిన, అధికార కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి దృష్టికి, మండల తహాశీల్దార్ సుజాత, ఎంపిడివో సత్తయ్య, ఆర్టీసీ ఆర్ఎం, డిఎంల దృష్టికి తీసుకువెళ్ళిన మూత్రశాలల సమస్య ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోలేదు. మనిషికి మరుగుదొడ్ల, మూత్రశాలల సమస్య ఎటువంటిదో అర్థం చేసుకొని ఇప్పటికైనా పాత బస్టాండ్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రక్కన గ్రామపంచాయితీ పాలకవర్గం శ్రద్ధ తీసుకొని మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా ప్రయాణ ప్రాంగణంలో బోరుకు పంపుసెట్టు బిగించి నీటి సౌకర్యం కల్పించి అక్కడ కూడా మరుగుదొడ్ల మూత్రశాలల సమస్యలను పరిష్కరించా లని ప్రయాణికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

# వైద్య విద్యార్థులకు ఆర్థిక భరోసా

- బాల్య వివాహాల నిర్మూలనకు సమాజం ముందుకు రావాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- ఎంబీబీఎస్ చదువుతున్న 11 మందికి దాదాపు ఆరు లక్షల రూపాయల సాయం



**ఉప్పల్, మార్చి 2 (జనం సాక్షి):** విద్యే వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా సమాజ అభ్యున్నతికి కూడా మూలస్తంభమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ 11 మందికి దాదాపు ఆరు లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఉప్పల్ ఉప కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప కలెక్టర్ రాజు చేతుల మీదుగా చెక్కులు విద్యార్థులకు అందజేయడం జరిగింది. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతులు ఆర్థిక ఇబ్బందుల వల్ల వెనుకబడకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందిస్తున్నామని ఆయన తెలిపారు. బీఎల్ఆర్ దాతృత్వ నిధి ద్వారా విద్యార్థులకు నిరంతరం అండగా నిలుస్తామని, వైద్య విద్య అభ్యసిస్తున్నవారు భవిష్యత్తులో ప్రజలకు సేవ చేసే వైద్యులుగా ఎదిగి సమాజానికి తిరిగి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, భారత రాష్ట్ర సమితి నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సహాయం అందుకున్న విద్యార్థులు ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సందర్భంగా తెలంగాణలో నిర్వహిస్తున్న వంద రోజుల బాల్య వివాహాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బాల్య వివాహాలు సమాజానికి శాపమని, ముఖ్యంగా బాలికల భవిష్యత్తును చీకటిలో నెట్టేవని స్పష్టం చేశారు. పద్దెనిమిది సంవత్సరాల లోపు అమ్మాయిలకు, ఇరవై ఒక సంవత్సరాల లోపు అబ్బాయిలకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, యువత కలిసి చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహ రహిత తెలంగాణ సాధనకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో విద్యా ప్రోత్సాహం, సామాజిక సంస్కరణల దిశగా ఎమ్మెల్యే చేపడుతున్న చర్యలు ప్రజల్లో విశేష స్పందన పొందుతున్నాయి.

# జీపీ నిధులు గోల్‌మాల్




## మెదక్ జిల్లావ్యాప్తంగా భారీ కుంభకోణం

### పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు కుమ్మక్కు

**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 2 (జనం సాక్షి):** మెదక్ జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందు దాదాపు రెండు సంవత్సరాల పాటు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించక పోవడంతో గ్రామాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిన విషయం అందరికీ తెలిసిందే... ఈ రెండు సంవత్సరాల కాలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో అభివృద్ధి పేరిట ప్రజల కనీస వసతులు కల్పించామంటూ ప్రత్యేక అధికారి ద్వారా లక్షలాది రూపాయలు పనులు చేయించినట్లుగా బిల్లులు చేయించుకున్న పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా గ్రామానికి లక్షల రూపాయల నిధులు రెండేళ్లలో ఖర్చు పెట్టామంటూ గ్రామ కార్యదర్శులు వాళ్ల ఇష్టారీతిగా బిల్లులు చేసుకున్న వైనం తాజాగా ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తుందనడానికి పలు గ్రామ పంచాయితీల్లో గ్రామ ప్రజలు తెలుపుతున్న వివరాల ప్రకారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో లక్షల రూపాయల కుంభకోణం జరిపిన ట్లుగా తాజా సమాచారం. ఈ బిల్లుల వ్యవహారంలో స్థానిక మండల అభివృద్ధి కార్యాలయాల్లో పనిచేసే సిస్టం ఆపరేటర్లది కీలక పాత్ర ఉన్నట్లుగా ప్రాథమిక సమాచారం. గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు రెండు విడుదల నిధులు విడుదలయ్యాయి. వాటిని పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు కుమ్మక్కై స్వాహా చేశారు. పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామపంచాయతీలలో ఖర్చుపెట్టిన లక్షలాది రూపాయలు వేసుకొని గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఇచ్చినట్లుగా చెబుతున్నటువంటి వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇంతకీ గ్రామపంచాయతీ కార్యదర్శులు తీసుకున్నటువంటి లక్షల బిల్లుల్లో గ్రామాల్లో ఏ మేరకు పనిచేశారు అనేది దేవుడికిఎరుక ఉన్నట్లుగా ఉంది.

కొల్చారం మండలంలోని పలు గ్రామపంచాయతీ నిధులు పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్ కుమ్మక్కై లక్షలాది రూపాయల గ్రామపంచాయతీ నిధులు స్వాహా చేశారు. ఈ విషయమై మండల పరిషత్ అభివృద్ధి అధికారి కానీ, మండల పంచాయతీ అధికారి కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. అది నాకు సంబంధించిన విషయం కాదని ఎంపీడీవో, నేను చెప్పినా వినకుండా కంప్యూటర్ ఆపరేటర్ తన అకౌంట్లోకి డబ్బులు పంపించుకున్నారు. మీరు వార్త రాస్తే నేను ఉన్నతాధికారులకు చర్యకు ఫైలు పంపుతా అని ఎంపీ ఓ చేతులెత్తేశారు. ఇదిలా ఉండగా వరిగుంతం గ్రామానికి చెందిన యువకులు సోమవారం ఆధారాల తో సహా ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

మండలంలోని వరిగుంతం, రంగంపేట, సంగాయిపేట, పోతిరెడ్డిపల్లి, కొంగోడు గ్రామపంచాయతీలకు సంబంధించిన నిధులు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న వ్యక్తి ఖాతాలోకి నిధులు మళ్లించారని ఈ నిధులకు సంబంధించిన ఖర్చు వివరాలపై వరిగుంతం లో గ్రామసభ నిర్వహించగా గతంలో పంచాయతీ కార్యదర్శి గా పనిచేసిన వ్యక్తి ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి ఈ నిధులకు సంబంధించిన లెక్కలు గ్రామ సభలో చూపించలేకపోయారన్నారు. నిధులు మొత్తం కంప్యూటర్ ఆపరేటర్ తో కలిసి స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఇదే పరిస్థితి నెలకొందని గ్రామపంచాయతీ నిధులు కంప్యూటర్ ఆపరేటర్ అకౌంట్ లోకి ఎలా జమ చేస్తారని ఈ సందర్భంగా వరిగుంతం గ్రామ యువకులు ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం, ఎంపీఓ కృష్ణవేణి లను నిలదీశారు. ఈ విషయమే గతవారం ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటికీ పంచాయతీ కార్యదర్శులపై గాని కంప్యూటర్ ఆపరేటర్ పైగాని చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో వరిగుంతం గ్రామ బిఆర్ఎస్ నాయకులు ప్రశాంత్ తేజ పాల్గొన్నారు.

ఒక్క కొల్చారం మండలంలోని 60 లక్షల నుండి కోటి రూపాయల వరకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు పిల్లలు అందినట్లుగా ప్రాథమిక సమాచారం. జిల్లా విషయానికొస్తే కోట్ల రూపాయల్లో కుంభకోణం జరిగిందనడానికి ఎలాంటి అనుమానాలకు తావు లేదనేది నగ్నసత్యం. మండలంలో ఔట్సోర్సింగ్‌లో పనిచేసేఒక సిస్టం ఆపరేటర్లకు సంబంధించిన వారి అకౌంట్లో మండలానికి సంబంధించిన లక్షలాది రూపాయలు జమ కావడం పట్ల పలు పార్టీల నాయకులు ప్రజలు ఈ విషయంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**కార్యదర్శులపైనా చట్టరీత్యా చర్యలు :**

**రఫిక్ ఉన్నిసా, కొల్చారం మండల అభివృద్ధి అధికారి**

రెండు సంవత్సరాలుగా సర్పంచ్ లు లేకపోవడంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు త్రాగునీటి సమస్యపై ఇతర పైప్ లైన్ల విషయమై గ్రామపంచాయతీల కార్యదర్శులు తమ సొంత డబ్బులు వెచ్చించారు. వారు ఖర్చు చేసిన డబ్బులు స్థానిక సిస్టం ఆపరేటర్ సంబంధించిన వారి అకౌంట్ నుండి గ్రామపంచాయతీ కార్యదర్శులకు ట్రాన్స్ఫర్ చేయడం జరిగింది. ఒకవేళ గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించిన డబ్బుల విషయంలో అవకతవకలు జరిగిన ఎడల గ్రామపంచాయతీ కార్యదర్శులపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయి.

# మేనేపల్లి బాలమణి దారుణ హత్య


- ఎల్లకొండ జాతర నుంచి తిరిగి వస్తుండగా గొంతు కోసి హత్య
- నిందితులను వెంటనే పట్టుకుంటాం: సీఐ వెంకట్, ఎస్సై పుండ్లిక్

**నవాబుపేట్, మార్చి 2 (జనం సాక్షి):** నవాబ్‌పేట్ మండలం ఎత్త్ రాజ్‌పల్లి గ్రామానికి చెందిన మేనేపల్లి బాలమణి (45) దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బాలమణి శంకర్‌పల్లిలో కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తోంది. శనివారం ఆమె అక్క యాదమ్మ, చెల్లెలు భారతమ్మ గుబ్బడి పత్తేపూర్ నుంచి వచ్చారు. తాను కూడా ఎల్లకొండకు వెళ్తానని కుమారుడు శేఖర్‌కు చెప్పి బాలమణి ఎల్లకొండ జాతర కోసం వెళ్లింది. దేవుడి దర్శనం అనంతరం రాత్రి హనుమాన్ దేవాలయం వద్ద జరుగుతున్న భగవతం చూస్తుండగా, సుమారు 4 గంటల బస్సుకు శంకర్‌పల్లికి వెళ్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

కుమారుడు శేఖర్ ఉదయం ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అవ్వడంతో గ్రామానికి వచ్చి సీసీ కెమెరాలు చూసి సర్పంచ్‌కు సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత శంకర్‌పల్లికి వెళ్లిపోయాడు. మార్చి 2న ఉదయం 11.45 గంటల సమయంలో ఎల్లకొండ గ్రామం పులికుంట గుట్ట సమీపంలో ఓ మహిళ మృతి చెంది ఉందని సమాచారం అందింది. వచ్చి చూడగా ప్రధాన రోడ్డు సమీపంలోని పంట పొలంలో బాలమణిని దుండగులు గొంతు కోసి దారుణంగా హత్య చేసినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న సీఐ వెంకట్, ఎస్సై పుండ్లిక్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. కుమారుడు శేఖర్ తన అమ్మను గొంతు కోసి ఆమె వద్ద ఉన్న 3 తులాల బంగారం, 5 మసాలా కమ్మలు, 18 తులాల పట్ట గొలుసులు తీసుకెళ్లిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తగు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశాడు. ఎస్సై జీ. పుండ్లిక్ దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను వెంటనే పట్టుకుంటామని సీఐ వెంకట్, ఎస్సై పుండ్లిక్ తెలిపారు.

# ప్రభుత్వం పనిచేయించుకుని పైసలు ఇవ్వలేదు

**ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదు**



వీణవంక మార్చ్ 2 (జనం సాక్షి) వీణవంక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024 సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన సర్వే చేపట్టగా సర్వే చేసిన వారికి సర్వే సంబంధించిన అట్టి పైసలు రాలేదని బొంతుపల్లి సర్పంచ్ బావు సంపత్,మాజీ ఉప సర్పంచ్ చదువు జితేందర్ రెడ్డి,సోమవారం నిర్వహించిన ప్రజా వానిలో కలెక్టర్ కు పిర్యాదు చేసారు.పిర్యాదు తరువాత బావు సంపత్,చదువు జితేందర్ రెడ్డి, సంబంధించిన వివరాలు తెలిపారు 2024 చివర్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతీష్టాత్మకంగా కుల, సామాజిక,రాజకీయ,ఆర్థిక,విద్య తదితర అంశాలతో కూడిన సమగ్ర సర్వే చేయడం అందరికి విధితమే అన్నారు.అట్టి సర్వే లో భాగంగా వీణవంక మండలంలో మండల స్థాయి అధికారులను సూపర్ వైజర్సుగా, పంచాయతీ కార్యదర్శులు,వీఓ, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులను,ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులను ఎన్యుమ రేటర్లుగా, ప్రభుత్వ,ప్రవేట్ వారిని డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా మొత్తం 280మందికి పైగా ప్రభుత్వం చేపట్టిన సర్వేలో పని చేసారని జితేందర్ రెడ్డి అన్నారు.సూపర్ వైజర్లకు,ఎన్యూమరే టార్లకు 12500,12000 చొప్పున,డాటా ఎంట్రీ వారికి ఒక ఫామ్ కి ప్రభుత్వం వారికీ 15,ప్రవేట్ వారికి 30 రూపాయలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే పైన తెలిపిన లెక్క ప్రకారం వీణవంక మండలంలో పనిచేసిన వారికి సుమారు 20 లక్షల రూపాయలు రావాల్సింది ఉందని అన్నారు.ఒక్క డాటా ఎంట్రీ చేసిన 135 మందికి 4,93,200 రూపాయలు రావాలి అని ఇందులో ప్రవేట్ వారే చాలా మంది ఉన్నారని చదువు జితేందర్ రెడ్డి అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు వారి,వారి విధులు నిర్వహిస్తూనే ప్రభుత్వం చేపట్టిన సర్వేలో పని చేసారని గుర్తు చేసారు.ఇట్టి రూపాయలు కేవలం వీణవంక మండలంకే కాదని జిల్లా అంతటా ఎవరికీ సమాచారం ఉందని వారన్నారు.సర్వే చేసిన వారికీ డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నుండి రాలేదా లేక జిల్లా స్థాయిలో ఆగిపోయావా అనే విషయం పరిశీలన చేసి, జిల్లాలో సర్వేలో పనిచేసిన వారందరికీ వెంటనే డబ్బులు అందేలా చూడాలని బావు సంపత్,చదువు జితేందర్ రెడ్డి లు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

## ఫర్టిలైజర్ షాప్‌ని తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి యోగితా

**కథలాపూర్, మార్చి 2(జనం సాక్షి ) :** కథలాపూర్ మండలంలోని వ్యవసాయ అధికారిని పెగ్గర్ల గ్రామంలో మహేష్ ఫెర్టిలైజర్స్ భూషణరావుపేట గ్రామ శ్రీ వేద ఫెర్టిలైజర్ తనిఖీ చేశారు ఇందులో భాగంగా పీసీలు లేనందున మరియు లైసెన్సులు అమెండ్మెంట్ లేనందున మొత్తం స్టాకును స్టాప్ సెల్ చేయడం జరిగింది 15 రోజులు స్టాప్ సెల్లు నిలిపివేయడం జరిగింది శ్రీదేవి శ్రీ వేద ఫర్టిలైజర్ నందు పీసి ఉన్నప్పటికీ అవి లైసెన్సులు అమెండ్మెంట్ లేనందున స్టాక్ మొత్తానికి స్టాప్ సెల్ ఇవ్వడం జరిగింది. నోటీసు అదేవిధంగా స్టాక్ బోర్డు ధరల పట్టిక స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా పూర్తి వివరాలతో ఉండాలని హెచ్చరించడం జరిగింది.

# మాటలు కాదు చేతల ప్రభుత్వం

- తాండూరును అభివృద్ధి చేసుకుందాం.. బాల్ భచన్ పైలెట్ రోహిత్ రెడ్డి
- గత పాలకుల నిర్లక్ష్యంతో కోట్‌పల్లి అభివృద్ధి దూరం : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితం



**తాండూరు, మార్చి 2 (జనం సాక్షి):** మాటలు కాదు చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తాండూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని, సంపూర్ణ మద్దతు ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తాండూరును అభివృద్ధి బాటలో నడిపిస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో ముందుకు సాగుతామని అన్నారు. ప్రజలు విశ్వాసంతో తాండూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాలు ఇచ్చారని, గత రెండేళ్లుగా ఎమ్మెల్యేగా చేసిన పనితీరును చూసి ఓటు వేయాలని కోరగా ప్రజలు పూర్తిగా మద్దతుగా నిలిచారని తెలిపారు. ఎన్నో కుట్రలు జరిగినప్పటికీ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు కృషి చేస్తారని పూర్తి విశ్వాసం ఉందని, ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు, అనంతరం తాండూరు అభివృద్ధే మా ఎజెండా అని స్పష్టం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో కోట్‌పల్లి అభివృద్ధి దూరమైందని, బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని విమర్శించారు. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నప్పుడు అభివృద్ధి చేశామని, కరోనా పేరుతో కాలయాపన చేశారని, ఎమ్మెల్యే ఎన్నికల్లో 35 రోజులలోనే కనుమరుగయ్యారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గల్లంతు ఖాయమని, తాండూరు వైపు చూడడానికి భయపడే విధంగా చూపిస్తామని హెచ్చరించారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు ప్రజలు మొగ్గు చూపారని, మున్సిపల్ 75 సంవత్సరాల వేడుకలు ఘనంగా జరుపుకుందామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేశామని, త్రాగునీటి సమస్యపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో కాగ్నా వాటర్ సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిగి సభలో మాటిచ్చారని తెలిపారు. ఎమ్మెల్యేగా మాట్లాడిన దానికంటే చేసిన అభివృద్ధి ప్రజల ముందే కనిపిస్తుందని, మాజీ ఎమ్మెల్యే సొంత మండలంలోనే అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని, విమర్శలు చేసేవారు వాస్తవాలను గుర్తించాలన్నారు.

గత ఎమ్మెల్యే కరోనా పేరుతో అభివృద్ధి జరగలేదని చెప్పడం సరికాదని, అప్పుడు మీ సొంత అభివృద్ధి ఎలా జరిగిందో ప్రజలకు వివరించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో మాజీ ఎమ్మెల్యే టీజర్, సినిమాతో పాటు ఆయన సినిమా టాకీస్ కూడా బంద్ అయ్యాయని వ్యంగ్యంగా అన్నారు. ఇప్పుడు రాజకీయాలు చేసే సమయం కాదు, అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టే సమయమని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం పై కాంగ్రెస్ జెండా ఎగరడం సంతోషంగా ఉందని, రైతు కుటుంబానికి ప్రజలు పట్టం కట్టారని, బారమైనా కష్టపడి పనిచేశామని తెలిపారు. పరమమేశ్వరుని ఆశీస్సులతోనే ఘనవిజయం సాధ్యమైందని, శివుని రూపంలో మనోహర్ రెడ్డి ఎలాంటి మచ్చలేకుండా పనిచేశారని, ఇక ముందూ మచ్చలేని పనులు చేస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని, కక్షాపట్టుదలతోనే చైర్‌పర్సన్‌గా విజయం సాధించామని అన్నారు. పట్టణాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామని, సమస్యలపై దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

అనంతరం మున్సిపల్ కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వనాథ్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్ రాహుఫ్, పట్లోళ్ల నర్సింహ, నయీం అప్పు, మహిళా నాయకురాళ్లు మమత, మాధవి, ప్రభావతి తదితరులు, తాజా మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో ప్రైవేట్ హాస్పిటల్స్ మాఫియా

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు

- ధనార్జనే ధ్యేయంగా వైద్య సేవలు
- పేరుకే స్పెషాలిటీలు.. సౌకర్యాలు నీల్
- ప్రైవేట్ హాస్పిటల్లో మౌలిక సదుపాయాలు కరవు



**మహేశ్వరం, మార్చి 2 (జనంసాక్షి):** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్, బడంగ్‌పేట్, తుక్కుగూడ, మహేశ్వరం, కందుకూరు మండలాల కేంద్రాల్లో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్లు, మెడికల్ షాపుల్లో మాఫియా వ్యవహారం మూడు పువ్వులు ఆరు కాయల్లా నడుస్తుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ప్రైవేట్ హాస్పిటల్స్ రోజురోజుకూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వైద్య చికిత్స కోసం వచ్చే ప్రజలతో ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా వైద్య సేవలు నడిపిస్తున్నారు. తుక్కుగూడలోని శ్రీ విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో రావిరాల గ్రామానికి చెందిన హోంగార్డు సంతోష్ వైద్య చికిత్స కోసం మార్చి 1న గుండె నొప్పితో ఆసుపత్రికి వచ్చాడు. సంతోష్‌కు ఆసుపత్రి వైద్యులు సరియైన సమయానికి తగిన చికిత్స అందించకపోవడం వల్లనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మహేశ్వరం మండలంలోని మాక్స్‌వెల్ హాస్పిటల్లో వైద్య సేవలు వికటించి గతంలో ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. బాలాపూర్, బడంగ్‌పేట్, తుక్కుగూడ, మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని కేంద్రాల్లో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాన్ని ఆసరాగా తీసుకొని ధనార్జనే ధ్యేయంగా వైద్య సేవలు నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు మాట్లాడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు సామాన్య ప్రజల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆసుపత్రుల్లో చికిత్స కోసం అడ్మిట్ చేసుకునే సమయంలో ఒక రేట్ అమౌంట్ చెబుతారు. డిశ్చార్జ్ చేసే సమయంలో బెడ్ బిల్, మెడికల్ బిల్ పేరుతో విచ్చలవిడిగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో డబ్బులను దోచుకుంటున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల పేరు సూపర్, మల్టీ స్పెషాలిటీలుగా ఉంటుంది. కానీ ప్రజలకు కావాల్సిన పార్కింగ్, వాష్‌రూమ్స్, త్రాగునీరు లాంటి మౌలిక సదుపాయాలు ఉండవు. మౌలిక సదుపాయాలు లేక వైద్య చికిత్స కోసం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్యశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
3 మార్చి 2026

## ఐటీ కారిడార్‌లో 6.30 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా

- రూ. 600ల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్




**హైదరాబాద్, మార్చి 02 (జనంసాక్షి) :** ఐటీ కారిడార్‌కు ఆనుకుని గంధంగూడలో 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ. 600 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ సర్వే నంబరు 86/పి లో 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని జలమండలికి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ స్థలంలో రకరకాల పేరిట ఆక్రమణలు చేస్తూ వస్తున్నారు. కొన్ని షెడ్డులు కూడా వేసి కబ్జా చేశారు. జలమండలి నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం ప్రభుత్వం కేటాయించినదిగా గుర్తించారు. ఆ భూమిని ఆక్రమించి కొంతమంది వేసిన షెడ్డులను తొలగించింది. మొత్తం 6.30 ఎకరాల జలమండలికి కేటాయించిన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

## తెలంగాణలో బుల్డోజర్ పాలన

- పేదల ఇళ్లు కూలుస్తున్న విషయం రాహుల్‌కు తెలియదా?
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



**హైదరాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** యూపీలో మాదిరిగానే తెలంగాణాలో కూడా సీఎం రేవంత్ రెడ్డి పాలనలో బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు . రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పేద ప్రజల ఇళ్లను నేలమట్టం చేస్తున్న విషయం రాహుల్ గాంధీకి తెలియదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అరాచకాలపై మౌనంగా ఎందుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు .గత రెండున్నర ఏళ్లలో రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తున్నారు.. వెళ్తున్నారు.రాష్ట్ర అభివృద్ధి మాత్రం ముందుకు పోవటం లేదని ఆరోపించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో అధికారులు పేదల ఇండ్లను కూల్చివేయడం తో ప్రస్తుతం గాజాలా మారిందని పేర్కొన్నారు.యుద్ధం జరిగితే ఎలా ఉంటుందో ఇప్పుడు వెలుగుమట్ల పరిస్థితి అలానే ఉందని అన్నారు. రాహుల్ గాంధీ ఖమ్మం వెళ్లి రోడ్డున పడ్డ ప్రజల దీనస్థితిని తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం పార్లమెంట్‌లో రాహుల్ కొట్లాడాలని కోరారు. పేద ప్రజల ఇళ్లు కూల్చిన చోటే కట్టించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందని అన్నారు.

## అంబర్‌పేటలో వ్యాపారి కుటుంబం ఆత్మహత్య

- కేసును ఛేదించిన పోలీసులు
- అప్పుల వారి వేధింపులే కారణమని వెల్లడి



**హైదరాబాద్, మార్చి2 (జనంసాక్షి) :** అంబర్‌పేట్‌లో కుటుంబం ఆత్మహత్య కేసును పోలీసులు ఛేదించారు. గత నెల 24న రామ్‌రాజ్‌తో పాటు అతడి భార్య మాధవి, కుమారుడు శశాంక్ రాజ్ బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. కుటుంబం ఆత్మహత్యకు గల కారణాలను సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత మూర్తి మీడియాకు తెలియజేశారు. అధిక వడ్డీతో హ్యాండ్‌లోన్ తీసుకుని తిరిగి ఇచ్చే వ్యవహారంలో వేధింపులకు గురి చేసిన కారణంగానే కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. 'మృతుడు రామ్‌రాజ్.. మల్లాపూర్, చక్రిపురం ప్రాంతంలో 'కింగ్స్ బిర్యానీ' హోటల్‌ను నిర్వహిస్తున్నారు. హోటల్ నిర్వహణ కోసం పలువురి నుంచి సుమారు 57 లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించే విషయంలో అధిక వడ్డీ తీసుకుని, బ్లాక్ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, ఒరిజినల్ భూమి డాక్యుమెంట్లు తీసుకుని తీవ్ర వేధింపులకు గురిచేశారు నిందితులు. ఆత్మహత్య చేసుకునే రోజు కూడా వేధింపులు కొనసాగించడంతో మనస్తాపంతో రామ్‌రాజ్ తన భార్య, కుమారుడితో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి కుమార్తె అమూల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంబర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు' అని సికింద్రాబాద్ జోన్ డీసీపీ వెల్లడించారు. మృతుడు రాసిన సూసైడ్ నోట్‌లో నలుగురు నిందితుల పేర్లు ప్రస్తావించడంతో పోలీసులు వారిని గుర్తించి అరెస్టు చేశారన్నారు సికింద్రాబాద్ జోన్ డీసీపీ. నిందితులు మహమ్మద్ వాసి, రాజశేఖర్ రెడ్డి, మహమ్మద్ నవాజ్, సయ్యద్ మాజీద్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. హ్యాండ్‌లోన్‌ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత మూర్తి సూచించారు.

## రాజ్యసభకు మరో రెండురోజులే గడువు

- వికారాబాద్ సభలో రాజ్యసభ ప్రస్తావన
- సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక
- సంఘ్విని తమిళనాడు నుంచి పంపాలని సూచన



**వికారాబాద్, మార్చి 2 (జనంసాక్షి) :** రాజ్యసభ నామినేషన్లకు మరో రెండు రోజుల గడువే ఉంది, ఈ రెండు స్థానాలను బలం రీత్యా కాంగ్రెస్ గెలచుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు అబ్యరథులను ఖరారు చేయలేదు. వికారాబాద్ వేదికగా జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అగ్రనేతలు మధ్య సోమవారం కీలక చర్చ జరిగిందని సమాచారం. సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయని బలమైన నేతలకు ఈ సీట్లు కేటాయించాలనే అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎంపీల రేసులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య పేర్లను ఈ సందర్భంగా వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించేలా పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ రాజ్యసభ సభ్యుల ఎంపికపై జరిగిన చర్చలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీని తమిళనాడు నుంచి రాజ్యసభకు పంపేందుకు తెలంగాణ నేతలు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. 2026, ఫిబ్రవరి 18వ తేదీన రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లోని మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఆ జాబితాలో తెలంగాణ నుంచి 2 స్థానాలు ఖాళీ కానున్నాయి. బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ పదవులు ముగియనున్నాయి. వీరి పదవి కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీల ఎన్నిక అనివార్యమైంది. రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల దాఖలు చేసే చివరి తేదీ: మార్చి 5 కావడంతో ఎంపిక త్వరగా చేయాలని ఒత్తిడి పెంచారు.

# మహిళా భద్రత, సాధికారతకు సమగ్ర కార్యాచరణ

- సచివాలయంలో పలు కీలక శాఖలతో మంత్రి సీతక్క విస్తృత సమీక్ష
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మరిన్ని సంక్షేమ పథకాల వరాలు
- స్పష్టం చేసిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర సచివాలయం లో మహిళల భద్రత, సంక్షేమం, సాధికారత కోసం అవలంబించాల్సిన నూతన విధానాలపై పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి , మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క పలు కీలక శాఖల ఉన్నతాధికారులతో విస్తృత సమీక్షా సమావేశం సోమవారం నాడు నిర్వహించారు. మహిళా భద్రతను మరింత సమగ్రంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సమావేశానికి ఉన్నతాధికారులు సంజయ్ కుమార్, శికా గోయల్, క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, ప్రియాంకా వర్గీస్, శృతి ఓజా, దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఇప్పటికే అమలులో ఉన్న షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, సైబర్ క్రైమ్ నియంత్రణ చర్యలు సమర్థవంతంగా పనిచేస్తున్నప్పటికీ, విద్యాసంస్థలు, హాస్టళ్లు, కార్యాలయాలు, రాత్రి వేళల ప్రయాణాలు, డిజిటల్ వేదికలు, అసంఘటిత రంగం వంటి విభిన్న రంగాల్లో ఇంకా వ్యవస్థాపరమైన లోపాలు ఉన్నాయని సమావేశం అభిప్రాయపడింది. వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా భద్రతను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా మౌలిక వసతులు, సాంకేతికత, అవగాహన, పర్యవేక్షణ, బాధ్యతాయుత పరిపాలనల సమన్వయంతో చూడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల రక్షణ కోసం విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థల్లో,కంపెనీల్లో ఐసీసీ కమిటీలకు తప్పనిసరి ఆడిట్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. రాత్రి 8 గంటల తర్వాత మహిళా ఉద్యోగులకు జీపీఎస్ అనుసంధానిత సురక్షిత రవాణా విధానం ఉండాలని సూచించారు. అసంఘటిత రంగ మహిళల కోసం ప్రత్యేక నమోదు, గుర్తింపు కార్డు, ఫిర్యాదు వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రజా రవాణాలో సీసీటీవీ పర్యవేక్షణను బలోపేతం చేసి పీక్ అవర్స్‌లో భద్రతా ఆడిట్లు నిర్వహించాలని నిర్ణయించారు. సైబర్ మార్ఫింగ్, స్టాకింగ్, బ్లాక్‌మెయిల్ వంటి నేరాలపై వేగంగా స్పందించడంతో పాటు బాధితులకు కౌన్సెలింగ్ కల్పించాలన్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగ మహిళల రక్షణకు ప్రత్యేక విధానాలు రూపొందించాలన్నారు. గృహ హింస కారణంగా ఒంటరిగా మిగిలిన మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో రుణాలు అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఆశ్రయ గృహాలు, హాస్టళ్ల భద్రతపై డిజిటల్ పర్యవేక్షణ ప్రోటోకాల్ అమలు చేయాలని ఆదేశించారు. మహిళల భద్రతకు సంబంధించి హెం, మహిళా శిశు సంక్షేమ, విద్య, కార్మిక, రవాణా, మున్సిపల్ పరిపాలన, ఐటి, ఆరోగ్య శాఖల సమన్వయంతో రాష్ట్ర స్థాయి మహిళా భద్రత కన్వర్జెన్స్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు.

మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులందరికీ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్స్ సిద్ధం చేయాలని, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్స్ చట్టపరమైన రక్షణతో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లైంగిక వేధింపుల కేసుల పురోగతిపై పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాల కోసం ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించాలని, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లలో చేరిక ప్రక్రియను ప్రభుత్వ యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.

"మహిళల భద్రత అనేది ఒక్క శాఖ బాధ్యత కాదు, అది ప్రభుత్వ సమగ్ర కర్తవ్యం. నిర్లక్ష్యానికి చోటులేకుండా, బాధ్యతతో, సాంకేతికతతో, సమన్వయంతో పనిచేస్తేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుంది" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మహిళా సాధికారతకు అవసరమైన పలు కీలక పథకాలను రూపొందించి సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతో త్వరలో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలోనే మహిళలకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇవ్వాల్సిన ఇందిరమ్మ మహిళా శక్తి యూనిఫాం సారీల డిజైన్లను మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవ రాజన్ పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులను సూచించారు. కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా పంపిణి చేస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు

## జనాభా దామాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్‌లు పెంచాలి


- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఈమేరకు తీర్మానం చేయాలి
- ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాలి
- విద్య, ఉద్యోగాల్లోనే కాదు ఉప కులాలకు రాజకీయ రిజర్వేషన్లు సైతం దక్కాలి
- ఎస్సీ రిజర్వేషన్ల పెంపునకు జాగృతి దళిత సంఘాలతో కలిసి ఉద్యమిస్తుంది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఎస్సీ ఉప కులాల నేతలతో సమావేశం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్టు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టం అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉప కులాల నాయకులతో సమావేశం అయ్యారు. పెరిగిన ఎస్సీల జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి.. ఇందుకోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం తీర్మానం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చేపట్టే జనగణన పూర్తి అయి అధికారికంగా లెక్కలు ప్రకటించిన తర్వాత ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించిందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా రిజర్వేషన్ ల పెంపునకు అసెంబ్లీ లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉప కులాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ రిజర్వేషన్లు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ ఉప కులాలతో కలిసి రిజర్వేషన్ల పెంపు సహా వారి సమస్యల పరిష్కారం కోసం జాగృతి ఉద్యమిస్తుందని తెలిపారు. ఎస్సీ ఉప కులాల్లో కొన్ని కులాలకు క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 20 ఎస్సీ ఉప కులాల ప్రతినిధులు పాల్గొన్నారు

## మూసీపై బీఆర్ఎస్, బీజేపీల గోల

- గుజరాత్ వెళ్లి వివరాలు తెలుసుకోవాలి
- మండిపడ్డ మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, మార్చి2 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో మూసీ ప్రక్షాళన చేసి గోదావరి నీటిని తెచ్చి కలపాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తుంటే భాజపా, భారాసలు అడ్డుపడుతున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. మూసీ ప్రక్షాళనతో నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సబర్మతి నది ప్రక్షాళనకు, మూసీ ప్రక్షాళనతో సంబంధం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అంటున్నారని, ఆయన మాటలన్నీ అవాస్తవాలని తమ పరిశీలనలో తేలిందన్నారు.గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి నదిని 22 కిలోమీటర్ల దూరం ప్రక్షాళన చేయడానికి గుజరాత్ ప్రభుత్వం పది వేలమందిని తరలించినట్లు అక్కడి అధికారులే స్వయంగా చెప్పారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలసి ఆయన సబర్మతి రివర్ ఫ్రంట్‌ను సందర్శించారు. అలాగే విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డిలతో కలిసి ఆనంద్ అమూల్ పాల కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబర్మతి నీటిని ప్రక్షాళన చేసి పంటలకు అందిస్తున్నారని తెలిపారు. సబర్మతికి నీళ్లు నర్మదా నది నుంచి వస్తుంటే మూసీకి గోదావరి నుంచి తేవాలనేది రాష్ట్రప్రభుత్వ సంకల్పమని వివరించారు. సబర్మతి ప్రక్షాళనకు 2004 నుంచి 2014 వరకు 10 వేల మందిని తరలించినట్లు గుజరాత్ అధికారులు చెప్పారని, కానీ ఎవరినీ తరలించలేదని రామచందర్‌రావు అబద్ధాలా డుతున్నారని శ్రీహరి మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన చేపట్టకుండా.. మురికి కూపంలోనే బతుకుదామా అని ప్రశ్నించారు. రేవంత్‌మూసీ ప్రక్షాళన చేస్తే ఎప్పటికీ సీఎంగా ఉండిపోతారని భయపడి భాజపా, భారాస నేతలు వ్యతిరేకిస్తున్నారని చామల చెప్పారు. హరీశ్, రామచందర్‌రావు సబర్మతి ప్రక్షాళన జరిగిన తీరుచూసి మాట్లాడాలన్నారు. అలాగే గుజరాత్ తరహాలో తెలంగాణలో పాడి రంగాన్ని అభివృద్ధి చేస్తామని, రైతులకు ఆదాయం, మహిళలకు ఆర్థిక సాధికారత, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శ్రీహరి తెలిపారు. మంత్రి తదితరులు ఆదివారం గుజరాత్‌లోని అమూల్ పాల ఉత్పత్తి ప్లాంటును సందర్శించారు.

## లక్ష్మీదేవిపల్లి రైతుల ఆందోళన

**సిద్దిపేట, మార్చి2 (జనంసాక్షి) :** సమస్యల పరిష్కారానికి సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవి పల్లిలో అన్నదాతలు రోడ్డెక్కారు. సిద్దిపేట – ముస్తాబాద్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. అలాగే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ద్వారా సాగుకు కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. ఈ ధర్నాలో నారాయణపేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు రైతులకు సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుడి పట్ల కలెక్టర్ ఉదారత

- చేతికి గాయం చూసి వైద్య సాయానికి ఆదేశం

**జనగామ, మార్చి2 (జనంసాక్షి) :** జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తొలి సారి నిర్వహించిన ప్రజావాణిలో ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన చెరుకు సోమనర్సయ్య తన భూ సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి రాగా అర్జీదారుడి చేతిపై దురదతో వాపు ఉండడాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ గమనించారు. చేతికి ఏమైందని బాధితుడిని కలెక్టర్ అడగ్గా మూడు రోజుల క్రితం చేతిపై జెర్రి పాకిందని సోమనర్సయ తెలుపడంతో అతడిని వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు పంపించాలని డీఎంహెచ్ వోను ఆదేశించారు. బాధితుడికి ఒక వ్యక్తిని సహాయంగా హాస్పిటల్‌కు పంపించి చికిత్సను అందించారు. డాక్టర్ల సూచన మేరకు అవసరమైన మందులు తీసుకున్న బాధితుడు ఆ తర్వాత మళ్లీ ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వైద్య సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత సదరు బాధితుడు వచ్చిన భూ సమస్య పై కలెక్టర్ కు అర్జీ సమర్పించి వెళ్లాడు. ఇంట్లోవారి ఆరోగ్య సమస్యల గురించి కుటుంబ సభ్యులే సరిగా పట్టించుకోని ఈ కాలంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించిన తీరును పలువురు ప్రశంసించారు.

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

- ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్



**హైదరాబాద్, మార్చి2 (జనంసాక్షి) :** మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగళశారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే, దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలవ్వనుంది. ఇండియాలోని చాలా రాష్ట్రాల్లో బ్లడ్‌మూన్‌ను చూడాలంటే సూర్యాస్తమయం వరకు వేచి చూడాల్సిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం కూడా తెలుగు రాష్ట్రాలకు ఉండనుంది. భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి, కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీని వల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు కాబట్టి.. దాన్ని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుంది. అయితే, ఇండియాలోని ప్రజలు బ్లడ్‌మూన్‌ను కొంత సమయం పాటు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. దేశంలోని చాలా నగరాల్లో 7 నుంచి 25 నిమిషాల పాటు బ్లడ్‌మూన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు దాదాపు 20 నిమిషాలకుపైగా సమయం వరకు గ్రహణాన్ని వీక్షించనున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భారతదేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లో త్వరగా చంద్రోదయం అవుతుంది కాబట్టి గ్రహణం ఎక్కువ సేపు ఉంటుంది. ఇటానగర్,గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో గ్రహణం అత్యంత స్పష్టంగా, ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370